జన్మభూమి మా ఊరు 2018
అభివృద్ధి సాధిద్దాం - జైత్రయాత్ర సాగిద్దాం

ఆంధ్రజ్యోతి

పేదరికాన్ని రూపుమాపి నవ్యాంధ్రప్రదేశ్‌ని సాకారం చేసుకుందాం!
జై జన్మభూమి! జై ఆంధ్రప్రదేశ్!

మంగళవారం | 2-1-2018 | పేజీలు: 24 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 సంచిక: 258 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 7.54 వరకు తదుపరి పాడ్యమి తె.4.08; నక్షత్రం: ఆరుద్ర ఉ. 11.47 వరకు తదుపరి పునర్వసు; వర్జ్యం: రా. 10.18-11.42; దుర్ముహూర్తం: ఉ. 9.02-9.46, రా. 10.16-10.56; అమృతఘడియలు: తె. 6.42-8.06; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.49 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

జన్మభూమి మా ఊరు 2018

ప్రజలే ముందు PEOPLE FIRST 1100

5వ విడత, జనవరి 2-11

అభివృద్ధి సాధిద్దాం - జైత్రయాత్ర సాగిద్దాం

గత మూడున్నరేళ్ళలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి పటిష్ట నాయకత్వంలో ప్రతి సవాలును ఒక సదవకాశంగా మార్చుకున్నాం.

- రాష్ట్రంలోని ప్రతి ఇంటికి నిరంతర విద్యుత్ సరఫరా, ఎల్‌పిజి కనెక్షన్లు .
- 2018, మార్చి 31 నాటికి 100% ఓడిఎఫ్ రాష్ట్రంగా అవతరించాలని లక్ష్యం, ఇప్పటికే ఈ దిశగా 80% సంపూర్ణం.
- పట్టిసీమ, పురుషోత్త పట్నం పూర్తి చేసాం, బృహత్తరమైన పోలవరం ప్రాజెక్టు చేపట్టాం. లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసే సాగునీరు, కోట్లాది ప్రజల దాహార్తిని తీర్చే తాగునీరు.
- రూ. 24,000 కోట్ల రుణాల మాఫీతో రైతన్నలకు అండగా నిలిచాం.

పేదరికాన్ని రూపుమాపి నవ్యాంధ్రప్రదేశ్‌ని సాకారం చేసుకుందాం!

జై జన్మభూమి! జై ఆంధ్రప్రదేశ్!


ఆరోగ్యం ఆనందం


స్వచ్ఛాంధ్రప్రదేశ్


విద్య - వికాసం


సంక్షేమం సంతృప్తి


సహజ వనరులు- అభివృద్ధి





విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్- పేదరికంపై గెలుపు


మౌలిక సదుపాయాలు

REAL TIME GOVERNANCE

సుపరిపాలన - టెక్నాలజీ వినియోగం


ఆనంద లహరి



జారీచేసినవారు: కమిషనర్, సమాచార - పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

S & D



హాంకాంగ్‌లో టాక్సీలు వద్దు

ఏ దేశంలో ఏముంది?
Foreign

హాంకాంగ్.. ఒకప్పుడు బ్రిటన్ ఆధీనంలోను.. ప్రస్తుతం చైనా పాలన కింద ఉన్న అత్యాధునికమైన ద్వీపం. అందమైన సందర్శన స్థలాల దగ్గర నుంచి అత్యాధునికమైన టెక్నాలజీ పార్కుల దాకా అనేక ఆకర్షణీయమైన స్థలాలున్న ఈ దేశంలో ఎలా మెలగాలో తెలుసుకుందాం..

అక్కడి సిమ్‌లు వద్దు..

హాంకాంగ్‌లో ప్రజలు కొత్తవారిని చాలా ఆత్మీయంగా పలకరిస్తారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లటానికి మెట్రో రైళ్లు.. బస్సులు ఉంటాయి. ట్యాక్సీలు కూడా దొరుకుతాయి. అయితే మెట్రోతో పోలిస్తే ట్యాక్సీల చార్జీలు చాలా ఎక్కువ. ఇక మొబైల్స్ విషయానికి వస్తే- స్థానికంగా సిమ్ కార్డులు వేసుకుంటే ఖరీదు ఎక్కువ అవుతుంది. నెట్ బ్రౌజ్ చేయాలంటే.. అక్కడి సిమ్ వేసుకుని మొబైల్ డేటా రీచార్జ్ చేయించుకోవక్కర్లేదు. హాంకాంగ్‌లో చాలా ప్రాంతాల్లో ఉచిత వైఫై లభిస్తుంది. దాన్ని వాడుకోవచ్చు.

నీళ్లు ఎక్కువ తాగాలి..


హాంకాంగ్ సముద్రతీర ప్రాంతం కావటం వల్ల ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అక్కడ పల్చటి దుస్తులను వాడాలి. అక్కడ ఉన్నంత కాలం ఎక్కువగా నీళ్లను తాగాలి. లేకపోతే సొమ్మసిల్లిపోయే అవకాశముంది. వీలైనంత వరకూ నడవకుండా ట్రైన్లను, బస్సులను వాడుకుంటే మంచిది. అంతేకాకుండా సౌకర్యవంతమైన షూలను కూడా వేసుకోవాలి.

షాపులు తెరవటం ఆలస్యమే..

హాంకాంగ్‌లో షాపులను ఆలస్యంగా తెరుస్తారు. అందువల్ల ఉదయాన్నే నెమ్మదిగా బ్రేక్‌ఫాస్ట్ చేసి ఆ తర్వాత షాపింగ్‌కు వెళ్తే మంచిది. హాంకాంగ్‌లో పెద్ద పెద్ద మాల్స్‌తో పాటు రోడ్ల పక్కన ఉండే షాపులు కూడా అనేకం ఉంటాయి. చిన్న చిన్న ఎలక్ట్రానిక్ వస్తువులు ఇలాంటి షాపుల్లో కొన్నా పర్వాలేదు కానీ ఎక్కువ ధర ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను షోరూంలలోనే కొనుగోలు చేస్తేనే మంచిది. లేకపోతే మోసపోయే అవకాశం కూడా ఉంటుంది.

– స్పెషల్ డెస్క్





‘ఫిదా’ సినిమాలో హీరోయిన్ సాయి పల్లవి.. ట్రాక్టర్ తోలుతుంది. వ్యవసాయ పనులూ చేస్తుంది. తండ్రికి అన్ని విధాలా చేదోడువాదోడుగా నిలుస్తుంది. అయితే అది సినిమా. పాక్, అఫ్గానిస్తాన్‌లో కొందరు అమ్మాయిలు నిజంగానే అబ్బాయిల్లా పెరుగుతారు. తల్లిదండ్రులకు కొడుకులు లేని లోటు తీర్చడానికి! పురుషాధిక్యత, ఛాందస వాదం, ఉగ్రదాడులు, తాలిబన్ల ఫత్వాలు, తరతరాల వివక్షా పరదాల నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు అండగా నిలిచేందుకు! అక్కడ మాత్రమే కనిపించే బచ్చాపోష్ సంస్కృతి ఇది. బచ్చాపోష్ అంటే.. అబ్బాయి వేషంలోని అమ్మాయి!

కూతుళ్లే కొడుకులు

పాక్, అఫ్ఘానిస్థాన్‌లలో ‘బచ్చాపోష్’ సంస్కృతి.. అమ్మాయిలను అబ్బాయిలుగా పెంచే వైనం



చాలా దేశాల్లో యువతులకు స్వేచ్ఛ లేదు. సమానత్వం అంతకంటే లేదు. కానీ మన పొరుగునున్న పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లలో కనీసం అమ్మాయి అమ్మాయిలా కూడా పెరగలేదు. మారువేషాల్లో అబ్బాయిల్లా బతకాల్సిన దుస్థితి! వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం! ప్యాంటు చొక్కా వేసుకుని, చిన్న హెయిర్‌కట్‌తో అమాయకంగా చూసే అమ్మాయిలు.. పాక్, అఫ్గాన్లలోని ప్రతి ఊరిలో కనిపిస్తారు..వివక్షను మౌనంగా ప్రశ్నిస్తూ!

వందల ఏళ్ల చరిత్ర

పాకిస్తాన్, అఫ్ఘానిస్థాన్‌లలో బచ్చాపోష్‌కి వందల ఏళ్ల చరిత్ర ఉంది. మగపిల్లలు లేని కుటుంబాల్లో ఓ ఆడపిల్లను బచ్చా పోష్‌గా మారుస్తారు. అబ్బాయి పేరుతోనే పిలుస్తారు. జుత్తు కత్తిరించి క్రాపు చేయిస్తారు. ప్యాంటు చొక్కా వేసి నెత్తిన టోపీ పెడతారు. ఇక ఆ ఇంటికి ఆ అమ్మాయే అబ్బాయికింద లెక్క! మగ సంతానం లేని సుల్తానులు, సంపన్నులు తమ ఆస్తులను కాపాడుకోవడానికి ఏనాడో మొదలుపెట్టిన బచ్చా పోష్ పద్ధతి ఇప్పటికీ అఫ్ఘానిస్థాన్‌లో కొనసాగుతూనే ఉంది. సోవియట్-అఫ్గాన్ యుద్ధం 1979 నుంచి 1989 వరకూ సాగింది. ఇక 2001 నుంచి తాలిబన్లకు-అమెరికా దళాలకు మధ్య పోరు సంగతి తెలిసిందే. పోరు ఏదైనా, ఆధిపత్యం ఎవరిదైనా.. కాబూల్లో మహిళల పరిస్థితి దయనీయం! భర్తలను కోల్పోయిన మహిళలు.. పిల్లలను సాకడానికి ఇంటి నుంచి ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి! మగపిల్లాడు లేని ఇంటిని అఫ్గాన్ సమాజం గుర్తించని దుస్థితి! గౌరవం ఇవ్వదు. భద్రత లేదు. దీంతో మగపిల్లలు లేని వేలాది తల్లులు.. ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు.



నజ్లా తోఫాన్



కాబూల్‌కి చెందిన నజ్లా తోఫాన్‌ది మరో విషాద గాథ! ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో తండ్రి చనిపోయాడు. అమ్మ తప్ప ప్రపంచంలో ఆమెకు ఎవ్వరూ లేరు. అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లు ఎవ్వరూ లేరు. మగాడే అధికుడనే ఆఫ్ఘన్ సమాజం కోసం నజ్లను బచ్చాపోష్‌గా మార్చింది తల్లి. ఇల్లు దాటితే కుర్రాళ్లు వింతగా చూస్తారు. వెకిలి వేషాలు వేస్తారు. అందుకే తనను తాను కాపాడుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటోంది నజ్ల!



అసియా

పద్నాలుగేళ్ల అసియాను చూస్తే అమ్మాయంటే అస్సలు నమ్మలేం! ‘నా గురించి తెలియని అమ్మాయిలు ఐ లవ్ యూ చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి’ అంటుంది అసియా నవ్వేస్తూ! అయితే నిత్యం ఎవరో ఒకరు నువ్వు అమ్మాయివా? అబ్బాయివా? అని ఏడిపిస్తూనే ఉంటారు. నువ్వు బచ్చా పోష్ అంటూ రోడ్డుమీద అరుస్తారు. ఆ మాట విన్నప్పుడల్లా అసియాకు మనస్సు చివుక్కుమంటుంది. ‘ఏం ఇంట్లో మగపిల్లాడు పుట్టకపోతే నన్ను అలా మార్చేస్తారా? ఇతర దేశాల్లో అమ్మాయిలు, అబ్బాయిలు సమానం. ఆఫ్ఘన్‌లో ఎందుకీ వివక్ష’ అని అసియా ప్రశ్నిస్తూనే ఉంటుంది.

అబోస్ ఫాజిల్య

తండ్రి చేసిన తప్పులకు బాధితురాలిగా మిగిలింది అబోస్ ఫాజిల్య! డ్రగ్స్‌కి బానిసైన తండ్రి నడవలేని స్థితికి చేరుకున్నాడు. చెల్లి అమ్మ కడుపులో ఉన్నప్పుడే కుటుంబాన్ని వదిలేశాడు. దీంతో మగపిల్లాడు లేని ఇంటికి అబోస్ ఫిజిల్య పెద్ద దిక్కయ్యింది. ప్యాంటు చొక్కా వేసుకుని అమ్మకు ఇంటా బయటా అన్ని పనుల్లో సాయం చేస్తుంది. కటింగ్‌కి వెళ్లినప్పుడు మాత్రం ఏడుపు ముఖం పెట్టేస్తుంది. అన్నట్టు ఫాజిల్యాను చూసి..ఆమె చెల్లి కూడా అబ్బాయి బట్టలే వేసుకుంటోంది.

అమీనా హమీద్

పిల్లలకు మంచి బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులది! కానీ అమీనా హమీద్ కాబూల్ వీధుల్లో మంచి నీళ్లు అమ్ముతుంది. ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు సేకరిస్తుంది. నిండా పదేళ్లు కూడా లేని వయసులో తండ్రితో సమానంగా కష్టపడుతుంది. అమ్మకు కూరలు తెచ్చి ఇస్తుంది. ఇంట్లో పని చేస్తుంది. మగ సంతానం లేని తల్లిదండ్రులు.. ఊహ తెలిసేలోపే అమీనాను బచ్చాపోష్‌గా మార్చేశారు! డబ్బు సంపాదించే యంత్రాన్ని చేశారు. ఆరుగురు చెల్లెళ్ల బాగోగుల బాధ్యత ఇప్పుడు అమీనాదే!

యుక్త వయసు రావడంతోనే మళ్లీ ఆంక్షల సంకెళ్లు

గ్రామీణులు, చదువుకోనివారే కాదు..నగరాల్లో చట్టసభలకు ఎన్నికైన విద్యావంతుల ఇళ్లలో కూడా బచ్చాపోష్‌లు సర్వసాధారణం! కానీ యుక్తవయసు రాగానే బచ్చాపోష్‌కు సమస్యలు మొదలవుతాయి. అంతవరకూ ప్యాంటు చొక్కా వేసుకుని స్వేచ్ఛగా తిరిగిన అమ్మాయిలను.. ఒక్కసారిగా పరదా చాటుకు నెట్టేస్తారు. పెళ్లి కూడా చేసేస్తారు. అంత వరకూ ఆడుతూ పాడుతూ స్వేచ్ఛగా బతికిన అమ్మాయిలు.. పురుషాధిక్యతను తట్టుకోలేక నరకం అనుభవిస్తారు. మానసికంగా కుంగిపోతారు. మరి.. వారి తర్వాత ఆ ఇంటి బాధ్యత ఎవరు తీసుకుంటారంటే.. ఆరేడుమంది ఆడపిల్లల్లో మరో చిన్న పాపకు అబ్బాయి వేషం వేసి బచ్చాపోష్‌గా మారుస్తారు.





బిహారీ యువకుడు లాటిన్ అమెరికా ‘హీరో’

ప్రభాకర్ నటించిన సినిమా కోస్టారికాలో సూపర్ హిట్

▸ ఇంగ్లీషు, హిందీల్లోనూ నిర్మించేందుకు సన్నాహాలు

ఓ బిహారీ యువకుడు లాటిన్ అమెరికా అమ్మాయిలతో రోమాన్స్ చేస్తున్నాడు. పట్నాకు చెందిన ప్రభాకర్ శరణ్ నటించిన తొలి స్పానిష్ సినిమా ‘ఎన్రెడాడోస్: లా కన్ఫూజన్(ద కన్ఫ్యూజన్)’ కోస్టారికాలో గతేడాది బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కోస్టారికా, ముంబై, పనామా నగరాల్లో నిర్మించిన ఈ సినిమాలో పాటలు, డ్యాన్సులను బాలీవుడ్ తరహాలో రూపొందించారు. ఇందులో ప్రభాకర్ హీరోగా, కోస్టారికా టెలివిజన్ నటి నాన్సీ డోబుల్ హీరోయిన్‌గా నటించారు. దీన్ని కోస్టారికాకు చెందిన పసిఫిక్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించింది. ‘ఖిలాడీ 786’ సినిమా దర్శకుడు ఆశిష్ మోహన్ తొలుత దర్శకత్వం వహించారు. అయితే, విభేదాల వల్ల ఆయన మధ్యలోనే వైదొలగడంతో దర్శకత్వ బాధ్యతలు కూడా హీరో ప్రభాకర్ స్వీకరించాడు. భారతీయులను, లాటిన్ అమెరికా ప్రజలను కలపడమే ఈ సినిమా కథాంశమని ప్రభాకర్ తెలిపాడు. ఈ సినిమా లాటిన్ అమెరికా సినీ పరిశ్రమలో ఓ మైలురాయిగా నిలుస్తుందన్నాడు. 2017 ఫిబ్రవరిలో కోస్టారికా, పనామా, నికరాగువా, హోండూరస్, గ్వాటెమాలా, సాన్ సాల్వెడార్ దేశాల్లో విడుదలైన ఈ సినిమాను ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో లాటిన్ అమెరికాలోని మరో డజన్ దేశాలతో పాటు అమెరికాలోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ‘ఏక్ చోర్ - దో మస్తీ ఖోర్’ అనే టైటిల్‌తో ఇంగ్లీషు, హిందీ, భోజ్‌పూరి భాషల్లోనూ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

– పట్నా



నాడు దేశ సేవలో.. నేడు ఆపన్నుల సేవలో...

ఒకే ఒక్కడు
Oke Okkadu

▸ నిరుపేదల కోసం దుస్తులు, వస్తువుల సేకరణ

▸ ఇదీ జ్యోతయ్య త్యాగనిరతి


రోజూ ఉదయాన్నే శ్మశానాలకు వెళ్లి శుభ్రం చేయటం, మొక్కలకు నీరు పెట్టడంతో అతడు దినచర్య ప్రారంభిస్తారు. తర్వాత బ్యాంకు వద్ద నిరక్షరాస్యులకు ఫారాలు పూర్తి చేయటంలో సహకరిస్తారు. ఈలోపు ఎవరైనా ఫోన్ చేసి.. అన్నం మిగిలిపోయిందని కానీ, దుస్తులు, స్టీలు సామాన్లు ఉన్నాయనిగానీ చెబితే క్షణంలో అక్కడికి ప్రత్యక్షమవుతారు. వాటిని తీసుకెళ్లి ఆపన్నులకు పంపిణీ చేస్తారు. రాత్రి 11 గంటల సమయంలో కూడా నెట్టుడు రిక్షా తీసుకెళ్లి మిగిలిపోయిన ఆహార పదార్థాలన్నీ సేకరించుకొని ఆర్టీసీ బస్టాండ్‌కు అర్ధరాత్రి సమయంలో తీసుకు వచ్చి పంపిణీ చేస్తుంటారు. అతడే ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన పతంగి జ్యోతయ్య. తిండికి, కట్టుకోవడానికి లేని నిరుపేదల కళ్లలో ఆశాదీపంలా మెరుస్తున్నారాయన. మిలటరీలో పనిచేసి పదవీ విరమణ చేసిన జ్యోతయ్య తొలుత ఒక బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేశారు. ఆ తర్వాత పూర్తిగా సమాజసేవలో నిమగ్నమయ్యారు. శుభకార్యాలు జరిగినప్పుడు మిగిలిపోయిన భోజనాన్ని తోపుడు రిక్షాపై భిక్షాటకులు, నిరుపేదలు ఉండే ఆర్టీసి బస్టాండ్, పలు కాలనీలకు తీసుకు వెళ్లి పంపిణీ చేస్తుంటారు. ఖాళీ సమయంలో ధనవంతుల ఇళ్లకు వెళ్లి పాత దుస్తులు, స్టీలు సామగ్రి వంటివి సేకరిస్తారు. వాటిని ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో తిరుగాడే నిరుపేదలకు పంపిణీ చేస్తుంటారు. అద్దంకి పరిసరాల్లో ఇటుక బట్టీల్లో గోదావరి జిల్లాల నుంచి వచ్చిన పెద్ద సంఖ్యలో నిరుపేద కార్మికులు ఉంటున్నారు. తాను సేకరించిన దుస్తులు, స్టీలు సామగ్రిని ఇటీవలే 200 మంది కార్మికులకు పంపిణీ చేశారు. ఇప్పటికీ కల్యాణ మండపాల నిర్వాహకులకు, శుభకార్యాలు నిర్వహించే కుటుంబాలవారికి.. అన్నం మిగిలిందంటే వెంటనే జ్యోతయ్య గుర్తుకు వస్తాడు. సామాన్యులు సైతం 9441229743 నంబర్‌కు ఫోన్ చేసి పాత చీరలు, దుస్తులు, స్టీలు సామాన్లు ఇస్తున్నారు. ఇలా జ్యోతయ్య నిస్వార్థ సేవకుడిగా నిలుస్తున్నారు.

– అద్దంకి



ఇటుక బట్టీలలో పనిచేసే మహిళలకు చీరలు, డ్రస్సులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవకుడు పంతంగి జ్యోతయ్య





ఎముకలు కొరికే చలిని తట్టుకునేందుకు..
దేవతామూర్తులకు వేడినీటి అభిషేకాలు

▸ గర్భగుడిలో రూం హీటర్లు

ఎముకలు కొరికే చలిలో చన్నీటి స్నానాలు సాధ్యమా? వామ్మో అనుకుంటాం. హీటర్లు, గీజర్లకు పనిచెబుతాం. ఈ సమస్య సాధారణ మానవులకే కాదు.. దేవుళ్లకు కూడా ఉంటుందని, అందుకే శీతాకాలం వెళ్లేదాకా దేవతా విగ్రహాలకు వేడినీళ్లతో అభిషేకాలు చేస్తున్నామని అయోధ్యలోని జానకీ ఘాట్ బడాస్థాన్ ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. అంతే కాదు.. దేవతా విగ్రహాలకు వెచ్చటి వాతావరణాన్ని కల్పించేందుకు గర్భగుడిలో హీటర్లను కూడా ఏర్పాటు చేశారు. ఉత్తరాదిలో చలితీవ్రత రోజురోజుకీ పెరుగుతోందని, అయోధ్యలో పరిస్థితి మరీ దారుణంగా మారుతోందని, ఈ నేపథ్యంలో దేవతా విగ్రహాలకు జలాభిషేకాన్ని వేడినీటితో చేయాలని నిర్ణయించామని, అనుకున్నదే తడవుగా గీజర్లు, రూం హీటర్లు తెప్పించామని ఆలయ ప్రధానార్చకుడు జన్మేశరణ్ మీడియాకు తెలిపారు.





‘ఒట్టు..! సిగరెట్ కాల్చను.. మందు కొట్టను’

స్కూలు అసెంబ్లీలో ఉపాధ్యాయుల ప్రమాణం

‘భారత దేశం నా మాతృభూమి..భారతీయులందరూ నా సహోదరులు’ అని స్కూల్లో పిల్లలు ప్రార్థన సమయంలో చెబుతూ ఉంటారు. కర్ణాటకలో ఇప్పుడు టీచర్ల వంతు కూడా వచ్చింది. ‘నేను ఉపాధ్యాయుడిని.. నేను సిగరెట్ కాల్చను..మద్యం సేవించను..చెడు అలవాట్లకు దూరంగా ఉంటాను’ అని స్కూలు ఆవరణలో పిల్లలందరి ముందూ ప్రమాణం చేస్తున్నారు. పిల్లలకు నీతులు చెప్పే ఉపాధ్యాయులు సత్ప్రవర్తన కల్గి ఉండాలని కర్ణాటక విద్యా భావించింది. అందుకే వారు చెడు అలవాట్లు మానుకోవాలంటూ సర్క్యులర్ జారీచేసింది. స్కూలు వేళల్లోనేకాదు.. ఆ తర్వాత కూడా ఉపాధ్యాయుల అలవాట్లపై కన్నేసి ఉంచుతామని స్పష్టంచేసింది. సిగరెట్, మద్యం అలవాట్లు ఉన్నాయని తేలితే.. వెంటనే వారిని డి-ఎడిక్షన్ కోర్సులకు పంపుతోంది. అటువంటి టీచర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోబాటు.. ధ్యానం, యోగ తరగతులు కూడా నిర్వహిస్తోంది. అయినా మాట వినకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించింది. మద్యం, సిగరెట్ అలవాటు ఉన్న ఉపాధ్యాయులు మూడు నెలలకోసారి స్కూలు అసెంబ్లీలో ప్రమాణం చేయాలి. చెడు అలవాట్లు మానేశానని ఒట్టు వేయాలి. సిగరెట్, మద్యంతో అనర్థాలపై 30 నిమిషాలపాటు క్లాసు వినాలి. అంతేకాదు ఇంటికి వెళ్లిన తర్వాత సైలెంట్‌గా గుప్పుగుప్పుమని పొగ తాగడానికి వీల్లేదు. స్కూలు ప్యానల్స్ ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులతో టచ్‌లో ఉంటాయని కర్ణాటక విద్యాశాఖ ప్రకటించింది.

–సెంట్రల్ డెస్క్

విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

మంగళవారం 2-1-2018

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

అమ్మ గుడిలో తాంత్రిక తంతు

సాత్విక పూజల స్థానంలో 'భీకరం'



- అర్ధరాత్రి రహస్యంగా 'భైరవీ పూజ'
- నలుగురు తమిళ తాంత్రికుల రాక
- దగ్గరుండి నడిపించిన స్థానిక పూజారి
- కష్టాలు తొలగేందుకు అధికారి నిర్వాకం
- అంతరాలయాన్ని తెరిచి కార్యక్రమం
- గుట్టుచప్పుడు కాకుండా తతంగం

అర్ధరాత్రి వేళ దుర్గగుడిలో కనిపిస్తున్న అపరిచిత అర్చకుడు. సీసీ కెమెరాల్లో రికార్డయిన చిత్రమిది

సాత్విక రూపంతో... చల్లని చూపులతో భక్తులను కరుణించే బెజవాడ కనక దుర్గమ్మ గుడిలో సంప్రదాయ విరుద్ధమైన పూజలు జరిగాయి. అమ్మవారిలోని భీకర స్వరూపాన్ని మేల్కొలుపుతూ, ఆ తల్లికి మరో రూపమైన 'భైరవి'ని ప్రసన్నం చేసుకునేందుకు కొందరు రహస్య క్రతువులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా అంతరాలయ తలుపులు తెరిచి, అర్ధరాత్రి రహస్యంగా పూజలు జరిపారు. ఇప్పుడు ఇంద్రకీలాద్రిపై దీనిపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది.

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బెజవాడ కనకదుర్గ ఆలయ ముఖ్య అధికారి ఒకరు ఇటీవల తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలు వరుసగా వివాదాస్పదమయ్యాయి. ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ఈ నేపథ్యంలో... ఆ అధికారికి సన్నిహితంగా మెలిగే అర్చకుడొకరు 'భైరవీ పూజ చేస్తే మీకు అదనపు శక్తులు వస్తాయి. కష్టాలు పోతాయి' అని సలహా ఇచ్చారు. అందుకు... ఆ అధికారి సరే అన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఆ తర్వాత ఏం జరిగిందంటే.. భైరవీ పూజ నిర్వహణలో నిష్ణాతులైన తాంత్రికులను తమిళనాడు నుంచి రప్పించారు. డిసెంబరు 26వ తేదీ రాత్రి 9 గంటలకు గట్టువెనుక నివాసం ఉంటున్న ఆలయ అర్చకుడి ఇంటికి ఆ అధికారి వెళ్లారు. ఆలయంలో భైరవీ పూజను ఎలా పూర్తి చేయాలన్న దానిపై చర్చించుకున్న అనంతరం అధికారి

మిగతా 12వ పేజీలో...



సోమవారం విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య, ముఖ్యమంత్రి చంద్రబాబు

నా కష్టానికి ఓటు కూలీ!

వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుస్తాం: సీఎం

- ఒకటి రెండు చోట్ల ఓడించినా బాధపడతారు
- 'జన్మభూమి-మా ఊరు' ఒక మహా యజ్ఞం
- 10 రోజులు సొంత ఊరిపై చర్చించండి
- రాష్ట్రానికి ఏం చేయగలమో ఆలోచించండి
- ఉగాది నుంచి 4 లక్షల కొత్త పింఛన్లు
- అర్హులైన అందరికీ రేషన్ కార్డులు
- వేల మందికి లబ్ధి.. సమస్యల పరిష్కారం
- 2017 కంటే 2018లో అద్భుతంగా చేస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): "జన్మభూమిలో చేపట్టే పనులకు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఎన్నికలతో సంబంధం లేదు. అభివృద్ధి, సంక్షేమాల ప్రధాన ఉద్దేశం సమాజ హితమే. ఎన్నికల్లో ఓటు అనేది దానివల్ల వచ్చే ఉప ఉత్పత్తి మాత్రమే. వచ్చే సాధారణ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుస్తాం. ఎక్కడైనా ఒకటిరెండు చోట్ల ఓడిపోతే... ఎందుకు ఓడించామా అని అక్కడి ప్రజలు బాధ పడే పరిస్థితి వస్తుంది. నా కష్టానికి కూలీ ఇవ్వాలా? వద్దా? నేనడిగేది కూలీనే" అని ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా 12వ పేజీలో...

నేటి నుంచే జన్మభూమి

- పది రోజులు ప్రజల వద్దే యంత్రాంగం
- 9 అంశాలపై ఒక్కో రోజు చర్చ
- అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు

7

ఇక ప్రాజెక్టుల మేళా!

జన్మభూమిలో నీటి పథకాల సందడి



సంక్రాంతికే 'విడుదల'

14

- 'బాబా' గుర్తే పార్టీ చిహ్నం!
- సభ్యత్వ నమోదుకు వెబ్‌సైట్
- జోరందుకున్న రజనీ రాజకీయం

కాపు కోటా బిల్లుకు గవర్నరు ఓకే

త్వరలోనే కేంద్రానికి నివేదన

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాపులకు 5శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ చేసిన బిల్లుపై గవర్నరు నరసింహన్ ఆమోదముద్ర వేశారు. పార్లమెంటు ఆమోదం పొందేందుకు త్వరలోనే దీనిని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలను బీసీల్లో చేరుస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు.. దాన్ని నెరవేర్చేందుకు కర్ణాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మంజునాథ నేతృత్వంలో బీసీ కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించారు. సుమారు 22నెలల పాటు ప్రజల స్థితిగతులపై అధ్యయనం చేసిన బీసీ కమిషన్ డిసెంబరు 1న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ సిఫారసులకు అనుగుణంగా డిసెంబరు 2న అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టగా దానికి సభ ఆమోదం లభించింది. తర్వాత బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపగా తాజాగా ఆయన అంగీకార ముద్ర వేశారు. దీంతో రాష్ట్రస్థాయిలో జరగాల్సిన ప్రక్రియ పూర్తయింది. అసెంబ్లీలో బిల్లు పెట్టడంతోనే ప్రధాన ఘట్టం ముగిసింది. గవర్నర్ ఆమోదంతో ఇక కేంద్రానికి పంపడమే తరువాయి.

మొత్తం వాడుకుంటాం!

తుంగభద్ర జలాలపై కర్ణాటక ఎత్తులు

- 4 టీఎంసీల నికర జలాలపైనా కన్ను
- చంద్రబాబుకు కర్ణాటక సీఎం లేఖ
- వారికి వర్షాల్లేవట.. మనకు ఉన్నాయట!
- 4న కర్ణాటక అధికారుల రాక

ఎక్కడికక్కడ చెక్‌డ్యాములు, అనధికార ఎత్తిపోతలు, పూడికతీత పేరుతో తుంగభద్ర జలాలకు గండి కొడుతున్న కర్ణాటక... ఇప్పుడు కొత్త ఎత్తు వేస్తోంది. 'తుంగభద్ర జలాలు మొత్తం మేమే వాడుకుంటాం' అంటూ అభ్యర్థన పంపింది. తమకు కేటాయించిన జలాలతోపాటు... ఏపీ నికర జలాలపైనా కన్నేసింది.



అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'తుంగభద్ర జలాలు మొత్తం మేమే వాడుకుంటాం' అంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఏపీ సీఎం చంద్రబాబుకు ఓ లేఖ రాశారు. ఇదే అంశంపై ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నప్రభ ఏపీ జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కు మరో లేఖ పంపారు. ఆధునీకరణ పనుల పేరిట పూడికను తీస్తూ... జలాలు కర్ణాటకలో పారేలా చేసే ఎత్తుగడలను కర్నూలు జల వనరుల శాఖ చీఫ్‌ఇంజనీరు నారాయణ రెడ్డి అడ్డుకోవడంతో ఇప్పుడు కొత్త వ్యూహానికి తెరలేపినట్లు రాష్ట్ర సాగునీటి శాఖ అధికారులు భావిస్తున్నారు. తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పర్యటించారు. వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయని, తుంగభద్ర నుంచి నీళ్లు వదలాలని అక్కడి రైతులు కోరారు. అయితే, బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కేటాయించిన 18 టీసీఎంలనూ కర్ణాటక ఇప్పటికే వాడింది. ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించిన 4 టీఎంసీల నికర జలాలను సుంకేశుల ద్వారా సద్వినియోగం చేసుకోవాలి. అయితే... సుంకేశుల వద్ద మరమ్మతులు చేయాల్సి ఉన్నందున, తుంగభద్ర నీటిని కేసీ కెనాల్ ద్వారా సరఫరా చేయలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతానికి కృష్ణా జలాలనే రాయలసీమకు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో... తుంగభద్రలో ఏపీకి కేటాయించిన 4 టీఎంసీలను తామే వాడుకుంటామంటూ కర్ణాటక ప్రతిపాదించింది. "కర్ణాటకలోని తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో

మిగతా 12వ పేజీలో...



11

సంతృప్తి నుంచి సమస్యల పరిష్కారం దాకా

అన్నింటా కృష్ణా ఫస్ట్

- ఉపాధిలో ముందు.. సాగు విస్తీర్ణంలో రికార్డు
- పింఛన్లు, సబ్సిడీలు లబ్ధిదారుల ఖాతాల్లోనే
- ప్రత్యక్ష నగదు బదిలీలో దేశంలోనే ప్రథమం
- అవినీతి నియంత్రణలోనూ మొదటి స్థానం
- ఏడు అంశాల్లో గోల్డ్ రేటింగ్‌తో టాప్‌లో
- ముఖ్యమంత్రి సూచనలతోనే సాధ్యమైంది
- కలెక్టర్ లక్ష్మీకాంతం ఉద్ఘాటన

నూతనంలో విషాదం

కొత్త సంవత్సరం వేడుకల్లో అపశ్రుతులు

చలిమంట వద్ద పిల్లలపైకి కారు.. నలుగురి మృతి.. కేక్ తేవడానికి వెళ్తూ ఇద్దరు బలి

వేర్వేరు ఘటనల్లో 10 మంది దుర్మరణం.. 200 మంది విద్యార్థులకు కంటి సమస్యలు



కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలో ప్రమాదానికి కారణమైన కారు



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

నూతన సంవత్సరం వేడుకలు పలు కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపాయి. ఆది, సోమవారాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో మొత్తం 10 మంది మృత్యువాత పడ్డారు. కడప జిల్లాలోని పెండ్లిమర్రి మండలంలో చలిమంట కాచుకుంటున్న చిన్నారులపైకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో గొందిపల్లె పంచాయతీ ఇందిరానగర్‌కు చెందిన భాస్కర్(27), గిరి(16), నరసింహ(14), కార్తీక్(7)తో పాటు కారు డ్రైవర్ బ్రహ్మానందరెడ్డి(28) అక్కడికక్కడే

మిగతా 14వ పేజీలో...

100 కోట్లు.. తాగేశారు!

14

- డిసెంబరు 31న జోరందుకున్న అమ్మకాలు
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి.. అమ్మకాల్లో అమరావతి ఫస్ట్

ఎస్‌బీఐ గృహ రుణాలు చౌక

80 లక్షల మందికి ప్రయోజనం

9

టన్ను ఉక్కు ధర రూ.50,000

నెల రోజుల్లో 9 వేల రూపాయల భారం



విజయరాజు

పీహెచ్‌డీ అడ్మిషన్లకు సెట్

- రాష్ట్రంలోని 14 వర్సిటీలకు కలిపి నిర్వహణ
- ఓపెన్ వైవా .. రిసెర్చ్‌లో ప్రమాణాలు
- రెండు నెలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ
- ఇంజనీరింగ్ సిలబస్‌లో సమూల మార్పులు
- 'ఆంధ్రజ్యోతి'తో ఉన్నతవిద్యామండలి చైర్మన్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో ప్రమాణాలు పెంచడమే ప్రధాన ధ్యేయంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఉమ్మడి ప్రవేశపరీక్ష (సెట్) నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.విజయరాజు తెలిపారు. రాష్ట్రంలోని 14 విశ్వవిద్యాలయాలకు కలిపి ఈ పరీక్షను నిర్వహిస్తామని చెప్పారు. పీహెచ్‌డీ అడ్మిషన్లతో పాటు తత్సంబంధ ప్రక్రియలో

మిగతా 8వ పేజీలో...

రాజధానికి వెయ్యి కోట్ల గ్రాంట్

ముందుకొచ్చిన జపాన్ సంస్థలు

11

హోంగార్డులకు ఉచిత బస్‌పాస్‌లు!

12

రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు శాఖ ప్రతిపాదన



నయా డిజైన్

8

అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రా వస్త్రం

రజనీ రాక!

కొత్త సంవత్సరం అడుగుపెట్టేలోగా, రెండు దశాబ్దాల ఊగిసలాటనూ, సంశయాన్నీ కాలగర్భంలో కలిపేసి సినీనటుడు రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశాన్ని ప్రకటించారు. నలభై ఐదోఏట అనుకున్నది, అరవై ఐదో ఏట జరుగుతోందని రజనీ నవ్వుతూ చెప్పుకున్నారు. అప్పుడొద్దనుకున్నది ఇప్పుడు ఎందుకు కావాలనుకున్నారో ఆయన చెప్పకపోయినా, సినీరంగంలో వెలుగుతున్న అప్పటి రజనీకీ, వయసు మీదపడిన ఇప్పటి రజనీకీ తేడా వున్నది. ఇప్పటికీ ఈ నిర్ణయం తీసుకోకపోతే అపరాధ భావన తనను తినేస్తుందని అంటున్న రజనీ, ఎట్టకేలకు ఆ రంగంలో కూడగట్టుకున్న కీర్తిని ఈ రంగంలో పెట్టుబడిగా పెట్టాలని నిశ్చయించుకున్నారు. మరో సందర్భంలో ఆయన ఈ పరీక్షకు సిద్ధపడి వుంటే అంచనాలు దొరికివుండేవేమో కానీ, రాజకీయ శూన్యత స్పష్టంగా ఉన్న ప్రస్తుత స్థితిలో ఆయన రాక తమిళ రాజకీయాన్ని మార్చే అవకాశాలున్నాయి.

ఏడాదికాలంగా రాష్ట్రంలో పరిణామాలు చూస్తూ దేశం నవ్విపోతోంది అంటూ సూపర్‌స్టార్ చేసిన ప్రస్తావనలోనే జయలలిత అనంతర రాజకీయ వాతావరణం నుంచే తన భవిష్యత్తును వెతుక్కుంటున్న సందేశం ఉన్నది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోగా పార్టీని ఆరంభించి అన్ని స్థానాలనుంచి పోటీచేస్తాననీ, పార్లమెంటు సంగతి అవసరం వచ్చినప్పుడు తేలుస్తానని ప్రకటించారు. కొత్తసంవత్సరం తొలి రోజున వెబ్‌సైట్ ఆరంభించి ఈ విషయంలో తాను వేగంగా కదులుతున్న సందేశాన్ని కూడా ఇచ్చారు. మహారాష్ట్ర మూలాలతో, కర్ణాటకలో పుట్టి, తమిళనాడులో హిట్టయిన శివాజీరావ్ గైక్వాడ్ రాకను వ్యతిరేకిస్తూ ఒకటి రెండు తమిళ సంస్థలు ఇప్పటికే ఆత్మగౌరవం పేరిట విమర్శలు ఆరంభించాయి. తమిళ రాజకీయాల్లో తమిళేతర నాయకులు ఎదిగివచ్చిన విషయం చూసిందే కనుక, తలైవా విజయావకాశాలమీద ఆ విమర్శలూ, వాదనలూ పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. రజనీ రాకను అన్ని పార్టీలూ ఉపరితలంలో స్వాగతిస్తున్నా, వెనుక ఏవో శక్తులున్నాయని వ్యాఖ్యానించడానికి వెనుకాడటం లేదు. ముఖ్యంగా, బీజేపీ ఆయనను ముందు పెట్టి కొత్త కథ మొదలెట్టిందన్న ప్రచారం బలంగా ఉన్న నేపథ్యంలో, తాను బీజేపీ మనిషిని కానని చెప్పుకోవడానికి రజనీ ప్రయత్నించారు. డీఎంకె అధినేత కరుణానిధి క్రియాశీలంగా ఉన్నంత కాలం తాను రాజకీయాల్లో రావద్దని నిర్ణయించుకున్నానని వివరణ ఇచ్చారు. కరుణ ఇప్పుడు చురుకుగా లేకపోవచ్చు కానీ, ఆయన పార్టీకీ, సిద్ధాంతాలకు వారసుడిగా స్టాలిన్ ఉన్నారు. రజనీ ఇంతకాలం ఇచ్చిన మినహాయింపు కేవలం కరుణకే తప్ప, డీఎంకె పార్టీకి కాదని అనుకోవాలి.

ఇక, కులాతీత ఆధ్యాత్మిక రాజకీయం అంటూ రజనీ చేసిన వ్యాఖ్య, ఆయన యోగ ముద్ర, వేదిక వెనుక ఉన్న భగవద్గీత శ్లోకం, ప్రసంగంలో దాని ఉటంకింపు, చో రామస్వామి ప్రస్తావన ఇత్యాదివి బీజేపీతో ఆయనకు ప్రచ్ఛన్న అనుబంధం ఉన్నదని విమర్శించేందుకు వీలుకల్పించాయి. వీటికితోడు, ఎన్నికల తరువాత రజనీ పార్టీ ఎన్డీయేలో భాగస్వామి అవుతుందని బీజేపీ రాష్ట్రపార్టీ నేత ఓ వ్యాఖ్య చేసి ఈ వాదనకు మరింత ఊతం ఇచ్చారు. ఈ విషయంలో సుబ్రహ్మణ్యస్వామి మాత్రమే తెలివిగా రజనీ వచ్చి సాధించేదేమీ ఉండబోదని కఠినవ్యాఖ్యలతో దూరం పెట్టారు.

తమిళ రాజకీయాల్లో ఎన్నడూ లేనంత రాజకీయశూన్యత ఇప్పుడున్న మాట వాస్తవం. జయమరణం నాటినుంచి ఆమె పార్టీలో తలెత్తిన పరిణామాలు ప్రజలకు విసుగుతెప్పించాయి. జయవారసురాలిగా ఆమె పార్టీనీ, ముఖ్యమంత్రి పదవినీ సునాయాసంగా అందుకోగలిగిన శశికళను బీజేపీ ముప్పుతిప్పలు పెట్టి చివరకు జైలుపాల్జేసిన పరిణామాలు తమిళులు చూశారు. చిన్నమ్మ మీద ప్రజలకు ప్రేమాభిమానాలు ఉండకపోవచ్చు కానీ, తమిళనాట కాలూనేందుకు బీజేపీ అన్నాడీఎంకెను ముక్కలు చెక్కలు చేసి, శశి కుటుంబంపై సర్వవ్యవస్థలను ఉసిగొల్పిన కోపం వారిలో ఉన్నది. బీజేపీ కారణంగా రెండాకులు చీలిపోయి, ఇప్పుడు తిరిగి ఒక్కటైనప్పటికీ, ఆర్కే నగర్ ఉప ఎన్నికలో ప్రజలు దినకరన్‌కు ఓట్లు కుమ్మరించి పళని–పన్నీరులు తమిళుల ఆత్మగౌరవాన్ని మోదీకి తాకట్టుపెట్టినందుకు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఉప ఎన్నిక తమిళులకు బీజేపీ పొడ ఏమాత్రం గిట్టదని మరోమారు తెలియచెప్పింది. బీజేపీతో ఏమాత్రం సాన్నిహిత్యం ఉన్నట్టు కనిపించినా రజనీకి ప్రమాదం. ఇప్పుడు ఆయనది రాజకీయ ప్రవేశ ప్రకటన మాత్రమే. త్వరలో ఆయన ప్రకటించబోయే విధానాలు, సిద్ధాంతాల ఆధారంగా ప్రజలూ, పార్టీలూ ఆయనను తూస్తాయి. భవిష్యత్ వ్యూహాలేమిటో పసిగట్టి ఎవరికి తోచిన విశ్లేషణలు వారు చేస్తారు. అవినీతి లేని పూర్తిభిన్నమైన రాజకీయం చేస్తానని మిగతా నాయకుల్లాగానే చెప్పుకోవడం వేరు, వివిధ రంగాల అభ్యున్నతి విషయంలో తన మార్గాన్ని చెప్పడం వేరు. రజనీకాంత్ జనసమ్మోహన శక్తి, ప్రజాదరణ తీసిపారేయగలిగేవి కావు. ఆయన రాక ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై కచ్చితంగా ఉంటుంది. సినీరంగం నుంచి రాజకీయంలోకి వచ్చినవారు తమిళనాట ఎక్కువే కానీ, ఉన్నతస్థానానికి చేరి నిలబడినవారు తక్కువ. ఎంజీఆర్, కరుణ, జయవంటివారు రాజకీయంలో ఢక్కామొక్కీలు తిన్నాకే కుర్చీలో కూర్చోగలిగారు. వీరాభిమానులున్న శివాజీ గణేషన్, వీరత్వాన్ని చూపిన విజయకాంత్ వంటివారు ఈ రంగంలో నిలబడలేక చతికిలబడ్డారు. ఇప్పుడు జయ–కరుణ పోటాపోటీ రాజకీయ శకం ముగిసిపోయి, శూన్యత కనిపించి ఉండవచ్చు కానీ, ఏమాత్రం అనుభవం లేకుండా నేరుగా ఎన్నికల బరిలోకి దిగడం ప్రమాదకరమైన విన్యాసమే. పాలనపైనా, పార్టీలపైనా ప్రజల్లో ఆగ్రహం ఉండటం, వారు ప్రత్యామ్నాయంవైపు చూడటం సహజమే. కానీ, క్షేత్రస్థాయి వాతావరణాన్ని ఓట్లుగా మార్చుకోవడం అందరికీ అందని విద్య. పళని–పన్నీరు ప్రభుత్వాన్ని మూడునెలల్లో కూల్చేస్తానని భీష్మప్రతిజ్ఞ చేసిన దినకరన్, రజనీ ప్రవేశంతో ఆ పనికి ఎప్పుడు సిద్ధపడతారో తెలియదు కానీ, రజనీ కనుక దిగితే తొలిపరీక్ష వచ్చే ఏడాది జరగబోయే పార్లమెంట్ ఎన్నికలే.

జనవాక్యం

సామాజిక విప్లవకారిణి

హైందవ మత కట్టుబాట్లను ధిక్కరించి బాలిక విద్యకు పునాది వేసిన సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే. ఆధునిక భారతదేశ తొలి ఉపాధ్యాయినిగా, స్త్రీ వాదిగా, సంఘ సంస్కర్తగా చైతన్య దీప్తిగా దేశ చరిత్రలో ఆమెది సుస్థిరస్థానం. బ్రిటిష్ అణిచివేత క్రూరంగా సాగుతున్న నేపథ్యంలో శాంతియుత ఉద్యమాలే పరిష్కారమని, విద్యా వ్యాప్తే ఒక గొప్ప ఉద్యమమని, మూఢవిశ్వాసాలు తొలగించాలని, మనిషిని స్వేచ్ఛగా ఆలోచింపజేయాలని పూనుకున్నారు.



నాటి పాలకులైన పీష్వాలు బ్రాహ్మణ మహిళలతో పాటు సమాజంలోని మహిళలందరూ నిరక్షరాస్యులుగా, మూఢవిశ్వాసాలతో జీవించాలని కట్టుదిట్టాలు చేశారు. పూలే వితంతువులకు చేయూతనివ్వడం, నిమ్నవర్గాల బాలబాలికలకు పాఠశాలలు నడపడం అప్పట్లో సాహసోపేతమైన చర్య. తమ బడిలో చదువు చెప్పడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి టీచర్‌గా తీర్చిదిద్దారు. ఆ విధంగా సావిత్రి బాయి దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచిపోయారు. ఒక మాలీ కులానికి చెందిన పీడిత మహిళ చదువుకోవడమేకాకుండా ఉపాధ్యాయురాలిగా చదువు చెప్పడం, అందుకోసం అవమానాలను, అఘాయిత్యాలను ఎదుర్కొని ప్రతిఘటించి నిలబడడం దేశ చరిత్రలో ఒక విప్లవమే అయింది. దేశంలోని మహిళలంతా విద్యనభ్యసించి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడమే సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కాగలదు.

– యస్. బాబురావు, కావలి, నెల్లూరు జిల్లా

(రేపు సావిత్రిబాయి పూలే జయంతి)

కరపత్రం

'సావిత్రిబాయి' జయంతి సభ

సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 187వ జయంతి సభ జనవరి 3న సాయంత్రం 4 గంటలకు విశాఖలోని ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో జరుగుతుంది. జి. సీతా మహాలక్ష్మి, పి.వి. జ్యోతిర్మయి, ఎస్. విజయ్ కుమార్, జి. సృజన, వి. ఉమా మహేశ్వరరావు, పి.వి. సుధాకర్ తదితరులు పాల్గొంటారు. ఈ సభలో సావిత్రిబాయి పూలే పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. సావిత్రిబాయి పూలే విశిష్ట సేవాసంస్థ పురస్కారం ఎం. భాస్కర్ నాయుడు, సావిత్రిబాయి పూలే విశిష్ట సేవా మహిళా పురస్కారం కన్నెగంటి అనసూయ, సావిత్రిబాయి పూలే విశిష్ట మహిళా ఉపాధ్యాయ పురస్కారం విజయభాను కోటె, లక్ష్మీ సుహాసిని అందుకోనున్నారు.


– సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్ట్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

రాజ్యాంగ హక్కులపై పితృస్వామ్య పెత్తనం

రాజ్యాంగం పౌరులకు యే వివక్ష లేకుండా సమానత్వ హక్కు యిచ్చినప్పటికీ అమలుపరిచే వారికి హృదయం లేకపోతే అవి కాగితాలకే పరిమితమై, అస్తిపంజరంలా మిగులుతాయని అంబేడ్కర్ పేర్కొన్న అంశాలు రాధికమ్మ, గుల్రుఖ్ గుప్తా, హదియా వంటి యెందరో స్త్రీల విషయంలో మళ్ళీ రుజువవుతున్నాయి. కుల, మతపరమైన అంశాలలో మహిళా ఉద్యమాలు యింకా ఉధృతంగా పనిచెయ్యాల్సిన అవసరాన్ని ఆ మహిళల ఉదంతాలు హెచ్చరిస్తున్నాయి.

భారత రాజ్యాంగం (ఆర్టికల్స్ 25–28) యే భేదం లేకుండా పౌరులందరికీ తమకిష్టమైన మతాన్ని పాటించే హక్కునిచ్చింది. రాజ్యాంగం ప్రకారం స్త్రీ పురుషులిద్దరూ అన్ని విషయాలలోనూ సమానమే. ఆచరణలో మాత్రం కుల, మత అంశాలలో పురుషుడిని 'యెక్కువ సమానం'గా రాజ్య వ్యవస్థలు పరిగణిస్తూ స్త్రీని రెండవ తరగతి పౌరురాలిగా చూస్తుండడం గమనించవచ్చు. ఆ ధోరణి దళిత, మైనారిటీ స్త్రీల విషయంలో యిటీవల జరిగిన కొన్ని సంఘటనలలో స్పష్టంగా కనిపిస్తుంది. గుజరాత్‌లో పార్సీ మతస్థురాలైన గుల్రుఖ్ గుప్తా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల తల్లి రాధికమ్మ, కేరళలో హదియా, రాజస్థాన్‌లో జరిగిన 'పరువు హత్య'ల విషయంలో సంబంధిత స్త్రీల పట్ల పోలీసులు, కోర్టులు కూడా పితృస్వామిక ధోరణితో మెలగడం ఆశ్చర్యం కలిగిస్తుంది.



akbar



గుజరాత్ రాష్ట్రంలో గుల్రుఖ్ గుప్తా అనే పార్సీ మతస్థురాలు యితర మతస్థుడిని వివాహం చేసుకున్నాక ఆమె తన పాత మతపరమైన గుర్తింపును, ఆచారాలను కొనసాగించుకోవడానికి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. అయితే గుజరాత్ హైకోర్టు 1954 స్పెషల్ మ్యారేజ్ చట్టం ప్రకారం మతాంతర, కులాంతర వివాహాలు చేసుకున్న స్త్రీలు తమ పాత కుల, మత పరమైన గుర్తింపులను యథావిధిగా కొనసాగించుకోవచ్చనే హక్కును తిరస్కరించి గుల్రుఖ్ గుప్తా పార్సీయేతర మతస్థుడైన తన భర్త మతాన్నే అవలంబించాలని తీర్పునిచ్చింది.

ఇటీవల కేరళ రాష్ట్రంలో మెడిసిన్ విద్యార్థిని అయిన అఖిల(హదియా) మత మార్పిడి, వివాహం కేసు కూడా స్త్రీల మత హక్కును ప్రశ్నార్థకం చేసి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హిందూ తల్లిదండ్రులకు పుట్టిన 24 సంవత్సరాల అఖిల తన స్నేహితురాలి ప్రభావంతో ఇస్లాం మతం పైన వ్యక్తిగతంగా అభిమానం పెంచుకుని తన మతం మార్చుకుని తన పేరును 'హదియా'గా మార్చుకుంది. ఆ తర్వాత హదియా మ్యారేజ్ బ్యూరో ద్వారా 'జహన్' అనే ముస్లిం మతస్థుడిని వివాహం చేసుకుంది. ఆమె మత మార్పిడి, వివాహం నచ్చని ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తె విషయంలో 'లవ్ జిహాద్' అనే కుట్ర దాగి వుందని, ఆమెను మోసపూరితంగా మతం మార్చి పెళ్ళి చేశారని, జహన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని, అతడు తమ కుమార్తెని అరబ్ దేశాలకు తరలించి మాయ చేస్తాడని, ఆ వివాహాన్ని రద్దు చేసి ఆమెని తిరిగి తమకు అప్పగించమని కోర్టుని ఆశ్రయించారు.

కేరళ హైకోర్టు హదియా 24 సంవత్సరాల మేజర్ అయినప్పటికీ ఆమె యితరుల చేత మోసగించబడటానికి అవకాశాలున్నాయని భావించి ఆమెకు జహన్‌తో జరిగిన పెళ్ళిని రద్దు చేసి హదియాను ఆమె తల్లిదండ్రుల కస్టడీకి అప్పగించింది. సుమారు సంవత్సర కాలం పాటు హదియా తన భర్తను కానీ, స్నేహితులను కానీ కలవకుండా ఆమె తల్లిదండ్రులు కట్టుదిట్టం చేసినప్పటికీ తర్వాత హదియా తాను మేజర్‌ననీ తన మత మార్పిడి, వివాహం పూర్తిగా తన మనోభీష్టం ప్రకారం జరిగాయని, తనని తిరిగి భర్త దగ్గరకు వెళ్ళనివ్వమని సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆమె భర్త జహన్ కూడా తన భార్యను అప్పగించమని కోర్టుకు అప్పీల్ చేశాడు. హదియా మతమార్పిడి, వివాహం విషయంలో సుప్రీం కోర్టు ఆమె తండ్రి ఆరోపిస్తున్నట్టు 'లవ్ జిహాద్' వంటి కోణంపైన దర్యాప్తు చెయ్యడానికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీని ఆదేశించి, నివేదిక వచ్చాక తన తీర్పును వెలువరించింది. అందులో హదియా చదువు చెన్నై మెడికల్ కాలేజీలో సగంలో వున్నందున ఆమెని తన మొదటి పేరైన 'అఖిల'గా హాస్టల్‌లో వుంటూ చదువు పూర్తి చెయ్యమని ఆదేశించింది.

ఈ రెండు కేసుల్లో కోర్టులు పూర్తిగా పితృస్వామిక ధోరణితోనూ, హిందూ మెజారిటీ మత ప్రయోజనాలను కాపాడే విధంగానూ వ్యవహరిస్తుండం గమనించవచ్చు. అంతే కాకుండా కోర్టులు ఆ స్త్రీల రాజ్యాంగపరమైన హక్కులను కాలరాస్తూ వారి వ్యక్తిగత జీవితాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నాయి. యిటీవల 'ట్రిపుల్ తలాక్' పద్ధతిని రద్దు చేస్తూ ముస్లిం స్త్రీల పట్ల సుప్రీం కోర్టు కొంత ప్రగతిశీలకంగా వుందనే ఆశాభావం వ్యక్తమవుతున్న దశలో గుల్రుఖ్ గుప్తా, హదియా విషయాలలో కోర్టులు ఆ స్త్రీల మత స్వేచ్ఛని గుర్తించకపోగా హైందవేతరులను బోనులో నిలబెడుతున్నాయి. హదియా కేసులో 'లవ్ జిహాద్' అనే కొత్త అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చి ముస్లిం మతస్థులను పాపాల భైరవుల్ని చెయ్యడం లౌకిక ప్రజాతంత్రవాదుల్ని కలవర పెడుతుంది.

1954 స్పెషల్ మ్యారేజ్ చట్టం ప్రకారం కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న దంపతుల్లో స్త్రీలు తమ కుల, మతపరమైన గుర్తింపులను యథావిధిగా కొనసాగించవచ్చు. కులాంతర వివాహం చేసుకున్న వారిలో పురుషుడు అగ్ర కులస్తుడు, స్త్రీ అణగారిన కులానికి చెందిన వ్యక్తి అయితే వారికి పుట్టిన బిడ్డలకు కుల సమాజంలో అగ్ర కులం వారి ఆదరణ దొరికే అవకాశం వుండదు కాబట్టి వారు తల్లికి సంబంధించిన కుల గుర్తింపును పొందవచ్చనే ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు వున్నాయి. అయినప్పటికీ ఆచరణలో అవి బాధితులకు అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. ఆధిపత్య కులాలకు కొమ్ముకాసే ప్రభుత్వ యంత్రాంగం బాధిత స్త్రీలకు ఆ మాత్రపు వెసులుబాటును అందనివ్వకుండా వేధించడం సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ ఆత్మహత్య సందర్భంగా చూశాం. అందరూ కలిసి రోహిత్‌ని తన కుటుంబానికి యే విధంగానూ అండగా నిలబడని అతని తండ్రి కులానికి అంటగట్టడం తెలిసిందే!

వివాహం, విడాకులు, మనోవర్తి వంటి విషయాలలో న్యాయస్థానాలు స్త్రీల పట్ల యెంతో పితృస్వామిక వైఖరితో వ్యవహరిస్తూ వారికి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను కాలరాస్తున్నాయి. కొన్ని ప్రత్యేక తీర్పుల ద్వారా స్త్రీలకు బిడ్డల సంరక్షణ వంటి విషయాలలో కల్పించిన హక్కులను అమలు జరపడంలో ప్రభుత్వ యంత్రాంగం యెంతో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ తిరిగి పితృస్వామిక స్వభావాన్నే అంతటా ప్రదర్శించడం జరుగుతుంది. యిది కులధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, పాస్ పోర్ట్, వీసాలు పొందే విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇటీవలి కాలంలో 'పరువు హత్య'ల పేరుతో కులాంతర మతాంతర వివాహాలు చేసుకునే వారిని నిర్దాక్షిణ్యంగా చంపడం, భయభ్రాంతులకు గురిచెయ్యడం వంటి సంఘటనలు తరచుగా కనిపిస్తున్నాయి. మన సమాజం తిరిగి మధ్యయుగాల చీకటి లోయల్లోకి వెళ్ళిపోతుందేమోననే భయం అంతా ఆవహిస్తుంది. యీ 'పరువు హత్యలు' అణగారిన కులాల, మైనారిటీ యువతను బలితీసుకుంటున్నాయి. అవి వారి కుల మత హక్కులనే కాక వారి జీవించే హక్కును కూడా హరించడమే! యిటీవల రాజస్థాన్‌లో జరిగిన 'పరువు హత్య' మైనారిటీలను తీవ్ర అభద్రతా భావానికి గురిచేసిందనవచ్చు.


స్త్రీ బాల్యంలో తండ్రి సంరక్షణలోనూ, యవ్వనంలో భర్త సంరక్షణలోనూ, వృద్ధాప్యంలో కొడుకు అధీనంలోనూ వుండాలని మనుస్మృతి పేర్కొంది. భారతదేశంలో న్యాయస్థానాలు కూడా స్త్రీల విషయంలో తు.చ తప్పకుండా మనుస్మృతినే పాటిస్తున్న భావన కలుగుతుంది. ప్రభుత్వ యంత్రాంగం అవలంబించే పితృస్వామిక ధోరణి దళిత, బహుజన, మైనారిటీ స్త్రీల విషయంలో మరింత దారుణమైన పరిణామాలకు దారితీస్తూ ఆ స్త్రీలను వంటరితనానికీ, అభద్రతకూ గురిచేస్తోంది. అందుకే కాబోలు అంబేడ్కర్ 'రాజ్యాంగ నైతికత' అనే భావనను చర్చకు పెట్టారు.

రాజ్యాంగం పౌరులకు యే వివక్ష లేకుండా సమానత్వ హక్కు యిచ్చినప్పటికీ అమలుపరిచే వారికి హృదయం లేకపోతే అవి కాగితాలకే పరిమితమై, అస్తిపంజరంలా మిగులుతాయని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ పేర్కొన్న అంశాలు రాధికమ్మ, గుల్రుఖ్ గుప్తా, హదియా వంటి యెందరో స్త్రీల విషయంలో మళ్ళీ రుజువవుతున్నాయి. మన దేశంలో మహిళా ఉద్యమాలు యెంత పెద్ద యెత్తున జరిగినా, అవి కుల, మతపరమైన అంశాలలో యింకా ఉధృతంగా పనిచెయ్యాల్సిన అవసరాన్ని పై సంఘటనలు హెచ్చరిస్తున్నాయి.

■ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి
ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ

రైతులకు మంచిరోజులొచ్చేనా?

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

నిశ్చింతగా ఉండేలా రైతులకు సంక్షేమాన్ని సమకూర్చగలమా? కొత్త సంవత్సరంలో దేశ పాలకులు ప్రప్రథమంగా ఎదుర్కోవాల్సిన సవాల్ ఇది. స్వాతంత్ర్యానంతరం వ్యవసాయక దిగుబడులు ఇతోధికంగా పెరిగాయి. అయితే రైతుల జీవన స్థితిగతులు దిగజారాయి. ఇంకా దిగజారుతున్నాయి. సమస్యల నుంచి బయటపడడానికి చాలా మంది సాగుదారులకు ఆత్మహత్యలే గత్యంతరమవుతున్నాయి. కారణమేమిటి? దిగుబడుల పెరుగుదలతో పాటే ధరల తగ్గుదల కూడా చోటు చేసుకోవడమే. రైతులు తరచూ తమ పంట పెట్టుబడులను సైతం రాబట్టుకోలేకపోతున్నారు. గత ఏడాది పాలంపూర్ (గుజరాత్) పొటాటో రైతులు తమ ఉత్పత్తులను రోడ్లపై కుప్పలు పోశారు! గిట్టుబాటు ధరలు లభించక పోవడం వల్లే వారు ఆ విపరీత చర్యకు పాల్పడ్డారు. ఏదో ఒక పంట విషయంలో ప్రతి రెండో సంవత్సరమూ ఇటువంటి నిస్సహాయత పునరావృతమవుతూనే ఉంది. రైతుల దుస్థితి పట్ల మన ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. అయితే గత పలు సంవత్సరాలలో విఫలమైన విధానాల బాటలోనే ముందుకు వెళుతోంది. ప్రతి వ్యవసాయక్షేత్రానికీ సాగునీటి వసతి సమకూరుస్తామని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. నీటిపారుదల సదుపాయాలను మెరుగుపరిస్తే దిగుబడులు పెరుగుతాయని, తత్ఫలితంగా రైతులకు అధికాదాయం సమకూరి సంక్షేమం లభిస్తుందనేది పాలకుల సునిశ్చితాభిప్రాయం. అయితే అలా జరగడం లేదు. ఉత్పత్తులు పెరిగినా ధరలు పతనమవుతుండడంతో రైతులకు అల్పాదాయాలు మాత్రమే సమకూరుతున్నాయి.



రైతుల సమస్యలకు మౌలిక పరిష్కారాలు అవసరం ఎంతైనా ఉన్నది. అంతేగాని పదే పదే పంట రుణాల మాఫీ వల్ల ఎలాంటి ప్రయోజనముండదు.

నీటిపారుదల వసతులు పెంపొందించే వ్యూహం అనేకానేక పర్యావరణ సమస్యలనూ సృష్టిస్తోంది. నదుల నుంచి నీటిని కృత్రిమంగా తోడివేస్తుండడంతో నదులు నిర్జలమవుతున్నాయి. యమునానదీ జలాలను హత్నికుండ్ బ్యారేజ్ వద్ద, గంగానది నీటిని నరోరా బ్యారేజ్ వద్ద దాదాపు పూర్తిగా ఉపసంహరించుకోవడం జరుగుతోంది. నర్మదా నీరు సర్దార్ సరోవర్ డ్యామ్‌కు తీసుకువెళ్ళి అక్కడ నుంచి రైతులకు సరఫరా చేస్తున్నారు. కృష్ణా, గోదావరి, కావేరీ జలాలు సాగర సంగమం కావడమే లేదు. మన నదులు నిర్జీవ నదులు. గతంలో వలే అవి మత్స్య జాతులకు నెలవుగా ఉండడం లేదు. లక్షలాది మత్స్యకారులు తమ సంప్రదాయ జీవనోపాధిని కోల్పోయి వేరే వృత్తులను చేపడుతున్నారు. మన నదులు అవక్షేపాలను తీరప్రాంతాలకు మోసుకు వెళ్ళడం లేదు. నదీప్రవాహాలతో వచ్చే అవక్షేపాలే మన తీరప్రాంతాలకు రక్షణగా ఉంటున్నాయని మరి చెప్పనవసరం లేదు. అయితే ఇప్పుడు కృష్ణా, నర్మదా, గంగానదీ ముఖద్వారాల వద్ద తీర రేఖలు వెనక్కి పోతున్నాయి. నీటిపారుదల సదుపాయాల రూపేణా మనం మన భూమిని 'భుజిస్తున్నాం' సుమా!

ఇక కాల్వల వ్యవసాయం ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుదలకు దారితీయడం లేదు. ఇదొక విచారకరమైన వాస్తవం. కాల్వల ద్వారా సరఫరా అవుతోన్న నీటిని రైతులు చాలావరకు వృధా చేస్తున్నారు. కాల్వల ద్వారా సరఫరా చేస్తున్న సాగునీటికి ధరకు ఆ నీటితో సాగవుతున్న భూమి వైశాల్యం ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారే గానీ ఎన్ని పంటలకు ఉపయోగించుకొంటున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీనివల్ల రైతులు కాల్వల నీటిని మితిమీరిన స్థాయిలో వినియోగించుకొంటున్నారు. అందుకు అదనంగా నయాపైసా చెల్లించవలసిన అవసరం లేకపోవడం వల్లే వీరు ఈ విధంగా వ్యవహరిస్తున్నారనేది స్పష్టం. ఇరిగేషన్ వల్ల ఉత్పన్నమవుతున్న రెండో పర్యావరణ సమస్య భూగర్భజలాల అడుగంటిపోవడం. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు విద్యుత్తును ఉచితంగా సమకూరుస్తున్నాయి. ఈ ఉచిత లబ్ధితో రైతులు భూగర్భజలాలను మితిమీరిన స్థాయిలో వినియోగించుకొంటున్నారు. ఫలితంగా కొన్ని ప్రాంతాలలో భూగర్భజలాలు 2000 అడుగుల లోతుకు అడుగంటిపోయాయి. మరింత అధికస్థాయిలో విద్యుత్తును వాడుకోవడం ద్వారా తరిగిపోతోన్న భూగర్భజలాలను తోడుకొంటున్నారు.

ధరల పతనం, సాగునీటిని మితిమీరిన స్థాయిలో వినియోగించుకోవడం మన వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న జంట సమస్యలు. రైతులు కాల్వల ద్వారా, గొట్టపు బావుల ద్వారా వినియోగించుకొంటున్న నీటికి ఘన పరిమాణం (వాల్యూమెట్రిక్) ప్రాతిపదికన తగిన మొత్తంలో వెలకట్టి వసూలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అయితే దీనివల్ల సాగు ఖర్చులు పెరిగిపోతాయి. ఈ కారణంగా కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)ను ఉత్పత్తి వ్యయాలకు అనుగుణంగా పెంచవలసి ఉన్నది. ఈ రెండు చర్యలు రైతుల సంక్షేమానికి దోహదం చేస్తాయి. అంతేగాక మన నదులను, భూగర్భజలాలను కాపాడతాయి. మరి కనీస మద్దతుధరను పెంచడం సులువైన వ్యవహారం కాదు. అందులో ఒక సమస్య ఉన్నది. మార్కెట్‌లో ఆహార ధాన్యాల ధరలు పెరిగిపోవడమే ఆ సమస్య. దీనివల్ల పట్టణ ప్రాంత పేదలు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా కాయకష్టంపై ఆధారపడిన పేదలు, ఇతర అల్పాదాయ వర్గాల వారు తీవ్ర సమస్యల పాలవుతారు. ప్రత్యామ్నాయమేమిటంటే సాగు చేస్తున్న వ్యవసాయక్షేత్రాల విస్తీర్ణం ప్రాతిపదికన రైతులకు నేరుగా సబ్సిడీలు సమకూర్చడమే. అమెరికా మొదలైన సంపన్న దేశాలు తమ రైతులకు ఇటువంటి సబ్సిడీలు అందిస్తున్నాయి. ప్రతి రైతుకు నేరుగా నగదు రూపేణా ఆర్థిక సహాయం అందించాలి. కేంద్రప్రభుత్వం భారత ఆహారసంస్థకు 2015–16 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,24,419 కోట్ల సబ్సిడీని అందించింది. ప్రస్తుతం ఇది రూ. 1,50,000 కోట్లుగా ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులకు ఏటేటా అందిస్తున్న విద్యుత్, ఇరిగేషన్ సబ్సిడీలు మొత్తం రూ. 2,00,000 కోట్ల మేరకు ఉండవచ్చు. ఈ సబ్సిడీల మొత్తం రూ. 3,50,000 కోట్లను దాదాపు పదికోట్ల మంది రైతులకు ఏటా రూ. 35,000 చొప్పున నేరుగా పంపిణీ చేయవచ్చు. అలా అందించినప్పుడు రైతులు వినియోగించుకొనే నీటికి ఘన పరిమాణం ప్రాతిపదికన ధర వసూలు చేయవచ్చు. రైతులకు ఎలాగూ కనీస మద్దతు ధర విషయమంలో హామీ ఉంటుంది గనుక ఈ పద్ధతి వల్ల ఎటువంటి సమస్య ఉండదు. రైతుల సమస్యలకు మౌలిక పరిష్కారాల అవసరం ఎంతైనా ఉన్నది. అంతేగాని పదే పదే పంట రుణాల మాఫీ వల్ల ఎలాంటి ప్రయోజనముండదు.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

ప్రజల ఉత్సవంగా 'జన్మభూమి'

అధికార యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని పెంచుతూ, ప్రభుత్వంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ జనవరి 2 నుంచి పది రోజుల పాటు జన్మభూమి కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్నది. అభివృద్ధిని పరుగులు పెట్టించాలనే ఉద్దేశంతో పండుగ వాతావరణంలో ఇది ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా ప్రజల ఉత్సవంగా జరపనున్నారు. ప్రతి ఇంటి తలుపుతట్టి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూ నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టనుంది. రైతులను ఆదుకోవాలనే సత్సంకల్పంతో 60 లక్షల మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 24 వేల కోట్ల రుణమాఫీ చేసింది. ఇది రైతుల జీవనస్థాయిని పెంచడానికి, ఆత్మహత్యలను తగ్గించడానికి దోహదపడింది.

వృద్ధులు గౌరవంగా జీవించడానికి రూ. 1000 పింఛను అందిస్తుంది. నేలలు బీటలు వారకుండా, ప్రజలు దాహంతో అలమటించకుండా ఉండాలనే ఉద్దేశంతో నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టి.. ప్రతి ఇంటికి పరిశుభ్రమైన నీరు అందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. యుద్ధప్రాతిపదికన పట్టిసీమ ప్రాజెక్టును పూర్తిచేసి, రెండేళ్లల్లో రూ. 30 వేల కోట్ల విలువైన పంటలను కాపాడటం జరిగింది. రైతులు, మహిళలు, యువకులు అందరినీ నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం ముందుకెళుతోంది.

వ్యక్తిగతంగా, సమష్టిగా ప్రజలందరూ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలనే సదుద్దేశంతో జన్మభూమి కార్యక్రమాన్ని 1997, జనవరి 1న రాష్ట్రమంతటా ప్రారంభించారు. సమాజ పునర్నిర్మాణానికి ఉపయోగపడే త్యాగనిరతి, నిరంతర కృషి, నిజాయితీ, ఆత్మగౌరవం, కష్టించి పని చేయడం, సమానత్వం, చురుకైన భాగస్వామ్యం, పారదర్శకత్వం, జవాబుదారీతనం మొదలైన విలువలు జన్మభూమికి ఉన్న ప్రత్యేకతలు. 'జన్మభూమి' కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాకుండా ప్రజల భాగస్వామ్యంతో కొనసాగే నిరంతర అభివృద్ధి ప్రక్రియగా సాగుతోంది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి వెళుతున్నాయా, లేదా? అనేది తెలుసుకోవడంతో పాటు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం, సంక్షేమ ఫలాలు అందని వారి నుంచి దరఖాస్తు స్వీకరించడం, వాటిని త్వరితగతిన పరిష్కరించి ఆయా పథకాలు చిట్టచివరి వ్యక్తికి కూడా చేరవేసేలా చేయడమే జన్మభూమి కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

మొదటిరోజు సంక్షేమం, సంతృప్తి, రెండోరోజు ఆరోగ్యం, ఆనందం, మూడో రోజు స్వచ్ఛాంధ్రప్రదేశ్, నాలుగో రోజు విద్య, వికాసం, ఐదో రోజు గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, ఆరవ రోజు సహజ వనరుల అభివృద్ధి, ఏడవ రోజు వ్యవసాయం అనుబంధం, ఎనిమిదవ రోజు సుపరిపాలన, టెక్నాలజీ, తొమ్మిదవ రోజు స్వర్ణాంధ్రప్రదేశ్, పేదరికంపై గెలుపు, పదవ రోజు ఆనందలహరి అంటూ ఒక్కోరోజు ఒక్కో అంశానికి ప్రాధాన్యతనిస్తూ జన్మభూమి జరగనుంది. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా లక్షా 65 వేల సమావేశాలు, 16వేల గ్రామసభలు, మొత్తం లక్షా 80వేల సమావేశాలు నిర్వహించనున్నారు.

జన్మభూమి–మా ఊరు కార్యక్రమాన్ని గాంధీ జయంతి రోజున అక్టోబర్ 2, 2014 నుంచి ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు నాలుగు విడతలుగా జరిగాయి. 2018 జనవరి 2 నుంచి 11 వరకు ఐదో విడత జన్మభూమి–మా ఊరు కార్యక్రమం జరగనుంది. గత విడతల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులో 95 శాతం దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించింది. 4వ విడత 'జన్మభూమి– మా ఊరు' కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో 16,400 గ్రామ, వార్డులలో ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కుటుంబ వికాసం (15 అంశాలు), సమాజ వికాసం (పది అంశాలు) పేరుతో జరిగిన ఈ సభలలో అన్నివర్గాల ప్రజలతో పాటు విద్యార్థులు అత్యధికంగా పాల్గొన్నారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు మొత్తం 26,21,086 మందికి రూ.278.54 కోట్లు పంపిణీ చేశారు. 5,79,474 రేషన్ కార్డులు అందజేశారు. ఆహార రక్షణ కార్యక్రమం కింద అర్హులైన 93,48,753 మంది నెలకు 5 కిలోల బియ్యం చొప్పున లబ్ధి పొందారు. 81,22,950 మంది సంక్రాంతి కానుకలు, 15,24,172 మంది క్రిస్మస్ కానుకలు అందుకున్నారు. చంద్రన్న బీమా పథకం కింద 1,13,939 చనిపోయిన వారి తరపున క్లెయిమ్ చేశారు. మొత్తం సమాచారాన్ని పూర్తి పారదర్శకతతో 'మీకోసం' వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగింది.

గత విడతలో చేసిన అభివృద్ధిని ఆసరాగా చేసుకొని 2018లో జరుగుతున్న జన్మభూమి – మాఊరు కార్యక్రమాన్ని మరింత రెట్టింపు వేగంతో సంక్షేమ కార్యక్రమాలు చివరి గడప వరకూ చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకోసం 10 రోజుల్లో 10 అంశాలపై గ్రామస్థాయిలో విస్తృతస్థాయిలో చర్చ, ప్రజల భాగస్వామ్యంతో పలు కార్యక్రమాలు రూపొందించారు. భూగర్భ జలాలను పెంపొందించడానికి చేపట్టిన 5 లక్షల పంట కుంటలను ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 20 లక్షల మందికి ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంలో 46 లక్షల మందికి పింఛన్లు రాగా ఇప్పుడు కొత్తగా 5 లక్షల మందికి సామాజిక పింఛన్లు ఇస్తున్నారు. హిజ్రాలకు సైతం పింఛన్లను అందించనున్నారు. రూ.190 కోట్లతో చంద్రన్న బీమా ద్వారా దాదాపు 15.83 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది. ఈ కార్యక్రమాన్ని రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో మండల స్థాయి అధికారులతో నియమించిన బృందాలు ప్రతి గ్రామంలో జన్మభూమి – మా ఊరు నిర్వహిస్తాయి. అందులో ప్రతి కార్యక్రమంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, ఆనందమయ సమాజానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరిస్తారు. రెండో భాగంలో ఎంపిక చేసిన అంశంపై చర్చ జరుగుతుంది.

జన్మభూమి – మా ఊరు కార్యక్రమం సందర్భంగా నేటి నుంచి పది రోజులపాటు పది జిల్లాల్లో ముఖ్యమంత్రి స్వయంగా పర్యటిస్తారు. ప్రతి సమావేశంలో అరగంటకు పైగా గ్రామాల పరిస్థితులపై ఆయా గ్రామస్తులతో చర్చించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లనున్నారు. అర్హులైన వారందరికీ పార్టీలకు అతీతంగా పింఛన్లు, రేషన్ కార్డులు అందజేయనున్నారు. అభివృద్ధి ఆధారంగా పంచాయతీలకు స్టార్ రేటింగ్‌లు ఇచ్చి.. ఆ రేటింగ్ ఆధారంగా ఉత్తమ పంచాయతీలను గుర్తించి ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించారు.

జన్మభూమి – మా ఊరు కార్యక్రమం సందర్భంగా నేటి నుంచి పది రోజులపాటు పది జిల్లాల్లో ముఖ్యమంత్రి స్వయంగా పర్యటిస్తారు. ప్రతి సమావేశంలో అరగంటకు పైగా గ్రామాల పరిస్థితులపై ఆయా గ్రామస్తులతో చర్చించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో అర్హులైన వారందరికీ పార్టీలకు అతీతంగా పింఛన్లు, రేషన్ కార్డులు అందజేయనున్నారు. అభివృద్ధి ఆధారంగా పంచాయతీలకు స్టార్ రేటింగ్‌లు ఇచ్చి.. ఆ రేటింగ్ ఆధారంగా ఉత్తమ పంచాయతీలను గుర్తించి ప్రోత్సాహకాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాల కల్పన, పౌష్టిక ఆహార కల్పన వంటి వాటిని పంచాయతీల రేటింగ్ నిర్ణయించేందుకు ప్రామాణికంగా తీసుకోనున్నారు.

విద్యార్థులను రేపటి పౌరులుగా తీర్చిదిద్దడానికి వారి విద్యకు తగ్గ విధంగా భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగించడం కోసం జన్మభూమి– మాఊరు వేదికగా ఉపయోగించుకోనున్నారు. దీని ద్వారా అగ్రికల్చర్, మెడిసిన్ వంటి విద్యార్థులకు క్షేత్రస్థాయిలో ఎదురయ్యే అంశాలపై అవగాహన కలిగి భవిష్యత్తులో వారు ఆయా వృత్తులలో ఎంతో మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుంది. ప్రజలకు ఉపయోగకరంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జన్మభూమి – మా ఊరు కార్యక్రమాన్ని 'ఆనందలహరి' అంటూ ఫుడ్ ఫెస్టివల్, వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడలు, రంగవల్లుల పోటీల ద్వారా నిర్వహించనున్నారు. విజేతలను, ఉత్తమ రైతులను, విద్యార్థులను, ఆరోగ్యవంతులను సన్మానిస్తూ కార్యక్రమం ముగించనున్నారు.

■ గురజాల మాల్యాద్రి
కోఆర్డినేటర్, తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్

రసాయనిక ఎరువులతో
50 లక్షల కోట్ల నష్టం

- అన్ని వర్గాల వారిపై ప్రభావం
- సేంద్రియ సేద్యంలోనూ లోపాలే: పాలేకర్



గుంటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం వలన దేశ ప్రజలు ఏటా రూ.50 లక్షల కోట్లు నష్టపోతున్నట్లు ప్రకృతి సేద్యం సృష్టికర్త సుభాష్ పాలేకర్ చెప్పారు. హరిత విప్లవం పేరుతో దేశవ్యాప్తంగా ఆహార ఉత్పత్తులను పెంచాలని ప్రభుత్వాలు రసాయనిక ఎరువులు, పురుగు మందులను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నాయన్నారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోని బైబిల్ మిషన్ గ్రౌండ్‌లో రెండో రోజైన సోమవారం జరిగిన శిక్షణా తరగతుల్లో ఆయన ప్రసంగించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని, వ్యవసాయ ఉత్పత్తులు విషతుల్యాలుగా మారి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని సుభాష్ పాలేకర్ చెప్పారు. దేశవ్యాప్తంగా రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ వ్యవసాయం పేరుతో అనేక లోపాలు జరుగుతున్నట్లు తెలిపారు. వర్మి కంపోస్టు పేరుతో కార్పొరేట్ కంపెనీలు రైతుల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నాయని పాలేకర్ అన్నారు. ప్రధానంగా ప్రకృతిలోని సహజ వనరుల వలనే వ్యవసాయానికి మేలు జరుగుతుందని, సహజ సిద్ధమైన వ్యవసాయాన్ని చేపట్టాలన్నారు. పశు పోషణ మంచిదని, ఆవుల పెంపకం వలన రైతులు ఆర్థికంగా లబ్ధి పొందడంతో పాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పెంచవచ్చని వివరించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలు నివారించాలంటే పెట్టుబడి లేని సేద్యమే దిక్కు అన్నారు. పర్యావరణానికి మేలు చేసే పెట్టుబడి లేని వ్యవసాయాన్ని అందరూ ఆచరించాలన్నారు. పాలేకర్ సలహాలు, సూచనలు పాటించి పెట్టుబడి లేని వ్యవసాయాన్ని అమలు చేయడం వలనే మారిషస్ అభివృద్ధి చెందినట్లు ఆ దేశానికి చెందిన హైకమిషనర్ జగదీశ్ ప్రకాశ్ తెలిపారు.

మౌజన్ హంతకుడి అరెస్టు

- 48గంటల్లో ఛేదించిన పోలీసులు
- సీఎం చంద్రబాబు అభినందన



ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: సంచలనం రేకెత్తించిన మసీదు మౌజన్ హత్య కేసులో నిందితుని పోలీసులు అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు బత్తిననగర్ మసీదులో గత నెల 29న మౌజన్ ఎండీ ఫరూఖ్(60) హత్యకు గురయ్యారు. దీనిపై ముస్లిం సంఘాలు నిరసనలు నిర్వహించాయి. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి త్వరితగతిన ఛేదించాలని పోలీస్‌శాఖకు ఆదేశాలిచ్చారు. దీంతో 5 ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టడంతో పాటు మృతుడి స్వరాష్ట్రమైన బీహార్‌కు వెళ్లాయి. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన మణిరత్నం ఈ హత్య చేసినట్టు తేలింది. నిందితుడు ఉరవకొండ బస్టాండ్‌లో ఉన్నట్టు సమాచారం రావడంతో గుంతకల్లు పోలీసులు వెళ్లి పట్టుకున్నారు. మణిరత్నం బాల్యం నుంచే నేరప్రవృత్తి కలిగి ఉన్నాడని, సైకోగా మారిన అతను 2011లో కర్నూలు జిల్లా హొలగివి మండలం తిరుగాపురానికి చెందిన తిరుపతయ్యను రూ.3 వేల కోసం హత్య చేశాడని, 2013లో గుంతకల్లులో వెంకటేశ్ అనే వ్యక్తిని హత్య చేశాడన్నారు. రాజమండ్రిలో తన అన్న సెంథిల్ కుమార్ వద్ద ఉండేవాడని తెలిపారు. మణిరత్నంను సోమవారం రాజమండ్రి పోలీసులకు అప్పగించామని తెలిపారు. కాగా, మౌజన్ హత్య, అనంతర పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సచివాలయంలోని రియల్‌టైం గవర్నెన్స్ సెంటర్ నుంచి సమీక్షించారు. హత్యకు పాల్పడిన నిందితుడిని ఉరవకొండలో అరెస్టు చేసిన విషయాన్ని పోలీసులు వివరించారు. 48 గంటల్లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పోలీసులు స్పందించిన తీరును సీఎం అభినందించారు. నేరం చేయాలంటే భయపడే పరిస్థితి తీసుకురావాలని సూచించారు.



నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న, వేగే వెంకటేశ్వరరావు, దేవినేని అవినాష్, నాగుల్‌మీరా - విజయవాడ



సంస్కృతి సంగీత సాహిత్య నృత్యనాటక సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులో సోమవారం అజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణను సారస్వత భాస్కర పురస్కారంతో సత్కరిస్తున్న ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల - గుంటూరు(సాంస్కృతికం)



కెరీర్ గైడ్

సంప్రదాయ కెరీర్‌లలో నేటికీ ఆకర్షణీయంగా ఉంది... న్యాయవాద వృత్తి. వాక్చాతుర్యం, సవాళ్లను స్వీకరించే గుణం ఉన్న వారికి సరిపడే వృత్తి ఇది. ప్రపంచీకరణ నేపథ్యంలో కెరీర్ పరంగా 'లా' సంప్రదాయ స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయికి చేరింది. పేటెంట్ హక్కుల పర్యవేక్షణ, కాపీరైట్, పబ్లిషింగ్ సంస్థలు, ఎన్‌జీఓలు, కార్పొరేట్ కంపెనీల్లో మంచి వేతనాలతో అవకాశాలు లభిస్తున్నాయి. న్యాయ విద్యను అభ్యసించడానికి అత్యున్నతమైనవి జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాలు. వీటిల్లో ప్రవేశానికి వీలు కల్పించే క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్) - 2018కి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో క్లాట్ పరీక్ష విధానం, అర్హత, తదితర వివరాలను తెలుసుకుందాం..

లా కెరీర్‌కు.. క్లాట్

జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి క్లాట్‌ను నిర్వహిస్తారు. ఏటా ఒక్కో యూనివర్సిటీ ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తుంది. ఈ ఏడాది క్లాట్‌ను కోచిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ నిర్వహిస్తోంది. క్లాట్ పరీక్ష ద్వారా 19 జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో పీజీ, అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. తెలంగాణలో నల్సార్ (హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లో (విశాఖపట్నం) దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కూడా వీటిలో ఉన్నాయి.

అర్హత

- **అండర్‌గ్రాడ్యుయేషన్:** ఐదేళ్ల లా కోర్సులో చేరే విద్యార్థులు 45 శాతం మార్కులతో 10+2/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **పోస్ట్‌గ్రాడ్యుయేషన్:** ఎల్‌ఎల్‌ఎం కోర్సులో చేరేవారు 55 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ/ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా అర్హులే.

పరీక్ష విధానం - ప్రిపరేషన్

- **అండర్‌గ్రాడ్యుయేషన్:** ఈ విభాగం కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 0.25 మార్కు కోత విధిస్తారు. మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఇస్తారు. వీటికి రెండు గంటల్లో సమాధానాలను గుర్తించాలి. ఇంగ్లీష్ - కాంప్రెహెన్షన్, జీకే అండ్ కరెంట్ అఫైర్స్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, లీగల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. 150 మార్కులు సాధిస్తే ఏదో ఒక యూనివర్సిటీలో అడ్మిషన్ తప్పకుండా లభిస్తుంది. మార్కులు, ప్రశ్నల విభజన ఇలా ఉంటుంది.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లీష్ - కాంప్రెహెన్షన్	40	40
జీకే అండ్ కరెంట్ అఫైర్స్	50	50
మ్యాథమెటిక్స్	20	20
లీగల్ ఆప్టిట్యూడ్	50	50
లాజికల్ రీజనింగ్	40	40
మొత్తం	**200**	**200**

- **ఇంగ్లీష్:** గ్రామర్, ఇంగ్లీష్ భాషపై ప్రాథమిక అవగాహన ఉంటే ఈ విభాగంలో చక్కని స్కోర్ చేయవచ్చు. కాంప్రెహెన్షన్‌లో మంచి మార్కులకు వొకాబులరీపై పట్టు సాధించాలి. జనరల్ ఇంగ్లీష్‌లో కేవలం వ్యాకరణమే కాకుండా పదాల వాడుక, సాధన మీద పట్టు ఉండాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కరెక్షన్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి. ముఖ్యంగా నిత్య జీవితంలో ఇంగ్లీష్ భాష వినియోగం, సంబంధిత అంశాలాధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఈ క్రమంలో గ్రామర్, వొకాబులరీ, కాంప్రెహెన్షన్, యూజ్ ఆఫ్ వర్డ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగం కోసం వర్డ్ పవర్ మేడ్ ఈజీ - నార్మన్ లూయిస్; ఆబ్జెక్టివ్ జనరల్ ఇంగ్లీష్ - ఆర్.ఎస్.అగర్వాల్; రెన్ అండ్ మార్టిన్ పుస్తకాలను చదవడం ప్రయోజనకరం.
- **జీకే అండ్ కరెంట్ అఫైర్స్:** కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా న్యాయ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, మార్పులు, కొత్త చట్టాలు, కేసులు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. భారతదేశ చరిత్ర, రాజ్యాంగానికి సంబంధించిన ప్రశ్నలూ రావచ్చు. అందువల్ల జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టిపెట్టాలి. రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అవగాహన పెంచుకోవాలి. కరెంట్ అఫైర్స్ కోసం మనోరమ ఇయర్ బుక్, ఇండియా ఇయర్ బుక్, సీఎస్‌ఆర్ ఇయర్ బుక్, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలతో పాటు దిన పత్రికలు రోజూ చదవడం అలవాటు చేసుకోవాలి.
- **ఎలిమెంటరీ మ్యాథ్స్:** ఈ విభాగంలో అడిగే ప్రశ్నలు మ్యాథమెటిక్స్‌లో ప్రాథమిక సామర్థ్యాలను పరీక్షించే విధంగా ఉంటాయి. కాబట్టి 6 - 10వ తరగతి వరకు మ్యాథమెటిక్స్ పుస్తకాల్లోని అన్ని అంశాలపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకోవాలి. అందులోని సూత్రాలను, ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యమివ్వాలి. వీలైనంత ఎక్కువగా మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఇదే క్రమంలో షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవాలి. తద్వారా సమాధానాన్ని వేగంగా, కచ్చితత్వంతో గుర్తించవచ్చు.
- గత పరీక్షల్లో అర్థమెటిక్ ఆధారిత విభాగాల నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడిగారు. అందువల్ల శాతాలు, నిష్పత్తులు, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్, లాభనష్టాలు, వర్గ మూలాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దీని కోసం క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ - ఆర్.ఎస్.అగర్వాల్; ఫాస్ట్ ట్రాక్ ఆబ్జెక్టివ్ అర్థమెటిక్ - అర్హింత్ పుస్తకాలను చదవాలి.

లీగల్ ఆప్టిట్యూడ్

- ఇందులో న్యాయశాస్త్ర సంబంధ ప్రశ్నలు ఇస్తారనుకుంటే పొరపాటు. అభ్యర్థుల్లో న్యాయపరమైన దృక్పథాన్ని; ఒక అంశం, వివాదం పట్ల సహేతుక ఆలోచన, నిర్ణయం వెలిబుచ్చే నైపుణ్యాలను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. ఒక వివాదాన్ని పరిష్కరించే క్రమంలో అందరికీ ఆమోదయోగ్య పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి.
- చట్టాలు, న్యాయ వ్యవస్థకు సంబంధించి ఇటీవలి పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. ఈ విభాగం కోసం యూనివర్సిల్ ఎల్‌ఎల్‌బీ ఎంట్రెన్స్ గైడ్, లీగల్ ఆప్టిట్యూడ్ - ఎ.పి.భరద్వాజ్. లీగల్ ఆప్టిట్యూడ్ - ఆర్‌కే గుప్తా పుస్తకాలను చదవాలి.
- **లాజికల్ రీజనింగ్:** అభ్యర్థుల తార్కిక శక్తిని పరీక్షించే విభాగం. ముఖ్యంగా సందర్భానుసారం సమయస్ఫూర్తిగా ఎలా వ్యవహరిస్తారో తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో ప్యాసేజ్ ఆధారితంగా, అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. సిలాజిజమ్, కోడింగ్, డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పొందాలి. ఈ విభాగం కోసం వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్ - ఆర్‌ఎస్ అగర్వాల్, అనలిటికల్ రీజనింగ్ - ఎం.కె. పాండే పుస్తకాలను చదవడం ఉపయోగకరం.

క్లాట్-2018 ద్వారా ప్రవేశం కల్పించే సంస్థలు

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ	-	బెంగళూరు
నల్సార్	-	హైదరాబాద్
నేషనల్ లా యూనివర్సిటీ	-	భోపాల్
వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యురిడికల్ సైన్సెస్	-	కోల్‌కతా
నేషనల్ లా యూనివర్సిటీ	-	జోధ్‌పూర్
హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ	-	రాయ్‌పూర్
గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ	-	గాంధీనగర్
డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ	-	లక్నో
రాజీవ్‌గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా	-	పాటియాలా
చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ	-	పాట్నా
నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్	-	కొచ్చి
నేషనల్ లా యూనివర్సిటీ	-	ఒడిశా
నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా	-	రాంచీ
నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యుడిషియల్ అకాడమీ	-	గువహతి
దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ	-	విశాఖపట్నం
తమిళనాడు నేషనల్ లా స్కూల్	-	త్రిచీ
మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ	-	ముంబై
మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ	-	నాగ్‌పూర్
మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ	-	ఔరంగాబాద్

క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో అత్యాధునిక కరిక్యులమ్, మౌలిక వసతులూ, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది ఉంటారు. తద్వారా నాణ్యమైన బోధన లభిస్తుంది. ప్రాంగణ నియామకాలు (క్యాంపస్ ప్లేస్‌మెంట్స్) తప్పనిసరిగా ఉంటాయి. దాంతో కోర్సు పూర్తిచేసిన వెంటనే ఉద్యోగం గ్యారెంటీ అని చెప్పొచ్చు.

- హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ - రాయ్‌పూర్‌లో 2016 - 17లో 57 మందికి, వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యురిడికల్ సైన్సెస్ - కోల్‌కతా 2017లో 73 మందికి జాబ్ ఆఫర్స్ వచ్చాయి. బహుళజాతి సంస్థలూ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులూ, ప్రైవేటు ఈక్విటీ కంపెనీలూ, కన్సల్టింగ్ సంస్థలూ, అకౌంటింగ్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

పోస్ట్‌గ్రాడ్యుయేషన్

ఈ విభాగం కోసం నిర్వహించే పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 0.25 మార్కు కోత విధిస్తారు. మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఇస్తారు. వీటికి రెండు గంటల్లో సమాధానాలను గుర్తించాలి. కాన్‌స్టిట్యూషన్ లా, జ్యురిస్‌ప్రుడెన్స్, లా సబ్జెక్టులు (క్రిమినల్ లా, ఇంటర్నేషనల్ లా, ఐపీఆర్ తదితరాలు) విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. మార్కులు, ప్రశ్నల విభజన ఇలా ఉంటుంది.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
కాన్‌స్టిట్యూషన్ లా	50	50
జ్యురిస్‌ప్రుడెన్స్	50	50
లా సబ్జెక్టులు	50	50
మొత్తం	**150**	**150**

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31, 2018.
- అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్: ఏప్రిల్ 20 నుంచి మే 13 వరకు.
- ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మే 13, 2018
- ఫలితాల వెల్లడి: మే 31, 2018
- వెబ్‌సైట్: www.clat.ac.in

జాబ్ కార్నర్ ట్రాన్స్‌కోలో ఇంజనీర్లు

హైదరాబాద్‌లోని ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టిఎస్ ట్రాన్స్‌కో) అసిస్టెంట్ ఇంజనీర్, లైన్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 1,604 ఖాళీలు ఉన్నాయి. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం....

సబ్ ఇంజనీర్

ఎలక్ట్రికల్ విభాగంలో మొత్తం 174 పోస్టులు ఉన్నాయి. సదరన్ జోన్‌లో 94, నార్తరన్ జోన్‌లో 80 ఖాళీలు ఉన్నాయి. 2017 జూలై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఈ పోస్టులను రాత పరీక్ష ఆధారంగా భర్తీ చేస్తారు.

- **అర్హత:** ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా / డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **రాత పరీక్ష వివరాలు:** పరీక్ష సమయం 2 గంటలు. పరీక్షలో 80 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (80 మార్కులు) ఇస్తారు. సెక్షన్ ఎ కింద డిప్లొమా స్థాయిలో ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించి 65 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్ బి కింద జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు సమాచారం**
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 20 నుంచి
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 5
- రాత పరీక్ష: ఫిబ్రవరి 25

జూనియర్ లైన్‌మెన్

- **ఖాళీల వివరాలు:** ఈ కేటగిరీలో మొత్తం 1100 పోస్టులు ఉన్నాయి. సదరన్ జోన్‌కు 657, నార్తరన్ జోన్‌కు 443 ఖాళీలను కేటాయించారు. హైదరాబాద్‌లో 105, రంగారెడ్డిలో 163, సంగారెడ్డిలో 141, మహబూబ్‌నగర్‌లో 121, నల్గొండలో 127, వరంగల్‌లో 110, ఖమ్మంలో 63, నిజామాబాద్‌లో 92, ఆదిలాబాద్‌లో 56 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** 2017 జూలై 1 నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- టెన్త్‌తోపాటు ఎలక్ట్రికల్/ వైర్‌మన్ ట్రేడ్‌లో ఐటిఐ / రెండేళ్ల ఇంటర్ ఒకేషనల్ కోర్సు చేసి ఉండాలి.
- **రాత పరీక్ష వివరాలు:** పరీక్ష సమయం 2 గంటలు. ఇందులో కూడా 80 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (80 మార్కులు) ఇస్తారు. సెక్షన్-ఎ కింద ఐటిఐ స్థాయిలో 65 ప్రశ్నలు, సెక్షన్-బి కింద జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు. రాత పరీక్షలో అర్హత పొందినవారికి పోల్/ టవర్ క్లైంబింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. క్లైంబింగ్ టెస్ట్ క్వాలిఫై అయితేనే పోస్టింగ్ ఇస్తారు.
- **దరఖాస్తు సమాచారం**
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 5 నుంచి
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 20
- రాత పరీక్ష: ఫిబ్రవరి 11న
- వెబ్‌సైట్: http://tstransco.cgg.gov.in

అసిస్టెంట్ ఇంజనీర్

- **ఖాళీల వివరాలు:** ఎలక్ట్రికల్, సివిల్, టెలికాం విభాగాలకు మొత్తం 330 పోస్టులు ఉన్నాయి. జనరల్ రిక్రూట్‌మెంట్ కింద 300, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ కింద 30 పోస్టులను భర్తీచేస్తారు.
- **జోన్‌లవారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్ విభాగంలో సదరన్ జోన్‌కు 130, నార్తరన్ జోన్‌కు 120; సివిల్ విభాగంలో సదరన్ జోన్‌కు 26, నార్తరన్ జోన్‌కు 23; టెలికాం విభాగంలో సదరన్ జోన్‌కు 16, నార్తరన్ జోన్‌కు 15 పోస్టులను కేటాయించారు.
- **వయసు:** 2017 జూలై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/ బిసి అభ్యర్థులకు అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.
- **అర్హత:** ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ సివిల్/ టెలికమ్యూనికేషన్స్ / ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ విభాగాల్లో బిఇ / బిటెక్/ ఎఎంఐఇ (సెక్షన్‌ఎ & బి) ఉండాలి.
- **ఎంపిక:** అభ్యర్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులో అర్హులైనవారితో మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. రాత పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులు 40 శాతం, బిసిలు 35 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 30 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. రాత పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి మెరిట్‌లిస్ట్ ప్రకారం మంచి ర్యాంక్ పొందినవారిని మాత్రమే ఎంపికచేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.
- **రాత పరీక్ష వివరాలు:** పరీక్ష సమయం 2 గంటలు. రాత పరీక్షలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (100 మార్కులకు) ఇస్తారు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఎ కింద సంబంధిత టెక్నికల్ సబ్జెక్ట్ నుంచి 80 ప్రశ్నలు, సెక్షన్ బి కింద జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సిలబస్ గేట్ సిలబస్ మాదిరిగానే ఉంటుంది.
- **దరఖాస్తు సమాచారం:**
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 1
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 16
- రాత పరీక్ష: మార్చి 11న



అత్యంత పురాతన ఆరావళి

పోటీ పరీక్షల ప్రత్యేకం జాగ్రఫీ


భారతదేశంలో అత్యంత పురాతనమైనవి ఆరావళి పర్వతాలు. ఇవి దేశానికి వాయవ్య భాగంలో సుమారు 800 కి.మీ పొడవున ఉన్నాయి. నైరుతి నుంచి ఈశాన్య దిశ వైపున గుజరాత్‌లోని పలన్‌పూర్ నుంచి ఢిల్లీ వరకు విస్తరించి ఉన్నాయి. వీటిలో అత్యంత ఎత్తైన పర్వత శిఖరం 'గురుశిఖర'. దీని ఎత్తు 1722 మీ. ఈ పర్వతాలు ప్రధానంగా గ్రానైట్, నీస్, ఛిస్టే శిలలతో ఏర్పడ్డాయి. ఉదయపూర్ వాయవ్య ప్రాంతంలో విస్తరించిన ఈ పర్వతాలను స్థానికంగా 'జర్గాకొండలు' అని పిలుస్తారు. ఇక్కడి 'గోరాన్‌ఘాట్' కనుమ, 'గురు శిఖర్'లను 'మౌంట్ అబూ' వేరు చేస్తోంది. 'గ్రేట్ బౌండరీ పాల్టే', ఆరావళి పర్వతాలను వింధ్య పర్వతాలనుంచి వేరు చేస్తుంది. హిమాలయ పర్వత నదులు తీసుకువచ్చిన ఒండ్రు మట్టితో హిమాలయ పర్వతాలు రూపొందగా టెథిస్ సముద్ర భాగం విడిపోయి క్రమంగా 'ఉత్తర మైదానాలు' ఏర్పడ్డాయి.

ఉత్తర మైదానాలు

- ఇవి ప్రధానంగా సింధు, బ్రహ్మపుత్ర నదుల మధ్య సుమారు 3200 కిమీ పొడవున విస్తరించి ఉన్నాయి. సట్లెజ్, రావి నదుల నుంచి గంగానది మధ్యభాగంలోకి సుమారు 2400 కి.మీ. వరకు విస్తరించాయి. దీని వెడల్పు సుమారు 100 కి.మీ. నుంచి 300 కి.మీ. మధ్యలో ఉంటుంది. తూర్పు నుంచి పశ్చిమానికి వెళ్లే కొద్దీ వెడల్పు పెరుగుతుంది. దీని విస్తీర్ణం సుమారు 7.7 లక్షల చదరపు కిలోమీటర్లు.
- ఉత్తర మైదానాలను అవి ఏర్పడిన విధానం, వాటి లక్షణాలను బట్టి మూడు రకాలుగా వర్గీకరించారు. అవి... ఖాదర్ / కొత్త ఒండ్రు నేలలు, భంగర్ నేలలు/ పాత ఒండ్రు నేలలు, బాబర్ నేలలు.
- **ఖాదర్ నేలలు:** ఇవి సారవంతమైనవి. నదులకు ఇరువైపులా ఈ నేలలు ఏర్పడతాయి. తరచుగా వరదలకు గురవుతుంటాయి. పంజాబ్‌లో వీటిని బెట్స్‌గా పిలుస్తారు.
- **భంగర్ నేలలు:** ఇవి అంతసారవంతమైన నేలలు కావు. రసాయనిక ఎరువులు వాడడం వలన వ్యవసాయానికి అనుకూలంగా మారతాయి. ఇవి నదులకు దూరంగా ఎత్తైన ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.
- **బాబర్ నేలలు:** శివాలిక్ పాదాల వద్ద విసనకర్ర ఆకారంలో ఉండే గులకరాళ్ల ప్రాంతాన్ని 'బాబర్' నేలలు అంటారు. ఈ నేలలు వ్యవసాయానికి పనికి రావు. ఇక్కడ పొడవైన వేర్లు ఉండే పెద్ద చెట్లు పెరుగుతాయి. శివాలిక్ ప్రాంతంలోని ఛోస్, రోస్ అనే తాత్కాలిక ప్రవాహాలు బాబర్ నేలల్లోకి విస్తరించి ఉన్నాయి.
- **తెరాయ్ నేలలు:** శివాలిక్ ప్రాంతంలో ఎక్కువ తేమతో ఉండే నేలలను 'తెరాయ్' నేలలు అంటారు. బాబర్ నేలల్లో అదృశ్యమైన చిన్నచిన్న నదులు తెరాయ్ నేలల వద్ద ఉద్భృతి చెందుతాయి. తెరాయ్ నేలలు ఎక్కువగా బాబర్ ప్రాంతానికి దక్షిణంగా విస్తరించాయి. వీటి వెడల్పు సుమారు 15 నుంచి 820 కిమీ వరకు ఉంటుంది. ఈ నేలల్లో దట్టమైన అడవులు ఉంటాయి. ఇక్కడ మలేరియా కారక శీతోష్ణ పరిస్థితులు ఉంటాయి. తెరాయి ప్రాంతంలో స్థానికంగా లవణీయత ఉన్న నేలలను రే, కల్లార్, ఊసర, తుర్ అని పిలుస్తారు.
- ఉత్తర మైదానాల్లో ఎండిపోయిన నదీ ప్రవాహ గుర్తులను 'దోరోస్'లని, ఆ ప్రాంతంలో ఏర్పడిన తాత్కాలిక సరస్సులను 'ధాండ్స్' లని అంటారు. జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని సరస్సులను 'టోరాన్సే' అని కూడా పిలుస్తారు

థార్ ఎడారి

- ఇది భారతదేశానికి వాయవ్య భాగంలో సుమారు 2 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. భారతదేశంలో సుమారు 1.75 లక్షల చదరపు కిలోమీటర్లు, పాకిస్థాన్‌లో దాదాపు 25 వేల చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. థార్ ఎడారి దేశంలోనే అత్యంత దుర్భిక్ష ప్రాంతం. ఇక్కడ సరాసరి వర్షపాతం 20 సెం.మీ కంటే తక్కువ.
- రాజస్థాన్ రాష్ట్రంలో థార్ ఎడారి అధిక ప్రాంతంలో విస్తరించి ఉంది. పంజాబ్, హర్యాణా, ఉత్తర గుజరాత్‌ల్లో కూడా కొంత ప్రాంతంలో ఎడారి శీతోష్ణస్థితి విస్తరించి ఉంది. థార్ ఎడారి ప్రాంతంలో ఆరావళి పర్వతాలు నైరుతి నుంచి ఈశాన్యం వైపు విస్తరించాయి.
- ఆరావళి పర్వతాలకు తూర్పున గల అర్థ శుష్క శీతోష్ణస్థితి గల సారవంతమైన ప్రాంతాలను 'రాజస్థాన్ బగర్'గా పేర్కొంటారు. ఈ మైదాన ప్రాంతానికి పశ్చిమ భాగంలో ఉన్న శుష్క శీతోష్ణస్థితి ప్రాంతాన్ని 'మరుస్థలి' అంటారు.
- రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంతంలో ఉన్న ఉప్పునీటి సరస్సులను ప్లమాలు లేదా దాండియాలు అంటారు. ఇక్కడ సాంబరు, దిద్వానా, దేబార్ అనే ప్రధాన ఉప్పునీటి సరస్సులు ఉన్నాయి.
- ఇక్కడ లూని నది పరివాహక ప్రాంతంలో కనిపించే సారవంతమైన మైదానాలను 'తాళీలు' అంటారు. సారవంతమైన ప్రాంతాలను స్థానికంగా 'రోహి'లని, కదిలే ఇసుక దిబ్బలను 'ధ్రిమాన్'లు అంటారు.



ఎస్.వి. నారాయణ

సీనియర్ ఫ్యాకల్టీ

S & D



'నూతన'ంగా...

నూతన సంవత్సరాది సందర్భంగా సోమవారం నెల్లూరులోని రాజేంద్రనగర్ వాసులు వినూత్న రీతిలో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శ్రీ మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించారు. చిన్న నోటు నుంచి పెద్ద నోటు వరకు సుమారు పది లక్షల రూపాయలతో ఆలయాన్ని అలంకరించారు. ఈ మందిరాన్ని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

-నెల్లూరు



జల్లికట్టు సందడి

సంక్రాంతి ప్రారంభానికి నాందిగా చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వేపకుప్పంలో సోమవారం నిర్వహించిన జల్లికట్టు సందడిగా సాగింది. సాధారణంగా కనుమ రోజున నిర్వహించే ఈ పోటీలను ఈసారి ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా ఏర్పాటు చేయడం విశేషం. పశువుల కొమ్ములను చెక్కి రంగుపూసి రంగు పేపర్లు, దుస్తులతో సుందరంగా అలంకరించారు. కొమ్ములకు చెక్కలతో తయారుచేసిన పలకలు, నగదు కట్టగా, తరుముకొచ్చే పశువులను, కోడె గిత్తలను పట్టుకునేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ జల్లికట్టులో 20 గుంపుల ఆవులు, 10 జతల కోడెగిత్తలు పాల్గొన్నాయి.

- రామచంద్రాపురం



నూతన సంవత్సరం సందర్భంగా ఉండవల్లిలోని నివాసంలో సీఎం చంద్రబాబు దంపతులను ఆశీర్వదిస్తున్న టీటీడీ, కనకదుర్గ దేవస్థానాల పండితులు



చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డీజీపీ మాలకొండయ్య

స్ఫూర్తిమంతంగా పనిచేయండి!

- ఉద్యోగులకు చంద్రబాబు సూచన
- సీఎంకు శుభాకాంక్షల వెల్లువ
- ఉండవల్లి నివాసంలో సందడే సందడి!

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నూతన సంవత్సరంలో మరింత స్ఫూర్తిమంతమైన పనితీరును కనబరచాలని ప్రభుత్వ ఉద్యోగులను సీఎం చంద్రబాబు కోరారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా వెలగపూడిలోని సచివాలయంలో ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు నేతృత్వంలో ఎన్జీవో నేతలు సీఎం చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన రాజధాని నిర్మాణం, ప్రజలకు సేవలు అందించడంలో ఉద్యోగులు నిబద్ధతతో కూడిన పనితీరును చూపుతున్నారని సీఎం కొనియాడారు. ఇదే విధానాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించాలన్నారు. మంగళవారం నుంచి జరిగే ఐదవ విడత జన్మభూమి-మా ఊరులో ఉద్యోగులు భాగస్వామం కావాలన్నారు. నూత న సంవత్సరం 2018 తొలి రోజు ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసం సందడిగా మారింది. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి అధికారులు, పార్టీ నేత లు, కార్యకర్తలు వెల్లువెత్తారు. వచ్చిన వారందరినీ ముఖ్యమంత్రి ఓపిగ్గా పలకరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, డీజీపీ మాలకొండయ్య, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్, కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్మన్ గద్దె అనురాధ, ఎమ్మెల్యే బొండా ఉమా, ఎమ్మెల్సీ టీడీ జనార్దనరావు, పెద్ద సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సీఎంను కలిశారు. విజయవాడలోని మానసిక దివ్యాంగుల కేంద్రం నుంచి వచ్చిన దివ్యాంగులతో కలసి కేక్ కట్ చేశారు. టీటీ డీ వేద పండితులు సీఎం దంపతులను ఆశీర్వదించారు.

గవర్నర్, షాలకు బాబు శుభాకాంక్షలు

రాష్ట్ర గవర్నర్ నరసింహన్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాలకు చంద్రబాబు ఫోన్ ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వారు కూడా ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

2017 అద్భుతంగా గడిచింది

- నీరు-ప్రగతి, వ్యవసాయంపై టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): '2017 అద్భుతంగా సాగింది.. 2018 మరింత అద్భుతంగా ఉంటుందనడంలో సందేహం లేదు.. రోజురోజుకూ రాష్ట్ర భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుంది. ఈ స్ఫూర్తిదాయక కాలంలో రాష్ట్రంలో పని చేయడం గొప్ప సంతృప్తినిస్తుంది. అందరం కలిసి అనుకున్న లక్ష్యాలు సాధిద్దామ'ని సీఎం చంద్రబాబు అన్నారు. నూతన సంవత్సరం మొదటిరోజు నీరు- ప్రగతి, వ్యవసాయం పురోగతిపై అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 'గతేడాది మీ సహకారం అమోఘం, ఈ ఏడాది అంతకు రెట్టింపు సహకారం అందిస్తారని ఆశిస్తున్నాన'ని ఆయన అన్నారు.

నేటి నుంచే జన్మభూమి

- పది రోజులు ప్రజల ముంగిటే యంత్రాంగం
- 9 అంశాలపై ఒక్కో రోజు చర్చ
- అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు
- ప్రజల ఫిర్యాదుల సత్వర పరిష్కారం
- కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి పిలుపు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం మంగళవారం ప్రారంభమవుతోంది. పదిరోజుల పాటు పాలనా యంత్రాంగమంతా ప్రజల ముంగిటకు తరలివెళ్తోంది. జనచేతనకు, సమస్యల తక్షణ పరిష్కారానికి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా సందేశాన్ని విడుదల చేశారు. జన్మభూమితో ఐదోసారి ప్రజల వద్దకు ప్రభుత్వం వస్తోందని పేర్కొన్నారు. 'ఈ పది రోజులూ పాలన మొత్తాన్ని మీ ముంగిటకు తీసుకొస్తున్నాం. ఈ అతి పెద్ద కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సభ్యుల నుంచి ప్రభుత్వాధికారుల వరకు పాలనా వ్యవస్థలోని అందరూ మీఊరిలో మీకు అందుబాటులో ఉంటారు. కుటుంబంలో ప్రతి ఒక్కరూ బాగుంటేనే ఊరు సంతోషంగా ఉంటుందని నా నమ్మకం. రాష్ట్రంలో కనీసం 80 శాతం ప్రజలకు సంతృప్తి కలిగించాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తూ ఆర్థిక అసమానతలు తగ్గించే దిశగా ప్రతి కుటుంబం నెలకు కనీసం రూ.10 వేలకు తగ్గకుండా ఆదాయం సంపాదించుకునే మార్గాలు చూపించాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. కుటుంబ వికాసం, సమాజ వికాసానికి నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రజలే ముందు అనేది మా విధానం. అవినీతి రూపుమాపడానికి, సత్వరం సమస్యలు పరిష్కారం చేయడానికి 1100 కాల్ సెంటర్ ఏర్పాటుచేశాం. దేశంలో ఎక్కడా లేని విధంగా రియల్‌టైం గవర్నెన్స్‌తో పాలనలో పారదర్శకతను, వేగాన్ని పెంచాం. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఫైబర్‌గ్రిడ్ ప్రాజెక్టును ప్రారంభించాం. ఇది ప్రభుత్వాన్ని మీకు మరింత దగ్గర చేస్తుంది. ప్రతి ఇంటినీ విజ్ఞాన ఖనిగా మారుస్తుంది. జన్మభూమి-మాఊరులో అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు అందిస్తాం. చంద్రన్న బీమా కింద రక్షణ కల్పిస్తాం' అని తెలిపారు. రైతన్న రుణం తీర్చుకునేందుకు మూడో విడత రుణ ఉపశమనం కూడా చేస్తున్నామని, డ్వాక్రా సంఘం సభ్యులకు వడ్డీయే కాకుండా, పెట్టుబడి నిధిని కూడా అందిస్తున్నామని సీఎం వివరించారు. జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదుల్ని పరిష్కరించడం, అధికారుల్లో జవాబుదారీతనం పెంచడం ప్రభుత్వం ముందున్న కర్తవ్యమని తెలిపారు. సంక్షేమం-సంతృప్తి, ఆరోగ్యం-ఆనందం, స్వచ్ఛాంధ్ర, విద్య-వికాసం, మౌలిక సదుపాయాలు, సహజ వనరులు-అభివృద్ధి, వ్యవసాయం-అనుబంధ రంగాల అభివృద్ధి, సుపరిపాలన-టెక్నాలజీ వినియోగం, విజన్ స్వర్ణాంధ్ర ప్రదేశ్-పేదరికంపై గెలుపు.. ఇలా 9 అంశాలపై ఒక్కో రోజు ఒక్కోదానిపై చర్చించి ప్రణాళికలు రూపొందించుకుందామని తెలిపారు. జన్మభూమి చివరి రోజు.. ప్రతిభ చాటిన వారికి, విజేతలకు పురస్కారాలిద్దామని అన్నారు.

రోజుకో జిల్లాలో సీఎం పర్యటన..

జన్మభూమి సందర్భంగా ముఖ్యమంత్రి రోజుకో జిల్లాలో పర్యటించనున్నారు. గ్రామసభల్లో పాల్గొని, గ్రామస్తులతో ముఖాముఖీ మాట్లాడి సమస్యలను తెలుసుకుంటారు. తొలి రోజు మంగళవారం ప్రకాశం జిల్లా దర్శిలో జరిగే సభలో పాల్గొంటారు. 3న కడప జిల్లా పులివెందులలో పర్యటిస్తారు. 4న శ్రీకాకుళం వెళ్తారు. తదుపరి షెడ్యూల్ ఖరారు కావాలి.

విద్యార్థులు, కళాకారులకూ

భాగస్వామ్యం

స్థానిక కళాకారులకే ప్రాధాన్యం.. ఉత్తర్వులు జారీ

'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమాలను ఈ ఏడాది వినూత్న రీతిలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో స్థానిక ప్రజలతో పాటు విద్యార్థులు, కళాకారులకు కూడా భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో వివిధ కళలను ప్రదర్శించనున్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలు ఖరారు చేస్తూ సోమవారం పర్యాటకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 175 నియోజకవర్గాల్లో సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, కథలు వంటి వివిధ కళలను ప్రదర్శిస్తారు. వీటిలో విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలను కలెక్టర్ల సూచనల మేరకు విద్యాశాఖ నిర్వహిస్తుంది. గ్రామాల్లో 2 నుంచి 9 వరకూ, మండల స్థాయిలో 10వ తేదీ వరకూ నిర్వహించి, 11వ తేదీన కలెక్టర్ సంతకం చేసిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందిస్తారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు ఉగాది రోజు సర్టిఫికెట్లు, జ్ఞాపిక ఇస్తారు. రాష్ట్ర స్థాయి విజేతలకు సీఎం చంద్రబాబు చేతులమీదుగా, జిల్లా స్థాయిలో విజేతలకు స్థానిక మంత్రులు జ్ఞాపికను అందిస్తారు.



ఇళ్ల మంజూరు ఫైలుపై సంతకం చేస్తున్న చంద్రబాబు

ఇళ్ల మంజూరుపై 'కొత్త' సంతకం

వివిధ సందర్భాల్లో చేసిన వాగ్దానాల మేరకు పేదలకు ఇళ్లు మంజూరుపై చంద్రబాబు కొత్త సంవత్సరం తొలి రోజు తొలి సంతకం చేశారు. జిల్లాల్లో పర్యటనలు, వివిధ సందర్భాల్లో తనను కలిసి వినతి పత్రాలు ఇచ్చిన వారికి ఈ ఇళ్లు మంజూరయ్యాయి. కృష్ణాజిల్లాలో పారిశ్రామిక పార్కులు నెలకొల్పడానికి భూమి సేకరించిన మల్లవల్లి, వీరపునాయని పల్లిలోని పేదలకు, అలాగే కొన్ని జిల్లాల్లో ప్రాజెక్టుల నిర్మాణానికి భూమి సేకరించిన సమయంలో ఇళ్లు కోల్పోయిన పేదలకు మొత్తం 4830 ఇళ్లు మంజూరయ్యాయి. గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద ఒక్కో ఇంటికి రూ.లక్షన్నర మంజూరు చేశారు.

కేకుల్లోనూ కక్కుర్తి!

- తూకంలో తేడాలతో వ్యాపారాలు
- న్యూఇయర్ పేరుతో మోసాలు
- రాష్ట్రవ్యాప్తంగా దాడులు.. 101 కేసులు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అదను దొరికితే చాలు వినియోగదారులను మోసం చేసి సొమ్ము చేసుకోవాలని చూసే కొందరు వ్యాపారులు కొత్త సంవత్సరాన్నీ వదల్లేదు. నూతన సంవత్సర వేడుకలంటే కేక్‌లకు భారీగా డిమాండ్ ఉంటుంది. ఇదే అదనుగా బేకరీ, స్వీట్ షాపుల వ్యాపారులు తూకంలో మోసంతో వినియోగదారులను దోపిడీ చేస్తున్నారు. డిసెంబరు 31 రాత్రి తూనికలు, కొలతల శాఖ రాష్ట్ర వ్యాప్తంగా స్వీట్ షాపులు, బేకరీలపై దాడులు నిర్వహించి 101 కేసులు నమోదుచేసింది. కేకులు అమ్ముతున్న వారిలో ఎక్కువ మంది మోసాలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. రెండు కిలోల కేకులు చాలాచోట్ల 1600, 1700 గ్రాములే ఉన్నాయని ఈ తనిఖీల్లో తేలింది. బాక్సుల బరువు కూడా కలిపితే రెండు కిలోలు అవుతోందని వ్యాపారులు వాదిస్తున్నారు. కానీ.. కేకు తూకం మాత్రమే చూపించినంత ఉండాలని, కవర్లు, బాక్సులతో సంబంధం ఉండదని అధికారులు తెలిపారు. మోసాలకు పాల్పడిన వారికి గరిష్ఠంగా రూ.10వేల వరకు జరిమానాలు విధించారు. ఇకపై స్వీటు షాపులు, బేకరీల్లో తనిఖీలు ముమ్మరం చేస్తామని లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ ఇ.దామోదర్ తెలిపారు. మోసాలపై వినియోగదారులు 1100కి ఫోన్‌చేయాలని సూచించారు.

అన్నిచోట్లా అధిక ధరలు..

న్యూఇయర్ సందర్భంగా కేకులతో పాటు ఇతర వ్యాపారాల్లోనూ భారీగా మోసాలు నమోదయ్యాయి. కేకులు, స్వీట్లు, కూల్‌డ్రింక్స్, ఇతర ఆహార పదార్థాల ధరలను వ్యాపారాలు భారీగా పెంచారు. కొన్నిచోట్ల రెట్టింపు ధరలకూ విక్రయించారు. రాత్రి 10 తర్వాత చాలాచోట్ల అధిక ధరల అమ్మకాలే సాగాయి. అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ తాత్కాలిక వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిపై తూనికలు, కొలతల విభాగం నియంత్రణ కూడా లేదు.

చర్చిద్దాం రండి

- ఎంఎస్ఎంఈలకు ఏపీఐఐసీ పిలుపు
- మల్లవల్లిలో భూ కేటాయింపులపై నేడు చర్చ!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భూ కేటాయింపులపై చర్చిద్దాం రావాలంటూ హైదరాబాద్ శివారు ప్రాంత సూక్ష్మ మధ్యతరహా పారిశ్రామిక సంస్థ(ఎంఎస్ఎంఈ)లను ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(ఏపీఐఐసీ) అధికారులు ఆహ్వానించారు. 'మల్లవల్లికి.. బై..బై' శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం ప్రభుత్వ వర్గాల్లో సంచలనం రేపింది. ఈ నేపథ్యంలో భూ కేటాయింపులపై సంప్రదింపులు జరిపేందుకు మంగళవారం రావాలంటూ హైదరాబాద్ శివారు ప్రాంత ఎంఎస్ఎంఈలను ఆహ్వానించారు. 450 ఎంఎస్ఎంఈలు పెట్టుబడి పెట్టే రూ.1100 కోట్ల వల్ల దాదాపు 1600 మందికి ఉపాధి లభించనున్నందున, తమకు నిబంధనల మేరకు మల్లవల్లిలో భూ కేటాయింపులు జరపాలని ఎంఎస్ఎంఈలు ఈ సమావేశంలో కోరనున్నాయి.

సామాన్యుడికే శ్రీవారి తొలి దర్శనం



- వేకువ జామున 3 గంటల సర్వదర్శనం ప్రారంభం
- 6గంటలకు వీఐపీలకు అనుమతి

తిరుమల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం మొదటి రోజున తిరుమలేశుడి తొలి దర్శనం సామాన్య భక్తులకే దక్కింది. సోమవారం వేకువజామున ధనుర్మాసం పూజల అనంతరం 3గంటలకే సర్వదర్శనం ప్రారంభించారు. కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులకు ముందుగా దర్శనం కల్పించారు. నైవేద్య విరామ సమయం అనంతరం ఉదయం 6గంటలకు వీఐపీ దర్శనం ప్రారంభించారు. కేవలం 1,043 వీఐపీ టికెట్లు కేటాయించారు. వీఐపీ బ్రేక్ దర్శనం గంటన్నర వ్యవధిలోనే పూర్తికావడంతో సామాన్యులు అధిక సంఖ్యలో శ్రీవారిని దర్శించుకోవడం సాధ్యమైంది. ఏటా జనవరి 1న వీఐపీలు స్వామిని దర్శించుకున్న తర్వాతే సర్వదర్శనం భక్తులను అనుమతిం చేవారు. ఈసారి తొలి దర్శనం సామాన్య భక్తులకే కల్పించడం విశేషం. మరోవైపు ఆదివారం రాత్రి 8గంటల వరకు భక్తుల్లేక తిరుమల కొండ బోసిపోయింది. 9గంటల నుంచి నెమ్మదిగా రద్దీ పెరుగుతూ వచ్చి, అర్ధరాత్రికి క్యూలైన్లు కిటకిటలాడాయి.

ప్రాజెక్టుల మేళా!

జన్మభూమిలో నీటి పథకాల సందడి

- రేపు గండికోట ఎత్తిపోతలకు శ్రీకారం
- ప్రాజెక్టుల సమీక్షలో చంద్రబాబు వెల్లడి

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త సంవత్సరం మొదట్లో పలు నీటి ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయి. 28 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తిచేయడంలో భాగంగా గడువులోగా నిర్మాణం జరిగిన పథకాలివి. మంగళవారం నుంచి మొదలయ్యే జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో వీటిని ప్రారంభించాలని నిర్ణయించారు. బుధవారం(3న) కడప జిల్లాలోని గండికోట-చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్) ఎత్తిపోతలను, 7న కర్నూలు జిల్లా సిద్ధాపురం ఎత్తిపోతలను ప్రారంభిస్తారు. 11న అనంతపురం జిల్లాలో ధర్మవరం, బుక్కపట్నం చెరువులకు జల హారతి ఇస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. సచివాలయంలో సోమవారం పోలవరం వర్చువల్ రివ్యూ.. ప్రాధాన్య ప్రాజెక్టుల పూర్తిపై జల వనరుల మంత్రి దేవినేని ఉమా, ఆ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శ్రీకాకుళంలోని వంశధార ప్రాజెక్టుకు సంబంధించి పునరావాస ప్రక్రియ పూర్తి చేసినందుకు అక్కడి అధికారులను సీఎం అభినందించారు. నవ్యాంధ్రను ఈ ఏడాది జల నిధి రాష్ట్రంగా చూడాలని ఉందని, తన ఆశయాన్ని.. ప్రజల ఆకాంక్షను కొత్త ఏడాదిలో నెరవేర్చే బాధ్యత జల వనరుల శాఖ ఇంజనీర్లదేనన్నారు. ఆటంకంగా మారిన న్యాయపరమైన చిక్కులను పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో వాటర్ ఆడిటింగ్ చేపట్టాలన్నారు. అత్యుత్తమ జల సంరక్షణ, జల నిర్వహణ చర్యలతో ఈ ఏడాది అత్యధిక దిగుబడి సాధించేలా చూడాలని ఆదేశించారు.

పోలవరంలో మళ్లీ మట్టి తవ్వకం పనులు

పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు 48వ సారి వర్చువల్ రివ్యూ నిర్వహించారు. డిసెంబరు 11 నుంచి డిసెంబరు 31వ తేదీకి మధ్య 21 రోజుల పాటు జరిగిన పనులను గురించి సీఎంకు మంత్రి దేవినేని ఉమ వివరించారు. రెండు నెలల విరామం తర్వాత త్రివేణి సంస్థ మట్టి తవ్వకం పనులు తిరిగి మొదలు పెట్టిందన్నారు. ఈ 21 రోజులూ 6.96 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మట్టి, రాతి తవ్వకం పనులు పూర్తయ్యాయని చెప్పారు. 33,623 క్యూబిక్ మీట ర్ల వరకూ స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్ కాంక్రీట్ పనులు జరుగగా.. డయాఫ్రం వాల్ నిర్మాణం 84.6 మీటర్ల దాకా పూర్తయిందని చెప్పారు.

స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్, స్పిల్ చానల్‌కు సంబంధించిన మొత్తం 34.04 లక్షల క్యూబిక్ మీటర్ల వరకూ కాంక్రీట్ పనులు చేపట్టాల్సి ఉందని, 4.68 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. వారానికి 3 లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున ఏప్రిల్ నాటికి తవ్వకంలో కీలక భాగం పనులు పూర్తి చేస్తామని సీఎంకు త్రివేణి ప్రతినిధులు తెలియజేశారు. పుణేలో ఏర్పాటు చేసిన పోలవరం ప్రాజెక్టు 3-డీ మోడల్‌ను ఈ నెల 12 తర్వాత ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. గడ్కరీ పర్యటనలోనే కాంక్రీట్ పనుల్లో కొంత భాగాన్ని సబ్ కాంట్రాక్టరుకు అప్పగించడంపై నిర్ణయం తీసుకోనున్నారు.

ఇకపై వేడుకగా సీమంతం!

పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టే యోచన

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పేద గర్భిణీలకు సీమంతం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో అంగన్‌వాడీల ద్వారా సీమంతం కార్యక్రమం నిర్వహిస్తున్నా.. పేలవంగా ఉండ టం వల్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని గుర్తించారు. దీంతో పేద ప్రజలకు ఆత్మసంతృప్తినిచ్చేలా సీమంతం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించేందుకు ఆయా గ్రామ పంచాయతీలు తల్లి పాత్ర పోషించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి సామూహిక సీమంత కార్యక్రమాలు ఆర్భాటంగా చేయాలని చూస్తోంది. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు అన్నీ ప్రభుత్వ శాఖల సహకారంతో చేపట్టాలని భావిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం చంద్రన్న పెళ్లికానుక ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు భారీగా నగదును పెళ్లి మండపం వద్దనే ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేసింది. కాగా.. పేద గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి ఏడాదిలో రెండు రోజుల్లో నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ఉంది.

ఆ బటన్.. నా ముందే ఉంది!

- రెచ్చగొట్టేలా మాట్లాడితే ఒక్క నొక్కు నొక్కుతా
- హడలెత్తించిన కిమ్ కొత్త సంవత్సర ప్రసంగం



సియోల్, జనవరి 1: నూతన సంవత్సరం తొలిరోజే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ శత్రుదేశాలకు వణుకు పుట్టించారు. తమ దేశం జోలికొచ్చి వినాశనాన్ని కోరి తెచ్చుకోవద్దని తీవ్రంగా హెచ్చరించారు. న్యూక్లియర్ వార్‌హెడ్స్, బాలిస్టిక్ మిస్సైల్స్‌ను భారీగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తర కొరియాతో యుద్ధానికి గతంలో ఎన్నడూ లేనంతగా అమెరికా దగ్గరవుతోందంటూ యూఎస్ మిలిటరీ మాజీ ఉన్నతాధికారి మైక్ ముల్లెన్ తాజాగా చేసిన వ్యాఖ్యలపై తన నూతన సంవత్సర ప్రసంగంలో కిమ్ ఘాటుగా స్పందించారు. తన ఎదురుగా ఉన్న టేబుల్‌పైనే ఎప్పుడూ ఒక న్యూక్లియర్ బటన్ ఉంటుందని, దాన్ని ఒక్కసారి నొక్కితే మొత్తం బుగ్గిపాలవుతుందని హెచ్చరించారు. తమ దేశాన్ని గురించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే దాన్ని ప్రయోగించాల్సి ఉంటుందన్నారు. అమెరికా మొత్తం తమ మిస్సైల్స్ పరిధిలోకి వచ్చిందని, ఇది కేవలం బ్లాక్‌మెయిల్ చేయడానికో, భయపెట్టడానికో తాను చెప్పడం లేదన్నారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో దక్షిణ కొరియాతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని కిమ్ ప్రకటించారు. ఈ వ్యాఖ్యలను దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం స్వాగతించింది.

6 నుంచి యానాంలో ప్రజా ఉత్సవాలు

- ఎస్పీ బాలు, యార్లగడ్డ, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్‌కు సత్కారం

యానాం, జనవరి 1 : కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో ఈనెల 6నుంచి 8వరకు యానాం 16వ ప్రజా ఉత్సవాలు, 19వ ఫలపుష్ప ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులను సత్కరించడం కొన్నేళ్లుగా జరుగుతోందని, ఈ ఏడాది ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, కేంద్రీయ హిందీ సమితి సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆంధ్రజ్యోతి సంపాదకులు డాక్టర్ కె.శ్రీనివాస్‌ను సత్కరించనున్నట్టు తెలిపారు.

నక్కలదిన్నెలో 11 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు

రుద్రవరం, జనవరి 1: కర్నూలు జిల్లా రుద్రవరం మండలం నక్కలదిన్నెలో దళితులను బహిష్కరించిన ఘటనలో 11 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలో మృతిచెందిన బాల తిమ్మయ్య(90) అంత్యక్రియలు నిర్వహించేందుకు గొయ్యి తవ్వకపోవడం, ఆగ్రహించిన మిగిలిన సామాజికవర్గాలు ఏకమై ఎస్సీలపై సాంఘిక బహిష్కరణ విధించిన విషయం తెలిసిందే. ఆళ్లగడ్డ డీఎస్పీ చక్రవర్తి సోమవారం గ్రామ పెద్దలతో చర్చించారు. గ్రామానికి చెందిన యోగల ఎలీషా ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదు చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు.

కొబ్బరి చెట్టు విరిగిపడి బాలుడు దుర్మరణం

కమ్మర్‌పల్లి(నిజామాబాద్), జనవరి 1: దైవదర్శనానికి ఆలయానికి వచ్చిన బాలుడు కొబ్బరి చెట్టు విరిగిపడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ సోమవారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని పోతన్నార్ రాము, రాణి దంపతుల కుమారుడు మణికంఠ (13) తల్లితో కలసి రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రదక్షిణలు చేస్తుండగా కొబ్బరి చెట్టు విరిగి మణికంఠపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

అవకతవకలపై వివరణ ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న ఎస్వీబీసీ చానల్‌లో అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలతో దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలు తెలుసుకొని కోర్టుకు తెలపాలని టీటీడీ ఈవోకు, ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. సోమవారం ఈ వ్యాజ్యంపై వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వం వివరణ తీసుకుని కోర్టుకు చెప్పాలని ఆదేశించింది.

S & D



నాగ దోషాలు పోవాలంటే..



పరంజ్యోతి

కాళీదేవి అనంత స్వరూపాలలో 'నాగకాళి' రూపం కూడా ఒకటి. నాగశక్తి స్వరూపిణిగా, నాగులు సైతం పూజించే దేవతగా 'నాగకాళి'గా ఆ మాత అనుగ్రహిస్తున్నది. కామాఖ్యలో కామాఖ్యకాళిగా అమ్మవారిని పూజిస్తారు. అక్కడ నాగమాత అయిన మానసాదేవి కూడా ఉన్నది. నాగమాత అయిన మానసాదేవి కాళిని అర్చించినట్లుగా అక్కడి కథలు చెపుతున్నాయి. ఆమెను అనుగ్రహించడానికి అమ్మవారు ప్రత్యక్షమయ్యింది. నాగకిరీటాన్ని ధరించి, అనంతమైన నాగులు పడగలు పడుతూ ఉండగా, ఆమె శరీరం మీద అనేక నాగులు ఆభరణాలుగా ప్రకాశిస్తూ ఉండగా.. నాగ మహా శక్తిస్వరూపిణిగా ఆమె దర్శనం యిచ్చిందిట. ఆ తల్లి అనుగ్రహం వలన మానసాదేవి అనేక శక్తులను పొందడంతోపాటు, నాగమాత అయ్యే అర్హతను పొందింది. పాతాళంలో ఉన్న నాగులు మొదలైన వారు పాతాళకాళిగా అమ్మవారిని పూజించి ఆమె అనుగ్రహం పొందారు. నాగదోషాలు ఉన్నటువంటి వారికి చర్మ వ్యాధులు, ఎముకల వ్యాధులు, కర్ణ వ్యాధులు మొదలైన అనారోగ్యాలు, వివాహం కాకపోవటం లేదా వివాహం అయినా భార్యాభర్తల సఖ్యత లేకపోవటం విశేషించి సంతానం లేకపోవటం మొదలైన ఇబ్బందులు ఉంటాయి అని నాగతంత్రం చెపుతున్నది. నాగ దోషాలు ఉన్నవారు నాగకాళిగా అమ్మవారిని కొలిస్తే వాటిని తొలగిస్తుంది. వంశపారంపర్యంగా వచ్చే నాగదోషమైనా, పాములను చంపడం వలన వచ్చిన నాగదోషమైనా, పూర్వ జన్మలో చేసిన నాగహాని వలన కలిగిన నాగదోషమైనా.. నాగకాళీ మాత ఆరాధనతో పోతాయి. ఎటువంటి కాలసర్ప దోషమైనా, రాహుగ్రహ కేతు గ్రహ దోషాలున్నా "నాగకాళి" అమ్మను ఆరాధిస్తే ఆమె తొలగిస్తుంది. ఎన్నోచోట్ల, విశేషించి తమిళనాట 'నాగకాళి' అమ్మ దేవాలయాలు కనిపిస్తున్నాయి. ఆమెను అర్చించి శీఘ్రంగా దోష నివారణ, సంకల్ప సిద్ధి పొందవచ్చు.

-మాతా రమ్యానంద భారతి

ఏపీపీఎస్సీపై .. తొమ్మిదేళ్ల పోరాటం

▸ 36 మంది జూనియర్ లెక్చరర్లకు కొలువు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీపీఎస్సీ 2008లో చేసిన తప్పిదం కారణంగా ఏపీకి చెందిన 36 మంది జూనియర్ లెక్చరర్(ఎకనమిక్స్) అభ్యర్థులు ఉద్యోగాలకు సెలక్ట్ కాలేదు. ఈ క్రమంలో వారు చేసిన న్యాయ పోరాటం ఫలించింది. దీంతో 36 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని విద్యాశాఖను ప్రభుత్వం ఆదేశించింది. 2008లో ఉమ్మడి ఏపీపీఎస్సీ 93 జూనియర్ లెక్చరర్(ఎకనమిక్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసి, రాత పరీక్ష నిర్వహించింది. 2012 జూన్ 8న ఫలితాలు విడుదల చేసింది. ఆగస్టు, సెప్టెంబరులో ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక ప్రక్రియను పూర్తి చేసింది. అయితే, ప్రాథమిక కీ, తుది కీని విడుదల చేయకుండానే భర్తీ ప్రక్రియను పూర్తి చేయడంతో అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో అభ్యర్థనలను పరిశీలించేందుకు ఏపీపీఎస్సీ ఓ నిపుణుల కమిటీని నియమించింది. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకున్న ఈ కమిటీ 150 ప్రశ్నల్లో 77 ప్రశ్నలు తప్పుగా వచ్చినట్టు నిర్ధారించింది. దీంతో మెరిట్ అభ్యర్థులకు నష్టం జరిగినట్టు కోర్టు గుర్తించింది. ఇలా తప్పులు దొర్లిన 77 ప్రశ్నలను పరిగణనలోకి తీసుకుని రివైజ్డ్ మెరిట్ లిస్టు మేరకు ఉద్యోగాలు ఇవ్వాలని, అర్హత లేకుండా అప్పటికే ఉద్యోగాలు పొందిన వారిని తొలగించాలని ఏపీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. దీంతో ఏపీ ప్రభుత్వం రివైజ్డ్ సెలక్షన్ లిస్టు ప్రకారం ఎంపికైన 36 మందికి 2 రోజుల క్రితం ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా పోస్టింగులు ఇచ్చింది.

రూ. 2 వేల లోపు.. డెబిట్‌కార్డు లావాదేవీలపై చార్జీలు రద్దు

న్యూఢిల్లీ, జనవరి 1: నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించే దిశగా కేంద్రం మరో అడుగు ముందుకేసింది. డెబిట్ కార్డు ద్వారా 2 వేల లోపు జరిగే లావాదేవీలకు జనవరి 1 నుంచి చార్జీలను ఎత్తివేసింది. 2వేల లోపు డెబిట్‌కార్డు, భీమ్ ఆధారిత లావాదేవీలపై చార్జీలను రద్దు చేస్తున్నామని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్‌కుమార్ ట్విట్టర్‌లో వెల్లడించారు.

▸▸ అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రా వస్త్రం

▸ మార్కెటింగ్‌కు సిద్ధమవుతున్న ఆప్కో

▸ 4 వేల డిజైన్లు ఇచ్చిన నిఫ్ట్.. ట్రెండ్‌కు తగ్గట్టు ఎంపిక

▸ మగ్గాలు సిద్ధం.. సంక్రాంతి లోపే ప్రారంభం

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అధునాతన డిజైన్లు... అత్యుత్తమ నాణ్యత... అంతర్జాతీయ ఎగుమతులు... ఇదీ కొత్త సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ చేనేత సహకార సంస్థ(ఆప్కో) లక్ష్యం. రాష్ట్ర విభజన తర్వాత వ్యాపార తగ్గుదల, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన సూచనలపై కసరత్తు చేసిన ఆప్కో... ఎట్టకేలకు కొత్త సంవత్సరంలో వాటిని కొలిక్కి తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ వస్త్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేందుకు నడుం బిగించింది. సీఎం సూచన ప్రకారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) నుంచి అత్యంత అధునాతన డిజైన్లు తీసుకొని రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో అత్యంత నాణ్యమైన వస్త్రాన్ని జనవరి నుంచి ఉత్పత్తి చేయబోతోంది. మన చేనేత కళాకారుల ప్రతిభను ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు కొత్త సంవత్సరంలో తొలి అడుగు పడుతోందని ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లోని నాలుగు ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడి చేనేత కార్మికులతో ఈ అధునాతన డిజైన్లు తయారు చేయిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అరికాంలో పేపర్ జర్దాని, కొత్తూరులో పోచంపల్లి, కోడుమూరులో గద్వాల డిజైన్లు ఇప్పుడు ఎక్కువగా ఉత్పత్తి అవుతున్నాయి.

డిజైన్లు ఎలా..?

అధునాతన ట్రెండ్ ఎలా ఉంది..? అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి డిజైన్లకు డిమాండ్ ఉంది.? మహిళలను ఇటీవల ఆకర్షిస్తోన్న ప్రత్యేక డిజైన్లు ఏవీ.? తదితర డిజైన్లను తెప్పించి చేనేత జౌళిశాఖ అధికారులు, ఆప్కో పాలకమండలి పరిశీలించింది. హైదరాబాద్‌లోని నిఫ్ట్ నుంచి మొత్తం నాలుగువేల రకాల డిజైన్లను పరిశీలించిన తర్వాత ఏ దేశంలో మన వస్త్రానికి మార్కెట్ ఉంది?.. ఎగుమతికి ఎక్కడికి అవకాశం ఉంది?.. ఆప్కో ద్వారా ఇతర దేశాల్లో షోరూములు ఎక్కడ ఏర్పాటు చేయవచ్చు?.. తదితర అంశాలపై సమీక్షించారు. వాటిలో మన రాష్ట్రంలో లభ్యమయ్యే నూలు, పట్టు దారంతో ఎలాంటి వస్త్రాలు ఉత్పత్తి చేయొచ్చు.? అందులో చేనేత కార్మికుడికి లాభదాయకంగా ఉండేవి ఏవీ.? మార్కెటింగ్ చేసేందుకు ఆప్కోకు ఉన్న మార్గాలేంటి.? తదితరాలపై చేనేత, జౌళిశాఖ అధికారులు, ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనివాస్ కసరత్తు చేశారు. అన్నింటికీ అనుకూలంగా ఉండే డిజైన్లను ఎంపిక చేసి ఆకట్టుకునే రంగులతో ఉత్పత్తికి సిద్ధం చేశారు.

విక్రయాలు ఎలా.?

చేనేత వస్త్రాలను విక్రయించేందుకు ఆప్కో జిల్లాలవారీగా ఇప్పటికే షో రూములు ఏర్పాటు చేసింది. దీంతోపాటు ఫ్లిప్ కార్ట్, అమెజాన్, స్నాప్‌డీల్, మింత్ర లాంటి సంస్థలతో ఆన్‌లైన్ వ్యాపారాలకు ఒప్పందం చేసుకోనుంది. సంక్రాంతి లాంటి పెద్ద పండగల సందర్భంగా ఉన్న రిబేటును ఏడాది పొడవునా 50శాతం వరకూ ఆన్‌లైన్‌లో ఇవ్వాలని యోచిస్తోంది. వీలైతే మరిన్ని సొంత షోరూములు, కాకుంటే ఫ్రాంచైజీలతో ఆప్కో ఒప్పందం చేసుకోబోతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో విద్యార్థులకు యూనిఫామ్ సరఫరా చేస్తున్న ఆప్కో కొత్త సంవత్సరంలో పోలీసు బెటాలియన్లు, రవాణాశాఖ, దేవాదాయశాఖ, టీటీడీ, వైద్య తదితర శాఖలతో ఒప్పందం చేసుకుని వ్యాపారాన్ని పెంచుకునేందుకు సిద్ధమైంది.



చేనేత ప్రగతే చంద్రబాబు లక్ష్యం: ఆప్కో

రాష్ట్రంలో చేనేత రంగాన్ని ప్రగతి పథంలో నడిపించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఆప్కో చైర్మన్ గుజ్జల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో సుమారు 23వేల మంది చేనేత కార్మికులకు రుణమాఫీ చేసిన ఆయన... ఆప్కోను బలోపేతం చేసేందుకు ఆరు నెలల క్రితం ఎంతో విలువైన సూచనలు చేశారని చెప్పారు. ఈ రోజు తాము అధునాతన డిజైన్లతో అంతర్జాతీయ మార్కెట్‌లోకి దూసుకెళ్లేందుకు చేస్తున్న ప్రయత్నం ఆయన సూచనే అన్నారు. మార్కెటింగ్ మెళకువలు ఇతరత్రా విలువైన సూచనలు చంద్రబాబు చేయడం వల్ల 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.338 కోట్లు ఆప్కో వ్యాపార లక్ష్యం కాగా... వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.486 కోట్లకు నిర్దేశించుకున్నట్లు చెప్పారు. చేనేత కార్మికులకు తగిన పని, సంఘాల బలోపేతం, ఆప్కో ద్వారా వస్త్ర వ్యాపారణ విస్తరణ లక్ష్యంగా కొత్త ఏడాదిలో పని చేస్తామన్నారు. సీఎం చెప్పినట్లు ప్రతి ఒక్కరూ సోమవారం నాడు చేనేత వస్త్రాలు ధరించి ఈ రంగానికి తోడ్పాటు అందించాలని గుజ్జల శ్రీనివాస్ విన్నవించారు.

లోకం తీరు




ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
గుంటూరు	15.0	32.0
శ్రీకాకుళం	15.0	28.0
కడప	19.0	33.0
చిత్తూరు	19.4	30.4
అనంతపురం	19.8	30.0
రాజమండ్రి	20.0	32.0
విజయవాడ	20.4	31.2
కర్నూలు	21.1	32.1
ప్రకాశం	22.0	33.1
విశాఖపట్నం	22.6	28.8

కోస్తాపైకి తూర్పుగాలులు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోస్తా, తమిళనాడుకు ఆనుకుని పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో కోస్తాపైకి తూర్పుగాలులు వీస్తున్నాయి. బంగాళాఖాతం దానికి ఆనుకుని కోస్తాలో పలుచోట్ల మేఘాలు ఆవరించడంతో సోమవారం దక్షిణ కోస్తాలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. ఇంకా చలి వాతావరణం నెలకొంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ తెలిపింది. రెండు రాష్ట్రాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి.


సర్జికల్ స్ట్రయిక్ ఓ డ్రామా



'భారత సైన్యం గత ఏడాది పాక్ ఉగ్రవాద స్థావరాలపై జరిపిన మెరుపుదాడి 'సర్జికల్ స్ట్రైక్' ఓ డ్రామా. పాక్‌తో ఎలా వ్యవహరించాలనే అంశంపై మోదీ సర్కారుకు నిర్దిష్ట విధానం లేదు. ఇలాంటి డ్రామాలు పాక్‌పై ఏ మాత్రం పనిచేయడం లేదు. సరిహద్దులో భద్రత ఈ సర్కారు వల్ల సాధ్యం కాదు.'

- కాంగ్రెస్ మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్

మీసం కట్టు.. తోక కుచ్చుకు ఉన్నంత తేడా..




'ప్రధాని మోదీకి, కాంగ్రెస్ నాయకులకు మీసంలోని వెంట్రుకలు, తోక కుచ్చులో ఉండే వెంట్రుకలకు ఉన్నంత తేడా ఉంది. కాంగ్రెస్ నాయకులు ఎంత ప్రయత్నించినా, మోదీ లాంటి నాయకులు కాలేరు. ఆ పార్టీ పతనం 2014 నుంచే ప్రారంభమైంది. అదే సమయంలో ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారు'

- కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్

శ్రీవారి సేవల కోటా విడుదల

తిరుమల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవల లక్కీడిప్ కోటాను టీటీడీ సోమవారం విడుదల చేసింది. ఈ సేవల కోసం భక్తులు రోజూ లక్కీడిప్‌లో తమ పేర్లు, ఫొటో, సెల్‌ఫోన్ నెంబర్ల వివరాలను నమోదు చేసుకునే విషయం తెలిసిందే. సాయంత్రం ఐదు గంటలకు కంప్యూటర్ ద్వారా డిప్ తీసి.. వారిని సేవలకు అనుమతిస్తారు. ఏయే సేవలు అందుబాటులో ఉన్నాయో టీటీడీ ప్రజాసంబంధాల విభాగం విడుదల చేసింది. ఈ నెల 5న అభిషేకం 10, 12న అభిషేకం 13, 17న తోమాల సేవ 16, 18న తోమాల సేవ 6, 19న అభిషేక సేవ 16, 26న అభిషేక సేవ 6, 30న తోమాల సేవ 10, 31న తోమాల సేవ 16 టికెట్లు ఉన్నాయి.

హృద్రోగాలను గుర్తించే స్మార్ట్‌బ్రష్!



లండన్, జనవరి 1: రోజూవారి పనులు చేసుకుంటూనే ఇకపై హృద్రోగాలను గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్పెయిన్‌లోని రమోన్ వై కజల్ ఆస్పత్రికి చెందిన శాస్త్రవేత్తలు ఓ స్మార్ట్‌బ్రష్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ బ్రష్ నోట్లోని లాలాజలాన్ని పరిశీలించి ప్రమాదాలను గుర్తిస్తుంది.

మధుమేహం మందుతో అల్జీమర్స్‌కు చెక్

లండన్, జనవరి 1: మధుమేహం చికిత్సకు ఉపయోగించే మందులతో అల్జీమర్స్‌పై పోరాడటంలో దోహదపడుతాయని అంటున్నారు శాస్త్రవేత్తలు. టైప్-2 మధుమేహం చికిత్సలో వాడే మందులను ఎలుకలపై ప్రయోగించినపుడు వాటిలో మతిమరుపు దూరమై.. మెరుగైన ఫలితాలు రావడం గమనించామని యూకేలోని లాన్‌క్యాస్టర్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చెబుతున్నారు.



నిండు గర్భిణిని డోలీ కట్టి తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు

డోలీ మోత.. మారని గిరిజనుల తలరాత!

విశాఖ ఏజెన్సీలోని మారుమూల గ్రామాల గిరిజనుల దయనీయ పరిస్థితులకు దర్పణం ఈ చిత్రం. ప్రభుత్వాలు ఎన్ని మారినా.. పాలకుల ప్రగల్భాలు తప్ప నేటికీ వందలాది గ్రామాలకు సరైన రహదారి సదుపాయం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి ఓ కుగ్రామమే హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ పెట్టుగోడలు. ఈ గ్రామానికి చెందిన పాంగి దేవి(22) నిండు గర్భిణి. ఆమెకు సోమవారం నొప్పులు ప్రారంభమయ్యాయి. ఊరికి రహదారి సదుపాయం లేకపోవడంతో ఆమెను ఆసుపత్రికి తరలించడానికి కుటుంబ సభ్యులు డోలీ కట్టారు. కొండ, కోనలు దాటుకుంటూ నాలుగు కిలోమీటర్ల దూరంలోని అరకులోయ-పాడేరు ప్రధాన రహదారి పక్కనున్న రంగశీలకు తీసుకొచ్చి, అక్కడి నుంచి 108లో పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

-పాడేరు(విశాఖ జిల్లా)

ఎన్ఎంసీకి వ్యతిరేకంగా వైద్యుల ఆందోళన నేడు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర కేబినెట్ ఆమోదించిన నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) బిల్లుకు వ్యతిరేకంగా జూనియర్ వైద్యులు రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చారు. ఎంసీఐ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంసీని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని దేశ వ్యాప్తంగా వైద్య సంఘాలు, జూనియర్ వైద్యులు వ్యతిరేకిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆసుపత్రుల ఎదుట మంగళవారం ఉదయం 8 నుంచి ఆందోళనలు చేపట్టనున్నారు. ఆయుష్ వైద్యులకు బ్రిడ్జి కోర్సు ద్వారా అల్లోపతి వైద్యం చేసే అర్హత కలిగించాలని, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులకు నేషనల్ లైసెన్సియేట్ ఎగ్జాం పేరిట మళ్లీ పరీక్ష పెట్టాలన్న నిర్ణయాన్ని నిరసిస్తున్నారు.



అకొన్‌కొగావో శిఖరంపై రాధిక

▸ చిత్తూరు ఏఎస్పీ మరో రికార్డు

చిత్తూరు క్రైం, జనవరి 1: చిత్తూరు ఏఎస్పీ జీఆర్ రాధిక పర్వత శిఖరాల అధిరోహణలో మరో మైలురాయిని అధిగమించారు. ఇప్పటికే ప్రపంచంలోని 4 ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించిన ఆమె తాజాగా దక్షిణ అమెరికాలో 6962 మీటర్ల ఎత్తున్న మౌంట్ అకొన్‌కొగావోను అధిరోహించి రికార్డు సృష్టించారు. భారత కాలమానం ప్రకారం డిసెంబరు 30వ తేదీ సాయంత్రం 3.55 గంటలకు ఆమె అకొన్‌కొగావో పర్వత శిఖరాన్ని అధిరోహించి, అక్కడ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ ఘనత దేశానికే గర్వకారణమని జిల్లా ఎస్పీ రాజశేఖరబాబు కొనియాడారు.

ఆన్‌లైన్ ఎంత ఉన్నా.. మెయిన్ లైన్‌లోనే పుస్తకం



పుస్తకాల గురించి ముచ్చటిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సీఎం చంద్రబాబు, నారాయణ(సీపీఐ)

▸ పుస్తకంలోనే భవిష్యత్తు చరిత్ర ఉంది

▸ ఉప రాష్ట్రపతి వెంకయ్య ఆకాంక్ష

▸ భాషా రక్షణే 2018లో ప్రధాన లక్ష్యం

▸ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన

▸ ఘనంగా విజయవాడలో మొదలైన 29వ నవ్యాంధ్ర పుస్తక మహోత్సవం

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ."పుస్తకం భవిష్యత్తుకు ఒక చరిత్ర. నిత్యజీవితంలో పుస్తకానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. భాష, భావన రెండూ కలిసి నడుస్తాయి. అందుకే ప్రతిఒక్కరూ మాతృభాషను పరిరక్షించుకోవాలి" అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. ఆన్‌లైన్ ఎంత అభివృద్ధి చెందినా, పుస్తకం మాత్రం మెయిన్ లైన్‌లోనే ఉందని చమత్కరించారు. పుస్తకాలు చదివే వారి సంఖ్య ప్రపంచంలోకెల్లా మనదేశంలోనే ఎక్కువగా ఉందని ఓ సర్వేలో తేలడం సంతోషకరమన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో నవ్యాంధ్ర 29వ పుస్తక సంబరాలను సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకయ్య ప్రసంగించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించడంలో పుస్తకాలు ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. జీవితంలో నిన్న అనే పేజీని తిరగరాయలేమని, భవిష్యత్తు అనే పేజీని పూరించి, వర్తమానంతో నింపాల్సి ఉంటుందని వెంకయ్య అభిప్రాయపడ్డారు. "శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులు ఉండేవారు. ఆ కాలంలో తెలుగు భాషకు ప్రాముఖ్యం కల్పించారు. కళలకు కాణాచిగా నిలిచిన విజయవాడ నగరానికి మళ్లీ ఆ శోభ వచ్చే అవకాశం ఉంది" అని ఆకాంక్షించారు. మాతృభాషను కాపాడుకోవడంలో సినీ పరిశ్రమకు చెందిన వారు తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

▸ 2018 భాషా రక్షణకు అంకితం: సీఎం

2018 సంవత్సరాన్ని తెలుగు భాషా పరిరక్షణ సంవత్సరంగా ప్రకటిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. నవ్యాంధ్ర పుస్తక మహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులతో సీఎం కరచాలనం చేశారు. "సాహిత్యానికి, సంస్కృతికి విజయవాడ నిలయం. రాజకీయ జర్నలిజానికి వన్నెతెచ్చిన కృష్ణాపత్రిక, విశాలాంధ్ర, ఆంధ్రపత్రిక, ప్రజాశక్తిలకు ఈ నగరమే పుట్టినిల్లు. రాజకీయాలకు స్ఫూర్తినిచ్చిన గడ్డ ఇది" అని కొనియాడారు. తెలుగు భాషను పరిరక్షించడానికి ఎన్టీఆర్ విశేష కృషి చేశారన్నారు. సాంస్కృతిక, గ్రంథాలయ శాఖను విలీనం చేసి ఒకే శాఖగా నిర్వహిస్తే బాగుంటుందన్న సూచనలు వచ్చాయని, వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు, భాష, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డీ విజయ్‌భాస్కర్, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పుస్తకాలు చదివి నారాయణ ఇలా అయ్యారు

▸ సీపీఐ నేతపై చంద్రబాబు చలోక్తి..

▸ వాళ్లవి వాళ్లే చదువుతారు: వెంకయ్య

▸ ఒకే వేదికపై ముగ్గురు నేతల అరుదైన కలయిక

పుస్తక మహోత్సవ ప్రారంభోత్సవ తొలి రోజు వేడుక.. అతి అరుదైన కలయికలకు వేదిక అయింది. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సీఎం చంద్రబాబు నాయుడు, సీపీఐ జాతీయ నేత నారాయణలు పుస్తక మహోత్సవంలో పాల్గొన్నారు. పరస్పర పలకరింపులు, చమత్కారాలతో హాయిగా తమ విద్యార్థి రోజులను చంద్రబాబు, వెంకయ్య, నారాయణ కలబోసుకొన్నారు. విశాలాంధ్ర స్టాల్ వద్దకు వచ్చిన వెంకయ్య, చంద్రబాబులను అక్కడే ఉన్న నారాయణ ఆహ్వానించారు. "విశాలాంధ్ర పుస్తకాలు చదవడం వల్లే నారాయణ ఇలా అయ్యారు" అని చంద్రబాబు అనగా, "వాళ్లు వేసిన పుస్తకాలు వారే చదువుతారు" అంటూ వెంకయ్య నవ్వులు పండించారు. వారిద్దరు తనపై వేస్తున్న చలోక్తులను నారాయణ హాయిగా ఆస్వాదించడం కనిపించింది. "విద్యార్థి ఉద్యమాల్లో మేం ముగ్గురం సమకాలికులం. తొలినుంచీ మా ముగ్గురి దృక్కోణాలు వేర్వేరు. మా మధ్య ఎంతగా రాజకీయ విభేదాలు ఉన్నా, వాటిని వ్యక్తిగత సంఘర్షణలుగా మేం చూడబోం. కుటుంబాల రీత్యా కలుసుకొంటేనే ఉంటాం" అని నారాయణ మీడియాతో అన్నారు. కాగా, కోల్‌కతా, ఢిల్లీ, ముంబై, చెన్నైలకు చెందిన ప్రముఖ పుస్తక సంస్థలు తమ ప్రచురణలు, కొత్త ఆవిష్కరణలతో తరలివచ్చాయి. 29వ బుక్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయడానికి 300 స్టాల్స్‌తో కొలువు తీరాయి. ఎన్టీఆర్ ట్రస్టు, రాష్ట్ర సాంస్కృతిక శాఖ, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నిర్వహణ బాధ్యతలను చేపట్టాయి

పీహెచ్‌డీ అడ్మిషన్లకు 'సెట్'

(మూడో పేజీ తరువాయి)

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనలు పక్కాగా అమలయ్యేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండలి చైర్మన్‌గా ఏడాదికాలం పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఈ విషయాలు చెప్పారు. విద్యార్థుల ఇబ్బందులు తొలగించేందుకు, అడ్మిషన్ల విధానంలోనూ పారదర్శకత తీసుకొచ్చేందుకు రాష్ట్రస్థాయిలో అన్ని వర్సిటీలకు కలిపి 'సెట్' నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థులు పరిశోధన చేసిన థీసిస్‌ని మూల్యాంకనం చేసే త్రిసభ్య కమిటీలో ఒక ఎగ్జామినర్ ట్రూ ఫారినర్, రెండో ఎగ్జామినర్ రాష్ట్ర పరిధిలోని వ్యక్తి, మూడో ఎగ్జామినర్ రాష్ట్రేతర వ్యక్తి అయి ఉండాలని యూజీసీ నిబంధనలు చెబుతున్నాయన్నారు. ఇకపై సెట్ ద్వారా జరిగే అడ్మిషన్లు, ఇతర ప్రక్రియలో వీటిని పక్కాగా అమలు చేస్తామన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందిన స్కాలర్లు థీసిస్ తయారు చేసుకునే సందర్భంలో అడ్డదార్లు, అక్రమాలకు పాల్పడకుండా అడ్డుకట్టవేసేందుకు వీలుగా ప్లాగరిజం టెస్ట్ నిర్వహిస్తామన్నారు. థీసిస్‌లో ఏ స్కాలర్‌కైనా 50 శాతానికి మించి పాతది ఉన్నట్లయితే దాన్ని తిరస్కరించడమే ప్లాగరిజం టెస్ట్ ఉద్దేశమని విజయరాజు వివరించారు. థీసిస్ సమర్పించిన తర్వాత స్కాలర్స్‌కు నిర్వహించే 'వైవా'ను ఇప్పటి వరకు క్లోజ్డ్ రూమ్‌లో నిర్వహించే పరిస్థితి అమలవుతోందని, ఇకపై ఓపెన్‌గా 'వైవా' నిర్వహిస్తామని వివరించారు. యూజీసీ అనుమతించిన జర్నల్స్‌లో కనీసం రెండు ఆర్టికల్స్ ప్రచురితమవ్వాలని, కనీసం రెండు నేషనల్ సెమినార్స్‌లో పాల్గొనాలని, అప్పుడే స్కాలర్స్‌కు పీహెచ్‌డీ అవార్డు చేయాలన్న నిబంధన కచ్చితంగా అమలు చేస్తామన్నారు. 2018-19 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ అడ్మిషన్లకు త్వరలోనే నోటిఫికేషన్ జారీకానుందని చెప్పారు. పరీక్ష ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలోనే జరుగుతుందని, ఏటా ఒక్కో విశ్వవిద్యాలయానికి నిర్వహణ బాధ్యత అప్పగిస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ సిలబస్‌లో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా వివిధ బ్రాంచ్‌లలో సిలబస్ రూపొందిస్తున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మరో రెండు నెలల్లో నియామకాలు జరుగుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

నేటి నుంచి బిఎస్ఎన్ఎల్ మెగా మేళా

హైదరాబాద్ : ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) ఈ నెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మెగా మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. మెగా మేళాలో భాగంగా కస్టమర్ సర్వీస్ సెంటర్, ఫ్రాంచైజీ, రిటైల్ ఔట్‌లెట్లలో ఉచితంగా 3జి స్మార్ట్ సిమ్‌లను అందిస్తున్నట్లు తెలిపింది. కొత్త సిమ్‌తో పాటు 351 ఎంబి ఉచిత డేటాను ఆఫర్ చేస్తున్నట్లు పేర్కొంది. అలాగే వినియోగదారులు ల్యాండ్ లైన్, బ్రాడ్‌బ్యాండ్, ఎఫ్‌టిటిహెచ్ కనెక్షన్లను ఈ మేళా ద్వారా తీసుకోవచ్చని బిఎస్ఎన్ఎల్ తెలిపింది.

నేడు పరేఖ్‌కు ఇన్ఫీ పగ్గాలు



న్యూఢిల్లీ: దేశంలోని రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఇన్ఫోసిస్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా(సిఇఒ) సలీల్ పరేఖ్ నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. గత ఏడాది ఆగస్టులో విశాల్ సిక్కా రాజీనామా చేయడంతో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఒఒ) యుబి ప్రవీణ్ రావుకు తాత్కాలిక సిఇఒగా బాధ్యతలు అప్పగించారు. ఇంతక్రితం క్యాప్‌జెమినీలో కీలక బాధ్యతలు నిర్వహించిన 53 ఏళ్ల పరేఖ్‌ని పూర్తి స్థాయి సిఇఒగా నియమించారు. జనవరి 2న ఆయన బాధ్యతలు చేపడతారని ఇన్ఫీ బోర్డు ప్రకటించింది. పూర్తి స్థాయి సిఇఒ కోసం సంస్థ బోర్డు దాదాపు మూడు నెలలపాటు 12 మంది పేర్లను పరిశీలించి, చివరికి పరేఖ్‌ను ఎంచుకుంది.

ఇన్ఫోసిస్ సిఇఒగా నియమితులైన వ్యవస్థాపకేతరుల్లో సలీల్ పరేఖ్ రెండో వ్యక్తి. ఐటీ రంగంపై అనిశ్చితి మబ్బులు కమ్ముకున్న నేపథ్యంలో సంస్థను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ప్రస్తుత నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నందన్ నీలేకనితో కలిసి పరేఖ్ పనిచేయనున్నారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుల్లో ప్రధాన వ్యక్తి ఆర్ నారాయణ మూర్తితో విబేధాల కారణంగా విశాల్ సిక్కాతో పాటు మాజీ చైర్మన్ ఆర్ శేషశాయి తమ పదవులకు రాజీనామా చేయడంతోపాటు బోర్డు సభ్యత్వం నుంచి వైదొలిగారు. దాంతో సంస్థ సారథ్య బాధ్యతలను చేపట్టేందుకు నీలేకని ఇన్ఫోసిస్‌లోకి మళ్లీ వచ్చిన విషయం తెలిసిందే.

ఎస్‌బిఐ గృహ రుణాలు చౌక

80 లక్షల మందికి ప్రయోజనం

ముంబై: కొత్త సంవత్సరం తొలి రోజే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తన ఖాతాదారులకు శుభవార్త చెప్పింది. బేస్ రేటు, రుణాలపై వసూలు చేసే ప్రామాణిక కనీస వడ్డీ రేట్ల(బిపిఎల్ఆర్)ను 0.3 శాతం (30 బేస్ పాయింట్లు) తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ తగ్గింపు సోమవారం నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో ఇంటి రుణాలతో సహా అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు తగ్గుతాయి. పాత వడ్డీ రేట్ల ప్రకారం బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న 80 లక్షల మంది ఖాతాదారులు లబ్ధి పొందుతారని అంచనా. ఈ సవరణతో ఇప్పటి వరకు 8.95 శాతం ఉన్న ఎస్‌బిఐ బేస్ రేటు 8.65 శాతానికి, బిపిఎల్ఆర్ 13.70 శాతం నుంచి 13.40 శాతానికి తగ్గింది. అదనపు నిధుల సమీకరణ ఖర్చుల ఆధారంగా ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు (ఎంసిఎల్ఆర్)ను మాత్రం యథాతథంగా 7.95 శాతం వద్ద ఉంచింది. గత నెలాఖర్లో జరిగిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టరు (రిటైల్ అండ్ డిజిటల్ బ్యాంకింగ్) పికె గుప్తా చెప్పారు.

మార్చి వరకు ప్రాసెసింగ్ ఫీజు లేదు

కొత్తగా హోమ్ లోన్లు తీసుకునే వారికి, ఇతర బ్యాంకుల నుంచి తమ గృహ రుణాలను ఎస్‌బిఐకి మార్చుకునే వారికి ఇస్తున్న ప్రాసిసెంగ్ ఫీజు మినహాయింపు గడువును కూడా బ్యాంకు పొడిగించింది. ఈ సంవత్సరం మార్చి వరకు ఈ మినహాయింపు వర్తిస్తుందని తెలిపింది.

300 పిఎన్‌బి శాఖలకు
మూసివేత ముప్పు

లాభాల్లోకి రాకపోతే చర్యలు తప్పవన్న బ్యాంకు ఎండి

న్యూఢిల్లీ : నష్టాల్లో ఉన్న 300 పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) శాఖలకు మూసివేత ముప్పు ముంచుకొస్తోంది. ఏడాదిలోగా ఈ శాఖలు లాభాల్లోకి రాకపోతే వాటిని మూసివేయడమో లేకపోతే మరో బ్రాంచ్‌లో విలీనం చేయడమో తప్పదని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ మెహతా హెచ్చరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకు(పిఎస్‌బి)లు తమ శాఖలను హేతుబద్ధం చేయాలని ఆర్‌బిఐ సూచించిన వారం రోజుల్లోనే ఆయన ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. 'శాఖల హేతుబద్ధీకరణ కొనసాగుతోంది. ఏడాదిలోగా లాభాల్లోకి రాకపోతే మూసివేయడం లేదా మరో బ్రాంచ్‌లో విలీనం చేయక తప్పదని నష్టాల్లో ఉన్న 300 శాఖలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం' అని మెహతా చెప్పారు. అయితే ఈ 300 బ్రాంచ్‌ల్లో ఇప్పటికే కొన్ని స్వల్ప స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నట్టు తెలిపారు. పిఎన్‌బికి దేశ వ్యాప్తంగా 7,000 శాఖలు ఉన్నాయి. పిఎస్‌బిలు నష్టాల్లో ఉన్న శాఖలను మూసివేయడం లేదా మరో శాఖల్లో విలీనం చేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవాలని ఆర్‌బిఐ ఇటీవలే కోరింది. గత నెల జరిగిన పిఎస్‌బి మంథన్ సమావేశంలోనూ దీనిపై ప్రధానంగా చర్చ జరిగింది. దీంతో పిఎస్‌బిల్లో నియామకాలు మరింత తగ్గుతాయని ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి.

దూసుకుపోతుంది..

2018లో వృద్ధి మరింత పైకి.. ముడి చమురు, ద్రవ్యోల్బణం గండికొట్టే ప్రమాదం

గత ఏడాది దేశ ఆర్థిక వ్యవస్థను పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు కుదిపేశాయి. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న వృద్ధి 2018లో మరింత పుంజుకోవచ్చని విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాకపోతే ముడి చమురు, ద్రవ్యోల్బణం అంశాలు ప్రగతి బాటలో స్పీడ్ బ్రేకర్లుగా మారవచ్చని వారు హెచ్చరిస్తున్నారు.

న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు ప్రభావాల నుంచి క్రమంగా కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థ 2018లో వృద్ధిపథంలో పయనించనుంది. కాకపోతే, సెగలు కక్కుతున్న ముడి చమురు, ఎగిసిపడుతున్న ద్రవ్యోల్బణం వృద్ధి జోరుకు కళ్లెం వేసే అవకాశం ఉంది. డిమానిటైజేషన్, జిఎస్‌టి అమలు ప్రభావాలతో 2017లో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఫలితంగా స్థూల దేశీయోత్పత్తి(జిడిపి)లో 2 శాతం మేర గండిపడి ఉంటుందని కొందరి అంచనా. 2016-17 ఆర్థిక సంవత్సరానికి జిడిపి రూ.152.51 లక్షల కోట్లుగా నమోదైంది. అంటే, పెద్ద నోట్ల రద్దుతో ఎకానమీకి రూ.3.05 లక్షల కోట్ల మేర నష్టపోయి ఉండవచ్చు.



చిగురిస్తున్న ఆశలు

వృద్ధి పునరుద్ధరణ బాట పట్టిందనడానికి ప్రాథమిక సంకేతాలందుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో 9 శాతంగా నమోదైన జిడిపి వృద్ధి ఆ తర్వాత వరుసగా 9 త్రైమాసికాలపాటు క్షీణిస్తూ వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లోనైతే వృద్ధి మూడేళ్ల కనిష్ఠమైన 5.7 శాతానికి పడిపోయింది. అయితే, ఆ తర్వాత మూడు నెలల కాలానికి (జూలై-సెప్టెంబరు) వృద్ధి రేటు 6.3 శాతానికి పుంజుకుంది. ఎగుమతి వాణిజ్య వృద్ధి కూడా ఆశాజనకంగా ఉంది. దిగుమతులు కూడా తగ్గుముఖం పడుతున్నాయి. ఇక ఈ ఏడాదిలో వృద్ధి రేటు మరింత పైకి ఎగబాకవచ్చని ఆర్థిక సేవల సంస్థలంటున్నాయి.

ముడి చమురు ధరలే కీలకం

ఈ ఏడాది ప్రధానంగా దృష్టిసారించాల్సిన అంశం ముడి చమురు ధరల గమనం. గత ఏడాది ఆగస్టులో 52 డాలర్లు పలికిన బ్యారెల్ క్రూడ్.. 28 శాతం మేర ఎగిసి ప్రస్తుతం 67 డాలర్ల స్థాయికి చేరుకుంది. ఈ ఏడాది రిటైల్ ధరల ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ నియంత్రణ లక్ష్యమైన 4 శాతానికి పైగా పెరగవచ్చని అంచనా. గతనెలలో ప్రకటించిన ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బిఐ.. మార్చి 2018 కల్లా రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను 4.2-4.6 శాతానికి పెంచింది. పెరుగుతున్న ముడి చమురు ధరలతో ఇంధన ద్రవ్యోల్బణంతోపాటు కరెంట్ ఖాతా లోటును కూడా అదుపు తప్పే ప్రమాదం ఉంది.

అందరి కళ్లు బడ్జెట్‌పైనే

ఆర్థిక వ్యవస్థను ప్రగతి పట్టాలెక్కించేందుకు ఈ ఏడాది ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఏ ఎ ం ం చర్యలు చేపడతారని అన్ని వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగాల కల్పనతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం పోసేందుకు భారీగా చర్యలు ప్రకటిస్తూనే అన్ని వర్గాలను సంతృప్తి పర్చడం జైట్లీకి కత్తి మీదే సామే. ద్రవ్యలోటు లక్ష్యాలకు కట్టుబడి ఉండటం ఆర్థిక మంత్రి ముందున్న మరో అతిపెద్ద సవాలు. ఈ ఏడాది ఆరు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతోపాటు 2019లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఈసారి మోదీ సర్కారు ప్రజాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు అధిక అవకాశాలున్నాయని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు గడ్డు కాలం ముగిసింది. వచ్చే 4-6 త్రైమాసికాల్లో జిడిపి వృద్ధి మళ్లీ సాధారణ స్థితికి చేరుకోవచ్చు. మరికొద్ది త్రైమాసికాల్లో వృద్ధి 7 శాతానికి చేరుకోవచ్చు

- స్టాండర్డ్ చార్టర్డ్

ఈ ఏడాది వృద్ధిపై పలు సంస్థల అంచనాలు ఇవి..

జనవరి-మార్చి మధ్యకాలానికి జిడిపి అనూహ్య పెరుగుదలను నమోదు చేసుకోవచ్చు. ఈ ఏడాది మొత్తానికి వృద్ధిరేటు 7.5 శాతంగా ఉండవచ్చని భావిస్తున్నాం. అయితే, 7.5 శాతానికి కంటే అధిక వృద్ధి నమోదు చేసుకునేందుకు కొన్నేళ్లు పట్టవచ్చు. ఎందుకంటే, ప్రస్తుతం బలహీనంగా ప్రైవేట్ రంగ పెట్టుబడులు పుంజుకునేందుకు చాలా సమయం పట్టనుంది.

- నొమురా

జిఎంఆర్ చత్తీస్‌గఢ్‌లో వాటాల విక్రయానికి
రుణదాతల సన్నాహాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : జిఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థ.. జిఎంఆర్ చత్తీస్‌గఢ్ ఎనర్జీ లిమిటెడ్‌లో వాటాలను విక్రయించేందుకు రుణదాతల కన్సార్షియం సన్నాహాలు చేస్తోంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా స్ట్రాటజిక్ డెట్ రీస్ట్రక్చర్ (ఎస్‌డిఆర్) ప్రక్రియకు లోబడి రుణదాతలు ఈ వాటాలను విక్రయించనున్నారు. 2016 మార్చిలో కార్యకలాపాలు ప్రారంభించిన 1370 మెగావాట్ల సామర్థ్యం గల జిఎంఆర్ చత్తీస్‌గఢ్ ఎనర్జీ ప్రాజెక్ట్ ప్రస్తుతం వ్యూహాత్మక రుణ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియలో ఉన్న సంగతి తెలిసిందే. నిర్దేశిత ఎస్‌డిఆర్ గడువు తేదీ నుంచి 18 నెలల కాలంలో రుణదాతలు వాటాలను విక్రయించటం ద్వారా కొత్త ప్రమోటర్‌ను తీసుకురావాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే యాక్సిస్ బ్యాంక్ సారథ్యంలోని కన్సార్షియం.. జిఎంఆర్ చత్తీస్‌గఢ్‌లో వాటాలను విక్రయించేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. రుణాలను చెల్లించటంలో విఫలం కావటంతో రుణదాతలు ఎస్‌డిఆర్‌ను చేపట్టాలని నిర్ణయించుకున్నారని జిఎంఆర్ ఇన్‌ఫ్రా గత ఏడాది ఫిబ్రవరిలో వెల్లడించింది. ఎస్‌డిఆర్ స్కీమ్‌లో భాగంగా బ్యాంకుల కన్సార్షియం 8,800 కోట్ల రూపాయల మొత్తం రుణం (వడ్డీ కలుపుకుని) లో 2,992 కోట్ల రూపాయల రుణాన్ని ఈక్విటీలోకి మార్చుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఈక్విటీ కన్వర్షన్‌తో కంపెనీలో రుణదాతల కన్సార్షియం వాటా 52.4 శాతానికి చేరుకోగా జిఎంఆర్ వాటా 47.6 శాతంగా ఉంది. ఒక్కోటి 685 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను చత్తీస్‌గఢ్‌లోని తిల్దా వద్ద బొగ్గు ఆధారిత విద్యుత్కేంద్రాన్ని జిఎంఆర్ నిర్వహిస్తోంది. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును ఒడిశా, జార్ఖండ్‌లోని సొంత బొగ్గు గనుల నుంచి సరఫరా చేస్తోంది.

టన్ను ఉక్కు ధర రూ.50,000



సమావేశంలో మాట్లాడుతున్న సిఎండి

నెల రోజుల్లో రూ.9,000 భారం

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉక్కు ధరలు పెరిగిపోతున్నాయి. ఒక్క డిసెంబరులోనే టన్ను ఉక్కు ధర రూ.2,000 నుంచి రూ.9,000 వరకు పెరిగింది. విశాఖ ఉక్కు కర్మాగారమే గత డిసెంబరులో మూడుసార్లు ఉత్పత్తుల ధరలను పెంచింది. ప్రస్తుతం మార్కెట్‌లో నిర్మాణ రంగానికి ఉపయోగించే టిఎంటి బార్ల ధర టన్ను రూ.48 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతోంది. జనవరిలోను రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. విశాఖ స్టీల్ ప్లాంట్ గత డిసెంబరులో రూ.2,046 కోట్ల విక్రయాలను నమోదు చేసింది. ఉక్కు ఫ్యాక్టరీ చరిత్రలో ఇప్పటి వరకు ఏ నెలలోను ఇంత భారీ స్థాయిలో అమ్మకాలు నమోదు కాలేదు. డిమాండ్ అధికంగా ఉండడంతో గత రెండు నెలల్లోనే 10 లక్షల టన్నుల ఉక్కును విక్రయించినట్టు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అధికార వర్గాలు చెప్పాయి. కర్మాగారం నుంచి ఉత్పత్తులు బయటకు రాగానే హట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. దీంతో దేశంలో 23 స్టాక్‌యార్డుల్లో ఎక్కడా నిల్వలు కూడా లేవని చెప్పాయి.

పెరిగిన ఉత్పత్తి వ్యయం

ఉక్కు ఉత్పత్తిలో ప్రధాన ముడి పదార్థాలైన ఇనుప ఖనిజం, కోకింగ్ కోల్ ధర గత నెల రోజుల్లో బాగా పెరిగాయి. జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండిసి) గత నెల టన్ను ఇనుప ఖనిజం ధర రూ.500 పెంచేసింది. ఇదే సమయంలో దిగుమతి చేసుకునే టన్ను కోకింగ్ కోల్ ధర 190 డాలర్ల నుంచి 260 డాలర్లకు చేరింది. దీంతో టన్ను ఉక్కు ఉత్పత్తి వ్యయం రూ.5,000 పెరిగింది. దీంతో ధరలు పెంచక తప్పలేదని ఎస్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు.

మరింత పెరిగే అవకాశం

ప్రస్తుతం దేశంలో రైల్వే ప్రాజెక్టులు, మౌలిక వసతుల రంగంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గృహ నిర్మాణ కార్యక్రమాలూ వేగం పుంజుకున్నాయి. మరో వైపు రాజధాని అమరావతిలో నిర్మాణ రంగం జోరు మీద ఉంది. వీటన్నింటికీ అవసరమైనంత ఉక్కు అందుబాటులో లేదు. అడ్వాన్సులు ఇచ్చి సరుకు బుక్ చేసుకోవలసి వస్తోంది. దీంతో ఉక్కు ధర ఇంకా పెరుగుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

విశాఖ ఉక్కు టర్నోవర్ రూ.11,405 కోట్లు

విశాఖ ఉక్కు కర్మాగారం డిసెంబరు నెలతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి రూ.11,405 కోట్ల టర్నోవర్ సాధించింది. సంస్థ సీనియర్ ఉద్యోగుల సమావేశంలో సిఎండి మధుసూదన్ ఈ విషయం వెల్లడించారు. విస్తరణ పనులు పూర్తవడంతో విశాఖ స్టీల్ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 73 లక్షల టన్నులకు పెరిగిందన్నారు. గత ఏడాది ఇదేకాలంతో పోలిస్తే టర్నోవర్ 30 శాతం పెరిగినట్టు చెప్పారు. లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి 15 శాతం వృద్ధి రేటుతో 35.4 లక్షల టన్నులకు చేరిందన్నారు.

జిఎస్‌టి @ 6 నెలలు

భారీగా తగ్గిన సర్కారు రాబడి



న్యూఢిల్లీ : పరోక్ష పన్నుల్లో విప్లవంగా ప్రభుత్వం చెబుతున్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) అమల్లోకి వచ్చి ఆరునెలలైంది. కొత్త పన్నుల వ్యవస్థ ఇంకా కుదురుకోలేదు. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం ఈ కొత్త వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగించేందుకు అనేకమార్పులు చేర్పులు చేపట్టింది. రిటర్న్ దాఖలుకు గడువును ప్రతినెలా పెంచుతూ వస్తోంది. జిఎస్‌టికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా జిఎస్‌టి కౌన్సిల్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల జిఎస్‌టి కౌన్సిల్ సమావేశమైన ప్రతిసారి ఎజెండా ప్రధాన వార్తల్లో ఉంటోంది. నవంబరు 10న జరిగిన 23వ సమావేశంలో జిఎస్‌టి కౌన్సిల్ దాదాపు 178 వస్తువులకు సంబంధించి జిఎస్‌టి రేట్లను తగ్గించింది. దీనివల్ల నిజానికి రాబడి గణనీయంగా తగ్గినప్పటికీ ప్రభుత్వానికి మరోమార్గం లేకుండా పోయింది. అంతర్‌రాష్ట్ర సరుకుల రవాణాపై పన్నుల ఎగవేతను నిరోధించడం కోసం మాత్రం ప్రభుత్వం ఇ-వే బిల్లును ముందుగానే ప్రవేశపెట్టింది. అంతకుముందు నగదు లావాదేవీల ద్వారా సరుకుల రవాణాలో పన్నుల ఎగవేతకు ఆస్కారం ఉండేది. ఇప్పుడు 50 వేల రూపాయల విలువ పైబడిన సరుకుల విషయంలో పన్నుల ఎగవేతదాదాపు అసాధ్యమని నిపుణులు అంటున్నారు.

పన్నుల రాబడి తగ్గుముఖం

జిఎస్‌టి ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన పన్నుల రాబడి తగ్గుముఖం పట్టింది. జిఎస్‌టి ప్రారంభమైన తొలి నెల జూలైలో పన్నుల వసూళ్ల మొత్తం 95,000 కోట్ల రూపాయలుండగా ఆగస్టులో 91,000 కోట్ల రూపాయలుంది. సెప్టెంబర్‌లో 92,150 కోట్ల రూపాయలు, అక్టోబర్‌లో 83,000 కోట్ల రూపాయలు, నవంబర్‌కు సంబంధించి డిసెంబర్ 25 వరకు వసూలైన పన్నుల మొత్తం 80,808 కోట్ల రూపాయలు మాత్రమే. పన్ను రిటర్న్ దాఖలు తేదీని జనవరి 10 వరకు పొడిగించారు.

రేట్లు ఇంకా తగ్గకపోవచ్చు..

పన్నుల వసూళ్లు దారుణంగా పడిపోవడంతో జిఎస్‌టి రేట్లను ఇకముందు ప్రభుత్వం తగ్గించే అవకాశం లేదు. పన్నుల వసూళ్లు పెరిగితే రేట్లు తగ్గించవచ్చు గానీ వసూళ్లు నీరసంగా ఉన్న సమయంలో రేట్లను కూడా తగ్గిస్తే రెండు విధాలా నష్టమని ప్రభుత్వం భావిస్తోంది.

యాంటీ ప్రాఫిటీరింగ్ అథార్టీ

జిఎస్‌టి కింద రేట్లలో మోళీకి అస్కారం లేకుండా ప్రభుత్వం యాంటి ప్రాఫిటీరింగ్ అథార్టీని ఏర్పాటు చేసింది. వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా జిఎస్‌టి లాభాన్ని వినియోగదారులకు చేరవేయకుండా అధికరేట్లకు సరుకులు, సర్వీసులను విక్రయిస్తే ఈ అథార్టీ చర్యలు తీసుకుంటుంది. వినియోగదారులకు వడ్డీతో సహా నష్టాన్ని వెనక్కి ఇప్పిస్తుంది. ఈ సంస్థ ఇంకా క్రియాశీల పాత్ర పోషించాల్సి ఉంది. జిఎస్‌టికి ఏడాది నిండేలోపు పెట్రోలియం ఉత్పత్తులను కూడా ఈ కొత్త పన్నుల పరిధిలోకి తెస్తారా వేచిచూడాల్సి ఉంది.

మారుతి, హోండా
అమ్మకాల్లో రెండంకెల వృద్ధి

న్యూఢిల్లీ : గడచిన డిసెంబరు నెల ఆటో మొబైల్ కంపెనీలకు ఆశించిన ఫలితాలనే ఇచ్చింది. మారుతి సుజుకీ, హోండా కార్స్ వంటి కంపెనీల దేశీయ అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. హ్యుండయ్ మోటార్ మొత్తం అమ్మకాలు రెండంకెల వృద్ధిని నమోదు చేసినా దేశీయ అమ్మకాలు మాత్రం సాధారణ స్థాయిలోనే పెరిగాయి. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) దేశీయ ప్యాసెంజర్ వాహనాల విక్రయాలు 7 శాతం మేర తగ్గాయి. డిసెంబరులో మారుతి సుజుకీ దేశీయ అమ్మకాలు 12.1 శాతం మేర పెరిగి 1,06,414 (2016 డిసెంబరు) నుంచి 1,19,286కు చేరాయి. స్విఫ్ట్, డిజైర్, బాలెనో వంటి మోడళ్ల ద్వారా మారుతి అమ్మకాలు పెరిగే అవకాశం ఏర్పడింది. డిసెంబరులో హోండా కార్స్ దేశీయ అమ్మకాల్లో 26 శాతం వృద్ధి నమోదైంది. ఈ నెలలో కంపెనీ 12,642 కార్లను విక్రయించింది. 2017 క్యాలెండర్ సంవత్సరంలో ఈ కంపెనీ కార్ల అమ్మకాలు 15 శాతం పెరిగి 1,56,107 నుంచి 1,78,755కు చేరుకున్నాయి. గత ఏడాదిలో హోండా సిటీ అమ్మకాలు 62,573గా ఉన్నాయి. తమ కంపెనీకి చెందిన అన్ని మోడళ్లకు డిమాండ్ ఉందని, ముఖ్యంగా హోండా సిటీ, డబ్ల్యుఆర్-వి ఎక్కువ మంది కస్టమర్లను ఆకట్టుకున్నట్టు హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్, సిఇఒ యొచిరో యునో తెలిపారు.

విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గు

సింగరేణి సిఎండి శ్రీధర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అన్ని రంగాలకు 24 గంటల కరెంట్ సరఫరా చేస్తుండటంతో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గును అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సింగరేణి కాలరీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ వెల్లడించారు. సోమవారంనాడిక్కడ ఆయన డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను సింగరేణి సాధించిన ప్రగతిని సమీక్షించారు. 2016 డిసెంబరు నాటికి సింగరేణి 427 లక్షల బొగ్గు రవాణా చేయగా ఈ ఏడాది డిసెంబరు నాటికి 9 శాతం వృద్ధితో 467 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసింది. ఇక ఒబి తరలింపులో కూడా 2016 డిసెంబరు నాటికి 221.7 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (ఒబి) తొలగించగా... ఈ ఏడాది డిసెంబరు నెలాఖరుకు 28 శాతం వృద్ధితో 282.9 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీని తీసేశారు. గతేడాది మార్చి నుంచి డిసెంబరు దాకా 461 లక్షల టన్నుల బొగ్గు లక్ష్యం కాగా... 467 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశారు. ఒబిలో కూడా 257.60 మిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా... 282.98 మిలియన్ క్యూబిక్ మీటర్లు తొలగించారు. ఇదే వేగంతో మిగిలిన 90 రోజులకు రోజుకు 2.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయాలని శ్రీధర్ పిలుపునిచ్చారు.

చైనాకు 'గాడిద' కష్టాలు!

స్థానికంగా గాడిద తోలుకు విపరీతంగా పెరిగిన డిమాండ్

దిగుమతి సుంకం భారీగా తగ్గింపు

బీజింగ్: వస్తువేదైనా తనకే కాకుండా ప్రపంచదేశాల అవసరాలు తీర్చగలిగే స్థాయిలో ఉత్పత్తి చేసే చైనాకే ఈ మధ్య ఓ విషయంలో తీవ్ర కొరత ఏర్పడింది. అది మరేదో కాదు.. గాడిద తోలు. వాళ్ల దేశంలో లభ్యత భారీగా తగ్గడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునేందుకు చైనా సిద్ధమైంది. ప్రపంచ దేశాల్లోని గాడిద తోలు విక్రయదారులను ఆకర్షించేందుకు వీలుగా వాటిపై దిగుమతి సుంకాన్ని 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించింది. ఈ పరిణామంతో రవాణా, వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే గాడిదలను వధించి లేదా దొంగిలించి చైనాకు ఎగుమతి చేయడం ఊపందుకోవచ్చని ఇతర దేశాల ప్రభుత్వాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం చైనాలో గాడిద తోలు 3వేల యువాన్‌లు (460 డాలర్లు) పలుకుతోందంట. అంటే, మన కరెన్సీలో దాదాపు రూ.30 వేలు.

ఎందుకంత డిమాండ్ ?

గాడిద తోలు నుంచి వెలికి తీసే జెలిటిన్(చర్మ కండరాల నుంచి కాచి తీసిన, రుచిలేని జిగురు పదార్థం)కు చైనాలో డిమాండ్ చాలా ఎక్కువ. ఏటా చైనాలో గాడిద తోలు, మాంసం వ్యాపారం కొన్ని వందల కోట్ల డాలర్ల స్థాయిలో ఉంటుంది. ఎజియావోగా పిలిచే ఈ జెలిటిన్‌ను చర్మ సౌందర్యాన్ని పెంచే సంప్రదాయ చైనా ఔషధాల్లో వాడతారు. అలాగే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో గాడిద మాంసాన్ని చాలా ఇష్టంగా తింటారు. 1996లో చైనాలో దాదాపు కోటి గాడిదలుండగా.. 2015 కల్లా 50 లక్షల స్థాయికి పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా గాడిదల సంఖ్య 4.4 కోట్లు కాగా.. అందులో అధిక శాతం ఆసియా, ఉత్తర ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఇంకా కొన్ని యూరప్ దేశాల్లో ఉన్నాయి.



చిరు వ్యాపారులకు
ఉచిత డిజిటల్ మార్కెటింగ్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన బిజినెస్ టు బిజినెస్ పోర్టల్ T సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాలకు ఉచితంగా డిజిటల్ మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రిటైల్, టెక్స్‌టైల్, బ్యూటీ అండ్ ఫ్యాషన్, టూరిజం, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్, మానవ వనరుల నిర్వహణ, ప్రాథమిక విద్య, ట్యూషన్ మేనేజ్‌మెంట్, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, చిన్నతరహా పరిశ్రమల కోసం ఉచితంగా డిజిటల్ మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు T సిఇఒ వెంకట్ బుద్దెమోని తెలిపారు. ఈ సేవల కోసం జనవరి 10వ తేదీలోగా తమ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, ఇందుకోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. స్వయం సహాయక గ్రూపులు, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ వ్యాపారస్తులు కూడా ఉచిత డిజిటల్ మార్కెటింగ్ సేవలను పొందవచ్చని తెలిపారు.

ఇన్‌ఫ్రా పరుగు

» నవంబరులో 6.8 శాతం వృద్ధి

రంగాల వృద్ధి సంవత్సర ప్రాతిపదికన

పెరిగిన పారిశ్రామిక కార్మికుల రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : ఆర్థిక రంగానికి కీలకమైన ఎనిమిది మౌలిక వసతుల రంగాలు నవంబరులో 6.8 శాతం వృద్ధిని నమోదు చేశాయి. వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం రిఫైనరీ, ఉక్కు, సిమెంట్ రంగాలు ఈ వృద్ధికి దోహదపడినాయి. ఇది 13 నెలల గరిష్ఠ వృద్ధి. బొగ్గు, క్రూడాయిల్, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ ఈ ఎనిమిది కీలక రంగాల్లో ఉన్నాయి. గత నవంబరులో ఈ రంగాల వృద్ధి 3.2 శాతమే. 2017 నవంబరులో రిఫైనరీ ఉత్పత్తుల రంగం 8.2 శాతం, ఉక్కు రంగం 16.6 శాతం, సిమెంట్ రంగం 17.3 శాతం వృద్ధిని నమోదు చేశాయి. క్రూడాయిల్, సహజ వాయువుల ఉత్పత్తి కూడా పెరిగింది. బొగ్గు రంగం లో మాత్రం ప్రతికూల వృద్ధి నమోదైంది. ఈ ఎనిమి రంగాలు ఆరోగ్యవంతమైన వృద్ధిని నమోదు చేయడం పారి శ్రామికోత్పత్తి సూచీ కూడా సానుకూల జోన్‌లో ఉండేందుకు దోహదపడుతుంది. దేశంలోని ప్యాక్టరీ ఉత్పత్తిలో ఈ రంగాల వాటా 41 శాతం ఉంది. ఇదిలా ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో ఈ ఎనిమిది కీలక రంగాల వృద్ధి 3.9 శాతానికి దిగ జారింది.

నవంబరులో పారిశ్రామిక కార్మికుల రిటైల్ ద్రవ్యోల్బణం 3.97 శాతానికి పెరిగింది. ఆహార వస్తువులు, కిరోసిన్, వంట గ్యాస్ ధరలు పెరగడం ఇందుకు దోహదపడింది. 2016 నవంబ రులో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 3.24 శాతం ఉంది.

5.3 శాతం నుంచి

ఎగుమతులపై 8న సమీక్ష

దేశంలో ఎగుమతుల రంగాన్ని ఉత్తేజితం చేసేందుకు తీసు కోవలసిన చర్యలపై చర్చించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ప్రతినిధులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు ఈ నెల ఎనిమిదో తేదీన సమావేశంకానున్నారు. వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు సారథ్యంలోని వాణిజ్య అభివృద్ధి, ప్రోత్సాహక మండలి మూడో సమావేశం ఇది. ఎగుమతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ మండలిని ఏర్పాటు చేశారు. చివరిసారిగా ఈ మండలి గత జనవరిలో సమావేశమైంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రులు, కేంద్రంలోని 14 కీలక శాఖల కార్యదర్శులు ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు. గత అక్టోబరు నెలలో ఎగు మతులు అంతకు ముందు నెలలకన్నా క్షీణించిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. గత నవంబ రులో ఎగుమతులు 30.55 శాతం పెరిగి 2619 కోట్ల డాలర్లకు చేరగా ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో 12.01 శాతం పెరిగి 19,648 కోట్ల డాలర్లకు చేరాయి.

గాయత్రి ప్రాజెక్ట్స్‌కు రూ.583 కోట్ల ఆర్డరు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి [redacted]స్): జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్ హెచ్ఏఐ) నుంచి 583 కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టును పొందినట్టు హైదరా బాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్ వెల్లడిం చింది. ఆర్డర్‌లో భాగంగా ఒడిశాలోని కటక్-అంగుల్ సెక్షన్‌లోని జాతీయ రహదారి-42ను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. జాతీయ రహదారుల అభి వృద్ధి ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌డీపీ) ఫేజ్-3 కింద ఒడిశాలో ఎన్‌హె చ్ఏఐ ఈ ప్రాజెక్టును అప్‌గ్రేడ్ చేస్తోందని పేర్కొంది. కా[redacted] భారతమాల ప్రాజెక్టులో భాగంగా ఎన్‌హెచ్ఏఐ నుంచి వ[redacted] జాయింట్ స్టాక్ కంపెనీ కిమ్‌మ్‌జోజెడ్ భాగస్వామ్యంతో గత ఏడాది డిసెంబరు 20న 1,139 కోట్ల రూపాయల కాంట్రాక్టును కొత్త కాంట్రాక్టు అదనమని గాయత్రి ప్రాజెక్ట్స్ చేజి క్కించుకుంది.

52 వారాల గరిష్ఠ స్థాయికి షేరు

ఎన్‌హెచ్ఏఐ నుంచి కాంట్రాక్టును గెలుచుకో వటంతో సోమవారం [redacted]క్ మార్కెట్లో గాయత్రి ప్రాజెక్ట్స్ షేరు దూసుకుపోయింది. [redacted]ఎస్ఈలో కంపెనీ షేరు ప్రారంభంలోనే 4 శాతం వృద్ధి చెంది యాభై రెండు వారాల గరిష్ఠ స్థాయి 234.50 రూపాయలను తాకింది. ఇంట్రాడేలో అదే జోరును కనబరిచినప్పటికీ ట్రేడింగ్ చివరలో మాత్రం స్వల్ప లాభం (0.20 శాతం)తో 226.85 రూపాయల వద్ద క్లోజైంది. కాగా ఎన్ఎస్ఈలో కంపెనీ షేరు 0.15 శాతం లాభపడి 226.50 రూపాయల వద్ద ముగిసింది.

అర్బిమెడ్ నుంచి వివిమెడ్‌కు మరిన్ని నిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి [redacted]స్) : హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ అర్బిమెడ్ ఏషియా నుంచి మరో 75 లక్షల డాలర్లు (47 కోట్ల రూపాయలు) సమీకరించినట్టు వివిమెడ్ లాబ్స్ వెల్లడించింది. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియెంట్స్ వ్యాపారంలోని విదేశీ అనుబంధ సంస్థ వివిమెడ్ లాబ్స్ (మస్కుటెక్) కోసం ఈ మొత్తాలను సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. గత ఏడాది సెప్టెంబరులో అర్బిమెడ్ ఆసియా నుంచి వివిమెడ్ 4.25 కోట్ల డాలర్లు సమీకరించిన సంగతి తెలిసిందే. హెల్త్‌కేర్ పరిశ్రమలో వివిమెడ్ వ్యాపార విధానం పట్ల ఇన్వెస్టర్లకున్న విశ్వాసాన్ని తాజా పెట్టుబడులు తెలియజేస్తున్నాయని వివిమెడ్ లాబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ వ[redacted] వర్ అన్నారు. కాగా సోమవారం [redacted]ఎస్ఈలో కంపెనీ షేరు 1.88 శాతం లాభంతో 105.90 రూపాయల వద్ద స్థిరపడింది.

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	30,400	---	30,370	---	29,480
ఆభరణ మేలిమి	30,420	30,280	30,260	30,400	29,610
22 క్యారెట్లు	28,150	---	27,940	---	28,070
ఆభరణ మేలిమి	28,170	28,100	27,830	28,200	28,200
వెండి (కిలో)	39,900	---	39,800	---	42,600
ఆభరణ మేలిమి	39,900	40,000	39,500	40,100	42,000

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.20 | నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	361.00	చిత్తూరు	378.00
వరంగల్	363.00	చెన్నై	385.00
విజయవాడ	372.00	నమక్కల్	375.00
గోదావరి	372.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	380.00	ముంబై	405.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. | వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	96.00	విజయవాడ	91.00
కరీంనగర్	97.00	గుంటూరు	91.00
వరంగల్	96.00	ఒంగోలు	93.00
మహబూబ్‌నగర్	96.00	చిత్తూరు	79.00
కర్నూలు	96.00	నెల్లూరు	89.00
విశాఖపట్నం	87.00	అనంతపురం	88.00
గోదావరి	89.00		

ఫారెక్స్ (ధామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.10	67.37
పౌండ్	78.39	90.92
యూరో	69.73	80.89
ఆస్ట్రేలియా డాలర్	45.30	52.44
బహ్రెయిన్ దినార్	157.35	180.31
కువైట్ దినార్	174.71	217.49
ఒమని రియాల్	154.08	176.28
సౌదీ రియాల్	15.42	18.31
సింగపూర్ డాలర్	43.43	51.45
యుఎఇ దిరమ్	15.81	18.48

తొలి రోజే ఝలక్

244 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై : చివరి గంటలో లాభాల స్వీకరణ స్టాక్ ఇండెక్స్‌లను చారిత్రక గరిష్ఠ స్థాయిల నుంచి దిగజార్చింది. ఈక్విటీ మార్కెట్ నష్టాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. సెన్సెక్స్ 244 పాయింట్లు నష్టపోయింది. డిసెంబరు 5 తర్వాత ఒక రోజులో సెన్సెక్స్ ఇంత భారీగా నష్టపోవడం ఇదే ప్రథమం. గత శుక్రవారంనాడు సెన్సెక్స్ చారిత్రక గరిష్ఠ స్థాయిలో 34056.83 పాయింట్ల వద్ద ముగిసి ఏడాదికి లాభాలతో వీడ్కోలు పలికిన విషయం విదితమే. అమెరికన్ క్రూడాయిల్ ధర 2015 తర్వాత తొలిసారిగా బ్యారెల్ 60 డాలర్ల కన్నా పైన ముగియడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేసింది. దానికి తోడు విత్తలోటు పెరుగుతున్న భయాలు కూడా ఇన్వెస్టర్లను లాభాల స్వీకరణకు పురిగొల్పాయి. మార్కెట్ కొత్త సంవత్సరం మొదటి సెషన్‌లో ప్రారంభం నుంచి బలహీనంగానే ఉంది. ఇండెక్స్‌లు రెండూ కీలక స్థాయిలు 34000, 10500 స్థాయిల కన్నా దిగజారాయి. సెన్సెక్స్ 244.08 పాయింట్ల నష్టంతో 33812.75 వద్ద ముగియగా నిఫ్టీ 95.15 పాయింట్ల నష్టంతో 10435.55 వద్ద క్లోజైంది. యంత్రపరికరాలు, రియల్టీ, హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగాల్లో అడపాదడపా కొనుగోళ్లు కనిపించడంతో నష్టాలు కొంతమేరకు పరిమితం అయ్యాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి కూడా ఎలాంటి సంకేతాలు లేకపోవడం కూడా ఇన్వెస్టర్లను పొజిషన్లు తగ్గించు కునేలా పురిగొల్పినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

ఆగిన ఆర్‌కామ్ పరుగు

రిలయన్స్ కమ్యూనికేషన్ (ఆర్‌కామ్) మినహా అడాగ్ గ్రూప్‌లోని ఇతర కంపెనీల షేర్లు సోమవారం కూడా మంచి వృద్ధిని నమోదు చేశాయి. గత కొన్ని రోజులుగా సాగిన ఆర్‌కామ్ షేర్ ర్యాలీకి మాత్రం బ్రేక్ పడింది. ఈ షేరు 2.26 శాతం నష్టపోయి 35.40 రూపాయల వద్ద ముగియగా రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ 32.28 శాతం, రిలయన్స్ పవర్ 20.70 శాతం, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ 9.11 శాతం, రిలయన్స్ క్యాపిటల్ 3.48 శాతం లాభపడ్డాయి.

- సెన్సెక్స్ షేర్లలో 1.69 శాతం నష్టంతో టీసీఎస్ అగ్రస్థానంలో ఉండగా ఇండస్ ఇండ్ బ్యాంక్, హెచ్‌యుఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, టాటా స్టీల్, ఒఎన్‌జీసీ, అదానీ పోర్ట్స్, ఐసిఐసి బ్యాంక్, ఆర్[redacted], ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్[redacted]కోటక్ బ్యాంక్, యస్‌బ్యాంక్ ఒక శాతానికి పైగా నష్టపోయిన షేర్లలో ఉన్నాయి.
- ఇన్వెస్టర్ల ద్వితీయ శ్రేణి స్టాక్స్‌పై దృష్టి పెట్టడంతో స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు లాభాలతో ముగిశాయి.

రూ. 2,500 కోట్ల ఐపిఒకు బంధన్ బ్యాంక్ దరఖాస్తు

కోల్‌కతా కేంద్రంగా పని చేస్తున్న బంధన్ బ్యాంక్ 2,500 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా ప[redacted] ఇష్యూకి దరఖాస్తు చేసింది. సె[redacted]ఈ మేరకు దరఖాస్తు అందించినట్టు బ్యాంక ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ఒక్కొటి 10 రూపాయల ముఖ విలువ గల 11,92,80,[redacted] ఈక్విటీ షేర్లు జారీ చేయనున్నట్టు తెలి పింది. [redacted], ఎన్ఎస్ఈల్లో షేర్లు లిస్టింగ్ అవుతాయి. చిన్న [redacted]స్ బ్యాంక్‌గా రూపాంతరం చెందిన ఒక సంస్థ ప[redacted]ఇష్యూకు రావడం ఇదే ప్రథమం.

ఇండస్ ఇండ్ బ్యాంక్ రూ.3190 కోట్ల సమీకరణ

వ్యాపార విస్తరణ కోసం విదేశీ సంస్థల నుంచి 50 కోట్ల డాలర్లు (రూ.3193.75 కోట్లు) సమీకరించినట్టు ఇండస్ ఇండ్ బ్యాంక్ ప్రకటించింది. మూడేళ్ల కాలపరిమితి కోసం తీసుకున్న ఈ రుణాలను సాధారణ బ్యాంకింగ్ అవసరాల కోసం విని యోగించుకున్నట్టు తెలిపింది.

జెపిఎల్ డీల్‌కు జెఎస్‌డబ్ల్యు గుడ్‌బై

జైప్రకాశ్ పవర్ వెంచర్స్‌కు చెందిన [redacted] ధర్మల్ పవర్ ప్లాంట్ కొనుగోలు డీల్‌ను వదులుకుంటున్నట్టు జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ ప్రకటించింది. డీల్ పూర్తి చేయడానికి గడువు ఆదివారంతో ముగిసినందు వల్ల ఈ డీల్‌ను రద్దు చేసుకుంటున్నట్టు తెలిపింది.

- స్టెయిన్‌లెస్ స్టీల్‌తో కిచెన్ సింక్‌లను తయారుచేసే ఆక్రిసీల్ సంస్థ యుకెకు చెందిన హోమ్‌స్టైల్ ప్రొడక్ట్స్ కంపెనీలో 3.75 శాతం వాటాలు కొనుగోలు చేసినట్టు [redacted]ఎస్ఈకి పంపిన సందేశంలో తెలిపింది.

10500 దిగువన బలహీనం

నిఫ్టీ ఫ్యూచర్ అప్‌ట్రెండ్‌లో ప్రారంభమైనా 10500 వద్ద నిరోధ కన్సాలిడేషన్ అనంతరం చివరి సెషన్‌లో ఆకస్మిక రియాక్షన్‌కు గురై కీలక స్థాయి కన్నా దిగువన క్లోజయింది. ఇది అప్రమత్త ధోరణి సంకేతం. స్వల్పకాలిక బలహీనతను కూడా సూచిస్తోంది.

టెక్ వ్యూ

- వంద తం స్థాయి 10400. భద్రత కోసం ఈ స్థాయిలో నిలదొక్కుకోవడం తప్పనిసరి. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఉంటుంది.
- బ్యాంక్ నిఫ్టీ మద్దతు స్థాయి 25400 కన్నా దిగువన బలహీనంగా క్లోజ యింది. ఇది స్వల్పకాలిక కరెక్షన్ సంకేతం.

సూచన: స్వల్పకాలిక ట్రేడర్లు/ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 10500 **మద్దతు :** 10400

- రికవరీ బాట పడితే ట్రెండ్‌లో సానుకూలత కోసం 10500 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

■ వి.సుందర్ రాజా

సాధారణ నిస్తేజం

తిథి : పుష్య బహుళ పాడ్యమి **నక్షత్రం :** ఆర్ద్ర, పునర్వసు

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి; అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10477.90 (-12.85)

ట్రెండ్ మార్పు వేళలు : 11.45

ధోరణి: గ్రహగతులను బట్టి నిఫ్టీలో నిలకడగా ప్రారంభమై 10.20 నుంచి 11.55 వరకు మెరుగ్గా ట్రేడవుతూ 12 చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే అవకాశం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2 గంటల తర్వాత తిరిగి ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి. ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువ మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

ఆస్ట్రో వ్యూ

నిరోధ స్థాయిలు : 10475, 10510

మద్దతు స్థాయిలు : 10395, 10360

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala stroloper.blogspot.in

బిఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ఎన్ఎస్ఇ-500

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

NSE

S & D

నగరంలో నయా నేరం!



పీకలు కోయడానికి కక్షలు అక్కర్లేదు.. ఇస్తావా, చస్తావా.. అనేది పాత కథ.. చంపి మాట్లాడటమే ఇప్పటి ట్రెండ్

సంబంధంలేని వ్యక్తులు, వర్తకులు, పాదచారులే లక్ష్యంగా క్రూర హత్యలు.. చిన్న బ్లేడుతో పెద్ద పెద్ద ఘోరాలు

ఉంగరమా, జేబులో డబ్బా.. ఏదైనా కసిగా చంపేసి చేజిక్కించుకోవడమే.. అభద్రత నీడలో బెజవాడ బిక్కుబిక్కు

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మూడు ప్రాంతాల్లో మాటేశారు. ఒకేసారి వీధుల్లోకి దూసుకొచ్చారు. కిక్కిరిసిన రోడ్లు, జనం మధ్యలోకి చొచ్చుకెళ్లారు. క్షణాల్లో పని ముగించుకొని మాయమైపోయారు. ఇంత పక్కా ప్లాన్, స్కెచ్, నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నారంటే, వీరు కచ్చితంగా కిరాయి హంతకులో, దోపిడీ దొంగలో, కిడ్నాపర్లో అయి ఉండాలి. కానీ, పాదచారులు లక్ష్యంగా ఓ చైన్ స్నాచర్ల ముఠా ఇంత పెద్ద సంచలన దాడులకు తెగబడింది. పటమటలో 4 నెలల క్రితం కల్లోలం రేపింది. బెరుకు బెరుకుగా..నక్కి నక్కి.. వెనకెనగ్గా.. కళ్లు కప్పి, మాయచేసి మెడలో గొలుసులు కొట్టేసే చైన్ స్నాచర్లే మనకు తెలుసు. అలాంటిది జంకూగొంకూ లేకుండా 'గొలుసు'కట్టు దాడులకు పాల్పడే స్నాచర్లను బెజవాడలో ఇప్పుడు చూస్తున్నాం! ఇస్తావా, చస్తావా..! అనేది విజయవాడలో పాత కథ అయిపోయింది. చంపి మాట్లాడటమే ఇప్పుడు నయా ట్రెండ్‌గా మారింది. విజయవాడ సిటీ రాజధానిలో భాగమైన తర్వాత పోలీసులు బిజీ అయిపోయారు. నిరంతరం వారి సేవలు బందోబస్తులకే సరిపోతున్నాయి. దీనిని అదనుగా తీసుకుని రౌడీ గ్యాంగులు, బ్లేడ్‌బ్యాచ్ బాబులు రెచ్చిపోతున్నారు. ఉంగరం కోసం ఓ బ్లేడ్ బ్యాచ్ ఇటీవల ఓ వ్యక్తి ప్రాణాలను నిలువునా తీసింది. బుడమేరు వంతెన వద్ద కాలవ గట్టుపై నూడిల్స్ అమ్ముతున్న వ్యక్తి ఉంగరంపై ముగ్గురు యువకులు కన్నేశారు. ఒకరోజు రాత్రి పక్కనే బాత్రూమ్‌కు వెళ్లిన అతడిపై బ్లేడులతో దాడి చేశారు. అక్కడే చంపేసి, జేబులో డబ్బులను, చేతికున్న ఉంగరాన్ని ఎత్తుకెళ్లారు. తెనాలిలో పోలీసులు పట్టణ బహిష్కరణ చేయడంతో బెజవాడకు చేరుకొన్న రౌడీ షీటర్ కాళిదాసు సుబ్రహ్మణ్యాన్ని ఈ నెల ఆరోతేదీన మాచవరం సెంటర్‌లో వెంటాడి చంపారు.

గుద్దేసి..అడిగితే బాదేశారు!

అజిత్‌సింగ్‌నగర్‌లో కొద్దిరోజుల క్రితం ఒక వ్యక్తి కారులో వెళ్తూ మోటారు సైకిలిస్టును ఢీకొట్టాడు. ప్రశ్నించడంతో కారు నుంచి దిగి గొడవపడ్డాడు. మరో ఇద్దరికి ఫోన్ చేసి రప్పించాడు. ముగ్గురూ మోటారు సైకిలిస్టును దారుణంగా బాదేశారు.

ఆ రోజులు పోయాయి

నేరం చేస్తాం.. పారిపోతాం.. తర్వాత ఎవరో ఒకరి ద్వారా లొంగిపోతాం.. అని నేరగాళ్లు అనుకుంటే చాలా పొరపాటు. ఆ రోజులను రౌడీలు మరిచిపోవాల్సిందే. నగరం మొత్తం నిఘాలో ఉంది. సిటీ చుట్టూ 1,000 సీసీ కెమెరాలు ఉన్నాయి. మరో 3,500 హైరిజల్యూషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నాం. నేరగాళ్లు మాస్కులు వేసుకున్నా, హెల్మెట్లు పెట్టుకున్నా తప్పించుకోలేరు.

- గౌతమ్ సవాంగ్, సీపీ, విజయవాడ



ఖతం.. నాయక్!

పాత రాజరాజేశ్వరిపేటలో గంధసిరి వెంకటేశ్వర్లు అనే చిరువ్యాపారిని అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ ఖల్ నాయక్, అతని కుమారులు కాళీ, సొమ్ములు కత్తులతో పొడిచి చంపేశారు.

టాస్క్‌ఫోర్స్.. అందుకే!

బెజవాడలోని రౌడీల కదలికలు పసిగట్టడానికి, వారి అడుగుల్లో అడుగులు వేసి, దాడులకు వేసిన ప్రణాళికలను పటాపంచలు చేయడానికి కమిషనరేట్ పరిధిలో యాంటీ గూండా స్క్వాడ్ (ఏజీఎస్) ఉండేది. దాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో టాస్క్‌ఫోర్స్ (టీఎఫ్) ఏర్పాటు చేశారు. ఈ విభాగం గుట్కా, గంజాయి దాడులకే పరిమితమవుతోంది. మహా అయితే క్రికెట్ బుకీలను అరెస్టు చేస్తోంది. ఇవి తప్పితే మిగిలిన నేరాల పరిశోధన, నియంత్రణ విషయంలో టాస్క్‌ఫోర్స్ ప్రగతి చూపడం లేదని చెబుతున్నారు. 2017 జనవరి నాటి గణాంకాలను పరిశీలిస్తే, టాస్క్‌ఫోర్స్ ఖాతాలో గంజాయి, గుట్కా, క్రికెట్ బుకీ కేసులు తప్పితే మిగిలిన కేసులేమీ కనిపించ లేదు. రౌడీషీటర్లపై నిఘాకు ఉపయోగిస్తున్న బీట్ పోలీసులు ప్రతిరోజూ రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి హాజరు తీసుకువస్తున్నారు.

పిలవరు.. రారు..

విజయవాడలో రౌడీషీటర్లు, నేరగాళ్లలో పరివర్తన తీసుకొచ్చేందుకు కౌన్సెలింగ్ చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. నగరంలో ఏదైనా హత్య జరిగినప్పుడు, బ్లేడ్ బ్యాచ్ దాడులప్పుడు మాత్రమే పోలీ స్స్టేషన్లలో ముమ్మర కౌన్సెలింగ్‌లు జరుగుతున్నాయి. మిగిలిన రోజుల్లో షరా మామూలే! కౌన్సెలింగులో భాగంగా రౌడీషీటర్లను సిటీ పోలీసులు ఏ,బీ,సీ గ్రేడ్‌లుగా విభజించారు. ఏ గ్రేడ్‌లో ఉన్నవారంతా ఇప్పుడు రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల వద్ద అనుచరులుగా ఉంటున్నారు. ఏ స్టేషన్‌లో ఎన్ని కౌన్సెలింగ్‌లు జరిగినా ఈ గ్రేడ్‌లో ఉన్నవారికి పిలుపులు వెళ్లవు.

రింగ్ రోడ్డులో రౌండేసి..

కొన్నినెలల క్రితం ఓ బ్లేడ్ బ్యాచ్ రామవరప్పాడు రింగ్ రోడ్డులో పట్టపగలే చెలరేగిపోయింది. ఓ పార్టీకి చెందిన విద్యార్థి విభాగం నాయకుడిని అందరూ చూస్తుండగానే బ్లేడులతో కోసేసింది. శరీరమంతా గాయాలతో చాలా కాలం చికిత్స పొందిన ఆ నాయకుడు ఇటీవలే డిశ్చార్జి అయ్యాడు.

ఫిర్యాదు చేశారని..

పటమటలంకలోని వీఎంసీ బాలికల పాఠశాల పక్కన మందుబాబులు, ఆకతాయిల ఆగడాలు మందు పార్టీలు చేసుకొంటున్నారని ప్రధానోపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మరునాడే ఓ గ్యాంగ్ బడికి వెళ్లి, ఆయనకు వార్నింగ్ ఇచ్చింది.

సంచార చికిత్సకు 'ఫిట్‌నెస్' కరువు

ఏ కాగితమూ ఉండదు.. అడిగితే 'బాబు' బొమ్మతో బెదిరింపు

వైద్యులుండరు..మందులుండవు.. పట్టించుకోని నిర్వహణ సంస్థ

ఆ మధ్య కృష్ణా జిల్లాలో ఒక ఆర్‌టీవో చంద్రన్న సంచార చికిత్స వాహనాన్ని ఆపారు. రికార్డులు చూపించాలని డ్రైవర్‌ని అడిగారు. కాగితాలు లేవని డ్రైవర్ చెప్పడంతో, లైసెన్స్ ఇచ్చి ఆఫీసుకు వచ్చి తీసుకో అని ఆర్‌టీవో బదులిచ్చారు. వెంటనే స్పందించిన డ్రైవర్..అవసరమైతే వాహనం తీసుకెళ్లండి, లైసెన్సు ఇవ్వనని చెప్పాడు. ఆ వాహనంపై సీఎం చంద్రబాబు బొమ్మ ఉండటంతో ఆర్‌టీవోనే వెనక్కి తగ్గారు.'నా ఉద్యోగం పోగొట్టాలని చూస్తున్నావా..చాలులే ఇక వెళ్లు' అని ఆర్‌టీవో అనడంతో డ్రైవర్ వెనక్కి తిరిగి చూడకుండా అక్కడ నుంచి వెళ్లిపోయాడు. సంచార వాహనాలను చంద్రన్న బొమ్మే కాపాడుతుంది అనడానికి ఇదొక ఉదాహరణ.



అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వాహనాలకు బీమా ఉండదు. పొల్యూషన్, ఫిట్‌నెస్ సంగతి సరేసరి. రోడ్ ట్యాక్స్ కట్టారో లేదో కూడా తెలియదు. ఇవ్వన్నీ లేనప్పుడు మెయింటినెన్స్ ఎందుకు? వాటి గురించి పట్టించుకునే పనిలేదు. ఇదీ రాష్ట్రంలో నడిచే ఆసుపత్రులుగా పేరుగాంచిన 'చంద్రన్న సంచార చికిత్స వాహనాలు' వాస్తవిక చిత్రం. ఎందుకు లేవని ఆర్‌టీవో ప్రశ్నిస్తే...వాహనంపై ఉన్న చంద్రబాబు బొమ్మే ప్రశ్నలన్నింటికి సమాధానం చెబుతుంది. ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగా చంద్రన్న సంచార చికిత్స వాహనాలకు ఇటువంటి పరిస్థితి వచ్చింది. గ్రామాల్లో ప్రజలకు చికిత్స చేయాల్సిన స్థితి నుంచి సంచార వాహనాలకే చికిత్స చేయాల్సిన దుస్థితి దాపురించింది. ప్రమాదాలు జరిగినా, వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా ఆగిపోయినా పట్టించుకునే నాథుడే లేడు. ఈ వాహనాలు నిబంధనల ప్రకారమే ఉండాలని ఉన్నతస్థాయిలో నిర్ణయించినా ఎక్కడా అమలు కావడం లేదు. పొరపాటున సంచార చికిత్స వాహనం ఎవరినైనా ఢీ కొడితే కనీసం బీమా పరిహారం కూడా రాదు. రాష్ట్రంలోని 277 సంచార చికిత్స వాహనాలన్నింటిదీ ఇదే పరిస్థితి. సుమారు రూ.2 కోట్ల వరకూ రోడ్ ట్యాక్స్, ఫిట్‌నెస్, ఆశా వర్కర్లకు రూ.7.5 కోట్లు సంచార వాహనాల నిర్వహణ సంస్థ బకాయి పడింది.


హాజరు చాలా?

70 వాహనాల్లో వైద్యులు లేరు. మరో 80 వాహనాల్లోని వైద్యులకే ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో 70 ఏళ్లు పైబడిన ఎంబీబీఎస్ వైద్యులే దిక్కయ్యారు. వీరిలో కొందరు వైద్యులు మరొకరి సాయం లేకపోతే నడవలేరు. ఇంకొంతమంది వైద్యులు రోగులతో మాట్లాడలేని స్థితి. అలాంటి వాహనాల్లో ఫార్మసిస్టు లేదా నర్సు డాక్టర్ అవతారంలో రోగులకు చికిత్సలు చేస్తున్నారు. కేవలం హాజరు కోసమే కొన్నిచోట్ల వైద్యులను నియమించుకుంటున్నారు. దీనిపై ఉద్యోగులు యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే... మాకు జీపీఎస్, ల్యాప్‌టాప్‌లో హాజరు తప్ప మరొకటి అవసరం లేదని బదులిస్తున్నట్లు సమాచారం.

అప్పుడే భేష్!

గతంలో ఈ వాహనాలను ప్రభుత్వం నిర్వహించేటప్పుడు అన్ని సర్టిఫికెట్లనూ పొందేవారు. ఏడాదిన్నర క్రితం ఈ వాహనాల నిర్వహణ బాధ్యతను గుజరాత్‌కు చెందిన ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ స్వలాభం తప్ప మరేమీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్వహణలో ఉన్నప్పుడు ఏడాదికి రూ.31.62 కోట్లు ఖర్చయ్యేవి. ప్రజలకు అద్భుతమైన వైద్యసేవలు అందడంతో పాటు వాహనాల నిర్వహణ కూడా బాగుండేది. ఇప్పుడు వాహనాల నిర్వహణ కోసం ఏటా రూ.90 కోట్లు కేటాయిస్తున్నారు. కానీ ప్రజలు ఆశించిన స్థాయిలో వైద్య సేవలు లేవు. కనీసం మందులు అందుబాటులో ఉండటం లేదు. ప్రైవేట్ సంస్థకు అప్పగించడంవల్ల ప్రభుత్వానికి డబ్బులు ఖర్చు తప్ప, ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని బహిరంగంగానే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

'అభ్యసన' సామర్థ్యమెంత?



- 4, 6, 9 తరగతుల విద్యార్థులపై సర్వే
- 5, 6, 8 తేదీల్లో నిర్వహణ

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చదువులు, విద్యా ప్రమాణాలపై సర్వే నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసి, ప్రాథమిక స్థాయిలోనే వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు సన్నద్ధమవుతోంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 4, 6, 9 తరగతుల విద్యార్థులపై ఈ సర్వే నిర్వహించనుంది. జనవరి 5న 4వ తరగతి, 6న 6వ తరగతి, 8న 9వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా 'స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే(స్లాస్)' నిర్వహిస్తారు. భాష (తెలుగు/ఆంగ్లం), గణితంలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. తెలుగు మాధ్యమం పాఠశాలల్లో తెలుగులోనూ, ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లో ఆంగ్లంలోనూ పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఇప్పటికే 3, 5, 8 తరగతుల విద్యార్థులపై ఆర్‌ఆర్‌ఆర్ పేరిట సర్వే నిర్వహించారు. చాలా మందికి రెండంకెల కూడికలు, తీసివేతలు, భాగాహారాలు కూడా రావడం లేదని, కనీస సామర్థ్యాలు లేకుండానే విద్యార్థులు పైక్లాస్‌లకు వస్తున్నట్లు విద్యాశాఖ గుర్తించింది. దీంతో ఈసారి విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలపై పరీక్షలను రెండుసార్లు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పరీక్షల్లో రాత, సమష్టి మౌఖిక విభాగాలు ఉంటాయి. 4వ తరగతి విద్యార్థులకు భాష, గణితం పేపర్లలో రాత, సమష్టి మౌఖిక విభాగాల్లో ప్రశ్నలు ఇస్తారు. 6, 9 తరగతుల ప్రశ్నపత్రాల్లో రాత విభాగం మాత్రమే ఉంటుంది. అన్ని తరగతుల్లోనూ భాషకు సంబంధించిన ప్రశ్నపత్రంలో చివరి 2 ప్రశ్నలు సృజనాత్మక రచనకు సంబంధించి ఉంటాయి. దీనికి సంబంధించి క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)లకు శిక్షణ కార్యక్రమాలను ఇప్పటికే నిర్వహించారు.

రాజధానికి రూ.వెయ్యి కోట్ల గ్రాంట్!

- ముందుకొచ్చిన జపాన్ సంస్థలు
- విజయవాడలో 1, అమరావతిలో 4 ప్రాజెక్టులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణంతోపాటు దానికి సమీపంలోనే ఉన్న విజయవాడను మరింతగా అభివృద్ధి పరిచేందుకు జపాన్‌కు చెందిన కొన్ని సుప్రసిద్ధ సంస్థలు సుమారు రూ.1,000 కోట్లను గ్రాంట్‌గా ఇవ్వనున్నాయి. త్వరలోనే ఇందుకు సంబంధించిన అధికారిక ఒప్పందం కుదురుతుందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అమరావతిని అత్యాధునిక మౌలిక వసతుల కేంద్రంగా తీర్చిదిద్దాలనుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం... అందుకోసం అత్యధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిపుష్టమైన డేటా సెంటర్, క్లౌడ్ కంప్యూటింగ్, వాతావరణ అధ్యయన వ్యవస్థలు, నీటిశుద్ధి ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటికి సంబంధించిన 4ప్రాజెక్టులతోపాటు విజయవాడలో ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం నెలకొల్పేందుకు జపాన్‌కు చెందిన ఆయా రంగాల్లోని ప్రఖ్యాత కంపెనీలు ముందుకొచ్చాయి. వీటి పూర్తికి మొత్తం రూ.1242.50 కోట్ల వ్యయం అవసరమని అంచనా వేయగా, అందులో రూ.వెయ్యి కోట్లను జపాన్ సంస్థలు గ్రాంట్‌గా ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. వీటివల్ల అమరావతి, విజయవాడకు భారీ లబ్ధి చేకూరుతుందని అధికారులు అంటున్నారు.

ఇవీ ప్రాజెక్టులు

అమరావతిలో ఈ సంస్థలు చేపట్టనున్న 4 ప్రాజెక్టుల్లో... రూ.277 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న డేటా సెంటర్ మరియు క్లౌడ్ కంప్యూటింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రూ.268కోట్ల వ్యయమయ్యే రాడార్ ఆధారిత వాతావరణ వ్యవస్థలు, రూ.236.50 కోట్లు అవసరమైన తాగునీటి శుద్ధి వ్యవస్థలు, రూ.139కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మురుగునీటి శుద్ధి వ్యవస్థలు ఉన్నాయి. ఇవి కాకుండా.. రూ.322 కోట్ల అంచనా వ్యయంతో విజయవాడలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు సంకల్పించిన అత్యాధునిక ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం కూడా ఈ జాబితాలో ఉంది.

అన్నింటా కృష్ణా ఫస్ట్

ఉపాధిలో ముందు.. సాగు విస్తీర్ణంలో రికార్డు.. ప్రత్యక్ష నగదు బదిలీలో దేశంలోనే ప్రథమం

- ముఖ్యమంత్రి సూచనలతోనే సాధ్యమైంది
- కలెక్టర్ లక్ష్మీకాంతం ఉద్ఘాటన

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో సంతృప్త స్థాయి.. వారి ఫిర్యాదుల పరిష్కారం.. పింఛన్ల పంపిణీ.. మరుగుదొడ్ల నిర్మాణం.. ఇలా ప్రతి అంశంలో కృష్ణా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, కొన్ని వినూత్న కార్యక్రమాలతో ఇతర జిల్లాల కంటే ముందంజలో ఉంది. ప్రత్యక్ష నగదు బదిలీలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉండడం విశేషం. పింఛన్ల నుంచి సబ్సిడీల వరకు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం, తద్వారా అవినీతి నియంత్రణలో అగ్రస్థానంలో నిలిచింది. పంచాయతీరాజ్ మంత్రి నారా లోకేశ్ ఉపాధి హామీ అమలుకు సంబంధించి 18 అంశాలపై రేటింగ్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో ఏడు అంశాల్లో గోల్డ్ రేటింగ్‌తో కృష్ణా జిల్లా టాప్‌లో ఉంది. ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, జాబ్‌కార్డుల పంపిణీ, గత ఏడాది వేసిన పండ్ల మొక్కల సంరక్షణ తదితర అంశాల్లో ముందుంది. ఉపాధి హామీ సిబ్బంది తీసుకున్న అడ్వాన్సులు మొత్తం తిరిగి చెల్లించేలా చేశారు. నగర ప్రాంతం ఎక్కువగా ఉన్న జిల్లా అయినా ఉపాధి హామీలో ఇన్ని అంశాల్లో ముందుంది. తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాలు నాలుగేసి గోల్డ్ పాయింట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 1100, మీసేవ, ఏపీ సీఎం కనెక్ట్, సోషల్ మీడియా.. ఇలా పలు మార్గాల ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారంలో కృష్ణా జిల్లా ముందుంది. మరోవైపు.. సీఎం చంద్రబాబు ప్రత్యేకించి చూస్తున్న ప్రజల సంతృప్తి స్థాయి ఈ జిల్లాలోనే అత్యధికంగా 68శాతంగా ఉంది. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రత్యేక అధికారులను నియమించి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చేస్తున్నారు. పల్లెబాటను సమర్థంగా అమలు చేసి.. సమస్యల పరిష్కారం పట్ల ప్రజల్లో విశ్వాసం నింపారు.

ఉపాధి...ఉద్యోగావకాశాల్లో వినూత్నం

రాష్ట్రంలోనే ఎక్కువ జాబ్‌మేళాలు నిర్వహించి.. ఎక్కువ మంది యువతకు ఉద్యోగాలు కల్పించింది కృష్ణా జిల్లానే. మెప్మా ద్వారా పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా సబ్సిడీ రుణం ఇప్పించి వందల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. బ్యాంకు రు ఇం, సబ్సిడీపై ఆ టో ల ు కొనుగోలు చేసుకునేలా చేసి.. మహిళలు ముందుకెళ్లేలా చేశారు. గ్రామాల్లో పంచాయతీరాజ్ ఆస్తుల జియోట్యాగింగ్‌లో కృష్ణా జిల్లానే తొలిస్థానం దక్కించుకుంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో నగదు రహిత లావాదేవీలతో సరుకులివ్వడంలోనూ ముందుంది.

రికార్డు స్థాయి పంట

పట్టిసీమ నీటితో వచ్చిన అవకాశాన్ని జిల్లా యంత్రాంగం ఒడిసిపట్టింది. నిరుటి కంటే 2.38లక్షల ఎకరాల్లో వరి, పత్తి పంటను అధికంగా సాగుచేసేలా ప్రణాళిక రూపొందించి అమలుచేశారు. హెక్టారుకు వంద బస్తాల వరి పండింది. గత ఖరీఫ్‌లో 2.01 లక్షల హెక్టార్లలో పంటలు పండించగా.. ఈ ఏడాది ఖరీఫ్‌లో 3.21లక్షల హెక్టార్లలో సాగైంది. హెక్టారుకు 100 బస్తాలు దిగుబడి రావడంతో.. 20 లక్షల బస్తాల వరకు అధిక ధాన్యం రైతుల చేతికి వచ్చింది. సూక్ష్మ పోషకాలను సకాలంలో రైతులందరికీ ఇవ్వడం, గ్రీన్‌మెన్యూర్ సరఫరా పెంచడం, భూమిలో తేమ శాతం నిర్వహణలో సలహాలివ్వడం, వ్యవసాయ విస్తరణ సేవలతో ఇది సాధించగలిగారు. ఫలితంగా జిల్లాకు కొన్ని వందల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరింది. జీవీఏలో కృష్ణా జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

80% సంతృప్తికి కష్టపడతాం: కలెక్టర్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో పనిచేయడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని కృష్ణా జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం పేర్కొన్నారు. సంతృప్తిలో 80శాతానికి చేరాలని ముఖ్యమంత్రి నిర్దేశించారని.. అది కూడా సాధించే దిశగా మరింత కష్టపడతామని తెలిపారు. జిల్లా యంత్రాంగం సమష్టి కృషివల్ల జిల్లా అత్యధిక రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.



నిధులకు నవ మార్గాలు

- రాజధాని నిర్మాణానికి చక్కటి ప్రణాళిక
- సత్ఫలితాలిస్తున్న సీఆర్డీయే కార్యాచరణ



అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని నిర్మిస్తారంటున్నారు గానీ అందుకు కావాల్సిన వేలాది కోట్ల రూపాయలను ఎక్కడి నుంచి తెస్తారు, ఏ విధంగా సమకూర్చుకుంటారన్న అనుమానాలు ఎందరిలోనో ఉన్నాయి. అయితే.. చక్కటి ప్రణాళికా నైపుణ్యం, వ్యూహాత్మకంగా ముందుకు కదలగల నైజం, సంప్రదాయ రుణసేకరణ విధానాలతోపాటు ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అద్దం పట్టే రుణ ప్రణాళికలను రూపొందించగల శక్తిసామర్థ్యాలు, సృజనాత్మకత ఉంటే అదంత కష్టమేమీ కాదని సీఆర్డీయే చాటుతోంది! రాజధానిని నిర్మించేందుకు తొలివిడతగా 3 ఏళ్లలో చేపట్టనున్న పనులకు రూ.29,676 కోట్ల వ్యయమవుతుందని (పూర్తిస్థాయిలో అమరావతి రూపొందేందుకు మొత్తం రూ.58,000 కోట్లు అవసరం) అంచనా వేసిన సీఆర్డీయే ఆ మొత్తాన్ని వివిధ మార్గాల్లో సమకూర్చుకునేందుకు పకడ్బందీ ప్రణాళికలను రూపొందించింది. పనులు ప్రారంభించే వరకూ నిరీక్షించకుండా, మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుండగానే దేశ, విదేశాలకు చెందిన ఆ రంగ నిపుణులు, అనుభవజ్ఞులతో ముమ్మర చర్చలు జరిపి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకుని, తదనుగుణంగా ముందుకు కదిలింది. తద్వారా తొలి మూడేళ్లలో చేపట్టే పనులకు కావలసిన నిధుల్లో సుమారు 45 శాతానికి ఇప్పటికే వివిధ ద్రవ్యసంస్థలు, రుణవితరణ సంస్థల నుంచి నిర్దిష్ట హామీలు పొందింది. తొలి మూడేళ్లలో గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు టైర్-1 ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి తదితర పనులతో కూడిన ట్రంక్-2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు మొత్తం రూ.29,676 కోట్లు కావాలని సీఆర్డీయే అంచనా వేసింది. ఇందులో గవర్నమెంట్ కాంప్లెక్స్‌కు రూ.6,705 కోట్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.7,218 కోట్లు, ట్రంక్-2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.15,753 కోట్లు అవసరమని లెక్కించింది. అమరావతికి అవసరమైన నిధులను ప్రధానంగా 9 మార్గాల్లో సమీకరించేందుకు ప్రతిపాదించింది.

నిధుల సమీకరణకు ప్రతిపాదించిన 9 మార్గాలు ఇవీ..

- రాజధానిలో అభివృద్ధి పరచిన భూమి విక్రయం
- కేంద్ర ప్రభుత్వ పథకాలు
- కన్వర్టబుల్ బాండ్ల జారీ
- ఏడీబీ, ఏఐబీ తదితర అంతర్జాతీయ బ్యాంకుల నుంచి మల్టీలేటరల్, బైలేటరల్ రుణాలు
- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం
- దేశీయంగా ఎల్‌ఐసీ వంటి రుణాలిచ్చే సంస్థల నుంచి స్వీకరణ
- ఈక్విటీ విధానంలో పెన్షన్ ఫండ్స్, ఇన్‌ఫ్రా ఫండ్స్ ద్వారా సమీకరణ
- అంతర్జాతీయంగా పేరొందిన ద్రవ్యసంస్థలు, పెట్టుబడి సంస్థల నుంచి రుణాలు
- ఎన్ఆర్ఐ, మసాలా, గ్రీన్ బాండ్స్ జారీ

S & D



పీఆర్ఎస్ఐ చాప్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతిలో పీఆర్ఎస్ఐ చాప్టర్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) అమరావతి చాప్టర్‌ను సీఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు. చాప్టర్ ఫలకం, బ్రోచర్‌తో పాటు ఫ్లెక్సీపై సంతకం చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నూతన రాజధానిలో ఏర్పాటు చేస్తున్న పీఆర్ఎస్ఐ కొత్త చాప్టర్ బాగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ చీఫ్ ఆపరేషన్స్ అధికారి, అమరావతి చాప్టర్ చైర్మన్ వీఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలో పీఆర్ఎస్ఐ చాప్టర్లు 25 ఉన్నాయని, అమరావతిలో ఏర్పాటు చేసేది 26వ చాప్టర్ అవుతుందని తెలిపారు.

హోంగార్డులకు ఉచిత బస్‌పాస్‌లు!

- రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసుశాఖ ప్రతిపాదన

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హోంగార్డులకు ప్రభుత్వం ఉచితంగా బస్‌పాస్‌లు ఇవ్వనుంది. 13 జిల్లాల్లో 20వేల మందికి పైగా ఉన్న హోంగార్డులకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వానికి పోలీసుశాఖ ప్రతిపాదనలు పంపింది. పోలీసు విధుల్లో సహాయకారులుగా ఉండే హోంగార్డులకు దినసరి వేతనం రూ.400 పోలీసుశాఖ చెల్లిస్తోంది. ఈ మొత్తాన్ని పెంచాలని హోంగార్డులు ఉపముఖ్యమంత్రి చినరాజప్ప, రాష్ట్ర డీజీపీలకు విన్నవించారు. జిల్లాలో వివిధ స్థాయిల్లో తిరిగేందుకు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలంటే ఏటా ఎంత ఖర్చవుతుందో తెలియజేయాలని పోలీసుశాఖ ఆర్టీసీ యాజమాన్యానికి లేఖ రాసింది. ఆర్టీసీ అధికారులు అంచనాలు పంపారు. ఈ పరిస్థితుల్లో అనూహ్యంగా ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య పోలీస్ బాస్ కావడంతో ఉచిత బస్‌పాస్‌కు సంబంధించిన ఫైలు ప్రభుత్వానికి పంపేందుకు పోలీసుశాఖ సిద్ధం చేసింది. కాగా మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం నూతన సంవత్సర కేక్‌ను డీజీపీ మాలకొండయ్య కట్ చేశారు. 2018 సంవత్సరమంతా రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షించారు.

ప్రాజెక్టులు కొత్త బడ్జెట్‌లో పూర్తి: యనమల

తుని, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్ (2018-19) ప్రజారంజకంగా ఉండబోతోందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. సోమవారం ఆయన తునిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను ఈ బడ్జెట్ ద్వారానే పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెలలో ఆర్థికవేత్తలతో మంత్రులు, కార్యదర్శుల సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

త్వరలో విజయకాంత్‌కు కిడ్నీ మార్పిడి

చెన్నై, జనవరి 1(ఆంధ్రజ్యోతి): డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్‌కు సింగపూర్‌లోని ఆసుపత్రిలో త్వరలో కిడ్నీ మార్పిడి జరగనుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో డీఎండీకే ఓటమి తర్వాత ఆయన తీవ్ర అస్వస్థతకు గురై రాజకీయాలకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. గత నవంబరులో వైద్య పరీక్షల కోసం ఆయన సింగపూర్ వెళ్లివచ్చారు. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోనూ చికిత్స పొందారు. కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు చెప్పడంతో కిడ్నీ దానం చేసేందుకు ఆయన బంధువొకరు ముందుకు వచ్చినట్టు సమాచారం. కిడ్నీ మార్పిడి కోసం రెండుమూడు రోజుల్లో ఆయన సింగపూర్ వెళ్లనున్నట్టు డీఎండీకే పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆశల రేవు



భావనపాడు పోర్టుపై కదిలిన ప్రభుత్వం

- అదానీ కంపెనీకి నిర్మాణ బాధ్యత
- అంచనా వ్యయం రూ.3,735 కోట్లు
- కావలసిన భూమి 2050 ఎకరాలు
- ఫిబ్రవరిలో విశాఖ భాగస్వామ్య సదస్సులో అధికారిక ఒప్పందం

ప్రాజెక్టు: భావనపాడు ఓడరేవు
పరిధి: సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు మండలాలు
నిర్మాణ వ్యయం: రూ.3,735 కోట్లు
బెర్తులు: 15 (తొలిదశలో 5 నిర్మాణం)
వార్షిక కార్గో అంచనా : 30.57 మిలియన్ టన్నులు
కావలసిన భూమి: 2050 ఎకరాలు
సేకరించాల్సిన ప్రైవేటు భూములు: 1550ఎకరాలు

శ్రీకాకుళం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు భావనపాడు ఓడరేవు నిర్మాణంపై ఊగిసలాట వీడింది. కొన్నేళ్లుగా పోర్టు నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు కసరత్తు చేసిన ప్రభుత్వం ఆ తర్వాత నిర్మాణ కంపెనీ ఎంపికను వాయిదా వేసింది. దీంతో పోర్టు వస్తుందా? రాదా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. తాజాగా పోర్టు నిర్మాణ బాధ్యతను ఓడరేవుల నిర్మాణంలో ప్రసిద్ధిగాంచిన అదానీ కంపెనీకి అప్పగించాలని తీర్మానించడంతో కీలక ఘట్టానికి తెరలేచింది. ఫిబ్రవరిలో విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో ఇందుకు సంబంధించి ఆ కంపెనీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య అధికారిక ఒప్పందం జరగనుంది.

సిక్కోలు తలరాత మారినట్టే..!

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలోని సంతబొమ్మాళి, పలాస నియోజకవర్గంలోని వజ్రపుకొత్తూరు మండలాల తీరప్రాంత పరిధిలో భావనపాడు పోర్టు నిర్మాణానికి అనువైన వాతావరణం ఉన్నట్లు కొన్నేళ్ల కిందట రాష్ట్రప్రభుత్వం గుర్తించింది. ఇక్కడకు నౌకల రాకపోకలకు అనువుగా సముద్రం లోతు కూడా సరిగ్గా సరిపోతుండడంతో పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం మొగ్గు చూపించింది. ఇక్కడ ఓడరేవు వస్తే దేశ,విదేశాలకు కార్గో రవాణాతోపాటు జిల్లాను కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చేయవచ్చని చంద్రబాబు సర్కారు కార్యాచరణ రూపొందించింది. 2015 ఫిబ్రవరిలో టెండర్లు పిలవగా అదానీ గ్రూపు అన్ని విభాగాల్లో అర్హత సాధించింది. అయితే గ్రీన్‌ఫీల్డ్ పోర్టుగా రూపుదిద్దుకునే ఈ ఓడరేవు నిర్మాణానికి సంబంధించి అదానీ కంపెనీ ప్రభుత్వానికి అతి తక్కువ ఆదాయం వాటా ఇవ్వడానికి ప్రతిపాదించింది. పోర్టు నిర్మాణం ప్రారంభంలో 0.5శాతం ఇస్తామని కంపెనీ ప్రతినిధులు వివరించగా ప్రభుత్వం తిరస్కరించింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు గతేడాది రాష్ట్ర పోర్టుల డైరెక్టర్, శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారులు, ఈ ప్రాజెక్టును దక్కించుకున్న అదానీ కంపెనీతో విజయవాడలో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. అదాని ఇస్తామన్నదాని కంటే ప్రభుత్వం ఎక్కువ రెవెన్యూ కోరుతుండగా అందుకు సమ్మతించలేదు. అప్పటి నుంచి అసలు పోర్టు వస్తుందా?లేదా? అనే సందిగ్ధం నెలకొంది. ఓడరేవు నిర్మాణం పూర్తయితే తక్కువ కాలంలోనే భారీస్థాయిలో కార్గో ఆర్డర్లు ఇక్కడకు మళ్లనున్నట్లు అధికారులు అంచనా వేశారు. పైగా ఈ పోర్టుకు ఒడిసా, కోల్‌కతా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా భారీగా ఎగుమతి,దిగుమతి కార్గో వస్తుందని ఇప్పటికే అదానీకూడా అంచనా వేసింది. ఇన్ని సానుకూల అంశాలుండడంతో రాష్ట్రప్రభుత్వం ఈ ఓడరేవు నిర్మాణ బాధ్యతను చివరికి అదానికే ఇవ్వడానికి అంగీకరించింది. ఇందుకు సంబంధించి పోర్టు అధికారులకూ ఆదేశాలు జారీచేశారు. ఇదే విషయాన్ని జిల్లా మంత్రులు అచ్చెన్నాయుడు, కళావెంకటరావు ఆదివారం అధికారికంగా ప్రకటించారు. అయితే ఫిబ్రవరిలో జరగనున్న భాగస్వామ్య సదస్సులో ప్రభుత్వం-అదానీ మధ్య జరగనున్న ఒప్పందంలో అన్ని విషయాలూ అధికారికంగా వెల్లడయ్యే అవకాశాలున్నాయి.

2050 ఎకరాలు... రూ.3725 కోట్ల పెట్టుబడి

రూ.3,725 కోట్లతో నిర్మించనున్న ఈ ఓడరేవులో మొత్తం 15 బెర్తులు నిర్మించాలని ప్రతిపాదించారు. తద్వారా ఏటా 30.57 మిలియన్ టన్నుల కార్గో హ్యాండిల్ చేయవచ్చని అంచనా వేశారు. ప్రాజెక్టుకు భూసేకరణకు అధికారులు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. అందులోభాగంగా 2050 ఎకరాలను ఓడరేవుకు కేటాయించనున్నారు. తొలుత రెండు మండలాల్లో మొత్తం 4,800ఎకరాలు సేకరించాలని భావించగా, ప్రతిపాదిత పోర్టు వల్ల ఎక్కువమంది నష్టపోకుండా చూడాలన్న ఉద్దేశంతో భూసేకరణను చివరకు 2,050 ఎకరాలకు పరిమితం చేశారు. ఇందులో 500ఎకరాలు ప్రభుత్వభూములు. పైగా పలు గ్రామాల్లో ఇళ్లను మినహాయించి భూసేకరణ పరిధిలోకి ఇవి రాకుండా జాగ్రత్త పడ్డారు. అయితే ఇప్పుడు గుర్తించిన ప్రైవేటు భూములకు కొత్త భూసేకరణ చట్టం ప్రకారం ఎకరాకు రూ.10లక్షలకుపైగా పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు భూములు, అందులో చెట్లు ఇలా అన్ని కోణాల్లో పరిహారానికి రూ.650 కోట్లు కావాలని ప్రాథమికంగా అంచనా వేశారు.

నాకు కావాల్సింది పోలవరం!

- కాంట్రాక్టర్, డిజైన్ ఏదన్నది కాదు
- రేపో, ఎల్లుండో గడ్కరీతో మాట్లాడతా
- ప్రతీ ప్రాజెక్టూ పరీక్షలా మారింది
- ఒక్కరి వల్లే అవి ఆగిపోతున్నాయి
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆక్రోశం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): "నాకు కావాల్సింది పోలవరం ప్రాజెక్టు పూర్తికావడమే. కాంట్రాక్టరు ఎవరు? టెక్నికల్‌గా ఏంటి? అప్పర్ కాఫర్ డ్యాం ఉంటుందా? లేదా? ఇవన్నీ అనవసరం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కేంద్రానికి చాలా ప్రాజెక్టులు ఉండొచ్చని... రాష్ట్రానికి జీవనాడి ఒక్క పోలవరం ప్రాజెక్టేనని చెప్పారు. దీనిపై రేపో, ఎల్లుండో కేంద్ర జలవనరుల శాఖమంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడతానని చెప్పారు. సోమవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా... పోలవరంలో అప్పర్ కాఫర్ డ్యాం వద్దని కేంద్ర నిపుణుల బృందం నివేదిక ఇచ్చిందట కదా? అని ప్రశ్నించగా... "అప్పర్ కాఫర్ డ్యాం సగం కడితే సరిపోతుందని, లోయర్ కాఫర్ డ్యాం పూర్తిచేసి ప్రధాన డ్యామ్‌కు వెళ్తే చాలని... రెండు, మూడు ఆప్షన్లు సూచిస్తున్నారు. కాఫర్‌డ్యాం లేకుంటే నీళ్లను తోడేందుకు చాలా ఖర్చు అవుతుంది. టెక్నికల్ డిజైన్లు ఎలా ఉండాలన్నది కేంద్రం ఇష్టం. మాకు ప్రాజెక్టు పూర్తి కావడమే ముఖ్యం" అని చంద్రబాబు వివరించారు. గడ్కరీ కొత్తగా ఈ శాఖ బాధ్యతలు చేపట్టారని... ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు పని పరిస్థితిని ఆయనకూడా బాగానే అర్థం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పూర్తి విషయంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రాజెక్టుకోసం 99.9శాతం మంది కలిసొస్తే ఒక్కరు వివాదాస్పదం చేస్తున్నారని, దీంతో మొత్తం ప్రాజెక్టు ఆగిపోతోందని ఆక్రోశించారు. ప్రతి ప్రాజెక్టు తమకు అగ్నిపరీక్షలాగే తయారైందన్నారు. ఇవన్నీ రాజకీయ కేసులేనా? అని ప్రశ్నించగా... "ఎక్కువ రాజకీయ కేసులే. కొందరు ఆత్యాశకు వెళ్లి కూడా కేసులు వేస్తారు. సమాజంలో అంతా బాగుంటే ఓర్వలేనివారు, అత్యాశపరులు కొందరుంటారు. కొత్త సంవత్సరంలోనైనా అందరి కోసం కలిసి రావాలి" అని హితవు పలికారు.

ఒత్తిడితో పని చేయించలేం

అధికారులపై ఒత్తిడి చేసి పనిచేయించలేమని చంద్రబాబు పేర్కొన్నారు. "అధికారులు హైదరాబాద్ నుంచి రావడం లేదని అంటున్నారు. అక్కడ మంచి సౌకర్యాలు, కుటుంబ అవసరాలు ఉండడంతో కొంతమంది రావడం లేదు. డిసెంబరు 31వ తేదీ రాత్రి భవానీ ఐల్యాండ్, ప్రకాశం బ్యారేజ్ దగ్గర డిన్నర్ చేశాం. అంతకంటే బెస్ట్ ప్లేస్ ఎక్కడుంది?" అని చంద్రబాబు ప్రశ్నించారు. మౌలిక సదుపాయాలు పెరిగితే అంతా అమరావతికి వస్తారని... ఆ రోజు ఎంతో దూరంలో లేదని తెలిపారు.

15లోగా డీడీఆర్‌సీ భేటీ

- ఎన్‌హెచ్‌పీసీ నివేదికపై సమీక్ష

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్మాణంలో అత్యంత కీలకమైన ఎగువ కాఫర్ డ్యాం, క్రస్ట్ గేట్ల డిజైన్లపై సమీక్షించేందుకు పాండ్యా నేతృత్వంలోని డ్యామ్ డిజైన్ రివ్యూ కమిటీ(డీడీఆర్‌సీ) ఈనెల 15 లోగా సమావేశం కానుంది. కాఫర్ డ్యాం డిజైన్లపై నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ) ఇచ్చిన నివేదికపై సమీక్షించనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎగువ కాఫర్ డ్యాంను నిర్మించాలన్నా.. డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని పొడిగించాలన్నా రెండేళ్ల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. కాగా, సీడబ్ల్యూసీ తీరు వివాదంగా మారుతోంది. గత నెల 5న ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర జల వనరుల మంత్రి దేవినేని ఉమ బృందం సమావేశమైంది. ఈ సమయంలో పోలవరం కోసం రాష్ట్రం వ్యయం చేసిన మొత్తంలో రూ.318 కోట్లను మంజూరు చేసినట్లుగా గడ్కరీ ప్రకటించారు. ఈ మొత్తానికి నాబార్డు నుంచి రుణం తీసుకోవాలని సీడబ్ల్యూసీని కేంద్ర జల వనరుల కార్యదర్శి ఆదేశించారు. అయితే, నాబార్డు నుంచి రుణం తీసుకునేందుకు అనుమతులివ్వాలని తిరిగి కేంద్ర జల వనరుల శాఖను సీడబ్ల్యూసీ కోరింది. రుణం తీసుకోవాలని తామే ఆదేశించినప్పుడు.. మళ్లీ అనుమతులు ఎందుకని కేంద్ర జల వనరుల కార్యదర్శి ప్రశ్నించారు. ఇప్పుడు ఈ మొత్తం కోసం నాబార్డులోని రుణవిభాగానికి దరఖాస్తు చేయడంలోనూ సీడబ్ల్యూసీ తప్పు చేసింది. పోలవరం రుణం రూ.500 కోట్ల పైబడి రుణాలిచ్చే విభాగం పరిధిలోకి వస్తుంది. ఆలోపు రుణం అందించే విభాగానికి జలసంఘం దరఖాస్తు చేసింది.

మొత్తం వాడుకుంటాం!

(మూడో పేజీ తరువాయి)

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో సుంకేశులకు ఆవలివైపున ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో భారీగా వర్షాలు కురిశాయి" అని ఆయన తన లేఖలో పేర్కొనడం గమనార్హం.

రాష్ట్ర వైఖరి ఏమిటి...

రాయలసీమ అవసరాలకోసం శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను వాడుకుంటున్నప్పటికీ.. తుంగభద్ర జలాలను వదులుకునేందుకు రాష్ట్రం సిద్ధంగా లేదు. అవి అచ్చంగా ఏపీకి కేటాయించిన నికర జలాలు. 'సుంకేశుల వద్ద మరమ్మతులు' అనే సాంకేతిక కారణాల వల్ల మాత్రమే వాటిని ప్రస్తుతం వాడుకోలేకపోతున్నాం. త్వరలో పరిస్థితిని చక్కదిద్ది ఆ నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేసే అవకాశముంది. పైగా... 'ఒక్కసారికి ఇచ్చేద్దాం' అనే పద్ధతి నీటి విషయంలో ఎట్టిపరిస్థితుల్లో పనికిరాదని అధికారులు చెబుతున్నారు. రాయలసీమ ప్రాంతంలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో... కర్ణాటక ప్రభుత్వం రాసిన లేఖలపై స్పందించకుండా మౌనం వహిస్తున్నారు. అయితే.. ప్రతి మూడు నాలుగు రోజులకోసారి రాష్ట్ర జల వనరుల శాఖ కార్యదర్శి శశి భూషణ్ కుమార్‌కు కర్ణాటక ర్ణాటక జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి ఉమేశ్ లేఖలు రాస్తూనే ఉన్నారు. ఎప్పటికప్పుడు తమ అభ్యర్థనను గుర్తు చేస్తున్నారు. సోమవారం ఆయన శశిభూషణ్‌తో ఫోన్లో మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన తాము విజయవాడకు వస్తున్నామని .. తుంగభద్ర నీటిని తమకు విడిచిపెట్టాలని కోరతామని తెలిపారు.

నా కష్టానికి ఓటు కూలీ!

(మూడో పేజీ తరువాయి)

పేర్కొన్నారు. మంగళవారం నుంచి 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆయన సోమవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. "సంక్రాంతి పండుగకు ముందొచ్చే అతి పెద్ద పండుగ జన్మభూమి - మా ఊరు. ఈ పది రోజులు మీకోసం, మీ గ్రామం కోసం, రాష్ట్రం కోసం ఆలోచించండి. చర్చ చేయండి. ప్రభుత్వం ఏం చేసిందో మనసుపెట్టి ఆలోచించండి. ఆర్థికంగా, సాంకేతికంగా, మరే రూపంలోనైనా సాయం చేయాలి. ఎవరి వంతు సహకారం వారు అందించాలి. ఇది రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టిన మహాయజ్ఞం. ఆర్థిక కష్టాలున్నా, ఇబ్బందులున్నా 2017లో అభివృద్ధి, సంక్షేమం బాగా చేశాం. ప్రజలు చైతన్యవంతమై కలిసొస్తే 2018లో మరింత బ్రహ్మాండంగా చేస్తాం" అని చంద్రబాబు పేర్కొన్నారు. అంతా కలిసి రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా చేసేందుకు ప్రయత్నిద్దామని పిలుపునిచ్చారు.

చేయలేకపోతే చెప్పేస్తాం..

జన్మభూమిలో వచ్చిన సమస్యలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టి, రియల్ టైమ్ గవర్నెన్స్‌లో పరిష్కస్తామని సీఎం చెప్పారు. పరిష్కారం కాకపోతే కావని చెప్తామని, ఆశ పెట్టి ఆఫీసుల చుట్టూ తిప్పుకోబోమని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల కోసం జన్మభూమి కార్యక్రమంలో వచ్చే అర్జీలను ఆన్‌లైన్‌లో పెట్టి, అర్హులైన అందరికీ ఉగాదికి కొత్త కార్డులు ఇస్తామని సీఎం చెప్పారు. పథకాల పంపిణీలో వాస్తవ సమాచారం కోసం సాధికార సర్వేను ప్రమాణికంగా తీసుకుంటున్నామన్నారు. మరోసారి సూక్ష్మస్థాయి సర్వే చేయిస్తామని చెప్పారు. జన్మభూమిలో 4లక్షల ఫించనుదార్లను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. వీరందరికీ ఉగాది నుంచి పింఛన్లు ఇస్తామన్నారు. "చంద్రన్న బీమా క్లెయిమ్‌ల కింద ఆరు వేల మందికి రూ.120కోట్లు, బీమా ఉపకార వేతనాల కింద 15.6 లక్షల మందికి రూ.186కోట్లు, స్త్రీ నిధి కింద 12వేల మంది లబ్ధిదారులకు రూ.200కోట్లు, బ్యాంకు లింకేజీ కింద 63వేల సంఘాలకు రూ.200కోట్లు జన్మభూమిలో పంపిణీ చేస్తాం. వడ్డీ రాయితీ కింద గ్రామాల్లోని 6.11లక్షల డ్వాక్రా సంఘాలకు రూ.670కోట్లు, పట్టణాల్లోని 43.67వేల సంఘాలకు రూ.110కోట్లు ఇస్తున్నాం. మూడో విడత రైతు రుణమాఫీ కింద ఇప్పటికే ఇచ్చింది పోను... ఇంకా 2.52లక్షల మంది రైతులకు రూ.639కోట్లు ఇవ్వాల్సి ఉంది. అది కూడా ఈ జన్మభూమిలో ఇస్తాం. డ్వాక్రా మహిళలకు ఇంకో నాలుగువేల రూపాయలు ఇవ్వాలి. నిధులు లేనందున కొంతకాలం ఆగుతున్నాం. త్వరలోనే అదీ పూర్తిచేస్తాం" అని ప్రకటించారు.

కోడిపందేలను జూదంగా మార్చొద్దు

"మనిషికి స్వార్థమే పరమావధి కాకూడదు. పూర్వం గ్రామాల్లో గ్రామ దేవతలను పూజించి, జాతరలు జరిపితే అందరూ కలిసి వచ్చేవారు. ఇప్పుడు అవన్నీ పోతున్నాయి. కనీసం నలుగురు కూర్చొని మాట్లాడుకోకుంటే ఎలా? ఊళ్లో ఏం జరుగుతున్నదో ఆలోచించే చైతన్యం తీసుకురావడానికే జన్మభూమి- మా ఊరు కార్యక్రమం చేపట్టాం. సంక్రాంతికి కోడిపందేలు ఆడవద్దనడం లేదు. కానీ... వాటికి కత్తులు కట్టొద్దు. జూదంగా మార్చవద్దు. గ్రామీణ క్రీడల సంస్కృతిని గౌరవిస్తూనే... ప్రకృతిని కాపాడాలి!" - చంద్రబాబు

విద్యుత్ చార్జీలు తగ్గుతాయి

విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన ఏకైక రాష్ట్రం ఏపీనే అని చంద్రబాబు తెలిపారు. "ఒకప్పుడు విద్యుత్ సంస్కరణలను నేనే ప్రారంభించాను. అప్పట్లో ఉన్న అపోహల కారణంగా... 2004 ఎన్నికల్లో రాజకీయంగా కూడా నష్టపోయాం. ఇప్పుడు అధికారంలోకి వచ్చేనాటికి 22.5మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉండేది. ఏడాదిలో లోటును దాటేశాం. వందశాతం ఇళ్లకు విద్యుత్ అందించాం. కేంద్రం సోలార్ విద్యుత్ విధానం తీసుకొస్తే చార్జీలు తగ్గుతాయి" అని వివరించారు. మనకు శక్తిని, సౌర విద్యుత్తును అందిస్తున్నది ఆ సూర్యుడే అని... ఈ నెలలో సూర్య ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.



సభలో జగన్‌కు మగ్గం బహూకరిస్తున్న వైసీపీ శ్రేణులు

నేనొస్తే ఆరోగ్యశ్రీ విస్తరణ

- పొరుగు రాష్ట్రాల్లోనూ వైద్యమూ ఉచితం
- చేనేత, డ్వాక్రా రుణాలు పూర్తిగా మాఫీ : జగన్

మదనపల్లె, జనవరి 1: తనకు అధికారం ఇస్తే ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తరించడంతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వైద్యం చేయించుకున్నా.. వైద్యం ఖర్చు రూ.1000 దాటే ప్రతి ఒక్కరికీ పూర్తి ఉచితంగా వైద్యం అందిస్తామని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రకటించారు. రైతులకు, చేనేతలకు వైఎస్ఆర్ పేరుతో బీమా పథకాన్ని కూడా ప్రవేశ పెడతామన్నారు. సోమవారం ఉదయం చిత్తూరు జిల్లా ముదివేడు నుంచి 49వ రోజు పాదయాత్ర ప్రారంభించిన ఆయన.. కడప క్రాస్, నడింపల్లి, నల్లగుట్టపల్లి, రేగంటివారిపల్లి మీదుగా చిన్నతిప్పసముద్రం (సీటీఎం) వరకు 14.5 కిలోమీటర్లు నడిచారు. సీటీఎంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. చేనేత, డ్వాక్రా రుణాల మాఫీతోపాటు చేనేత కార్మికులకు పావలా వడ్డీతో రూ.లక్ష వరకూ బ్యాంకుల్లో రుణసదుపాయం కల్పిస్తామన్నారు. చేనేతకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అనంతపురం జిల్లా ధర్మవరంలో 38 మంది, మదనపల్లెలో 28 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు చెప్పారు. దీనిపై తాను అసెంబ్లీలో ప్రస్తావిస్తే.. ఆత్మహత్యలే లేవని ప్రభుత్వం బుకాయించిందన్నారు. తర్వాత ఇదే అంశంపై ధర్మవరంలో మహిళలు, చేనేత కార్మికులు చేపట్టిన ధర్నాలో తాను సంఘీభావంగా పాల్గొంటే.. అప్పటికప్పుడు ప్రభుత్వం పది మందికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, చివరకు కొర్రీలు పెట్టి వారికి కూడా పూర్తిస్థాయిలో సాయం అందించలేదని ఆరోపించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తెస్తానని, పైసా ఖర్చు లేకుండా డాక్టర్, ఇంజనీర్ అయ్యేలా చేస్తానని చెప్పారు. వారికి హాస్టల్ ఫీజు, మెస్ చార్జీలకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్నారు. పాదయాత్రలో ఎంపీలు మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిప్పారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి కాంగ్రెస్ మహాపాదయాత్ర

- ఈ ఏడాదిలో ప్రాజెక్టులు పూర్తి చేయాలి: రఘువీరా



మడకశిర, జనవరి 1: పోలవర ంతోపాటు రాష్ట్రంలోని 43 సాగునీటి ప్రాజెక్టులను 2018లోపు పూర్తిచేసి రైతులకు నీరందించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ ఈనెల 7వ తేదీ నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర చేపడుతున్నట్లు పీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి చెప్పారు. సోమవారం అనంతపురం జిల్లా మడకశిర పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7న పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి పాదయాత్ర కార్యక్రమాన్ని మౌళేశ్వరం వద్ద ప్రారంభిస్తారని రఘువీరా తెలిపారు. 7 నుంచి 9 వరకు పాదయాత్ర నిర్వహించి, 10న పోలవరం నిర్వాసితులతో కలిసి సత్యాగ్రహ కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే పాల్గొంటారన్నారు.

మార్కెటింగ్ కమిషనర్‌కు రైతుబజార్ల బాధ్యత

అమరావతి, జనవరి1 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ప్రత్యేక కమిషనర్ శామ్యూల్ ఆనంద్‌కుమార్‌కు రైతుబజార్ల సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

గొట్టిపాడులో రాళ్లవర్షం

- న్యూఇయర్ వేడుకల్లో రగడ
- ఒకవర్గం కుర్రాళ్ల బైక్ షికారు
- తమ స్త్రీలపై బండి పడేశారని అవతలి వర్గం ఆగ్రహం..ఘర్షణ
- రాళ్లు తగిలి ముగ్గురికి గాయాలు



గొట్టిపాడులో మోహరించిన పోలీసులు. (ఇన్‌సెట్) రాళ్లు రువ్వుకుంటున్న యువకులు

ప్రత్తిపాడు, జనవరి 1 : గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల పరిధిలోని గొట్టిపాడులో రెండు సామాజిక వర్గాల మధ్య ఆంగ్ల సంవత్సర వేడుకలు చిచ్చు రేపాయి. ఒక వర్గానికి చెందిన కొందరు యువకులు ద్విచక్రవాహనాలపై అర్ధరాత్రి సమయంలో గ్రామంలోకి వచ్చి చక్కర్లు కొట్టారు. ఆ సమయంలో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలపైకి ఒక ద్విచక్రవాహనం దూసుకెళ్లింది. ఆ బైకుపై ఉన్న యువకులు.. మహిళలపై పడటంతో గొడవ మొదలైంది. ఈ క్రమంలో బైకులపై వచ్చిన యువకులకు మద్దతుగా మరికొందరు అక్కడకు చేరుకొన్నారు. వారు ఓ గ్రామస్థునిపై చెయ్యి చేసుకోవడంతో, గొడవ పెరిగి పెద్దదయింది. సోమవారం ఆ గ్రామస్థునిగా మద్దతుగా కొంతమంది, అవతలి వర్గంపై దాడిచేశారు. ఇరువర్గాలు.. రాళ్లు రువ్వుకున్నారు. సీసాలు విసురుకున్నాయి. ఇటుకలు, బండ ముక్కలతో తలపడ్డాయి. అక్కడున్న మీడియా సిబ్బందిపై నా దాడిచేసి కెమెరాను లాక్కున్నాయి. ఈ కొట్లాటలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశంతో పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. గొట్టిపాడులో అదనపు బలగాలను మోహరించారు. ఇరువర్గాలతో నేరుగా మాట్లాడి, ఆ గ్రామంలో శాంతిని నెలకొల్పాల్సిందిగా అధికారులను మంత్రి పుల్లారావు ఆదేశించారు. ఈమేరకు కలెక్టర్, ఎస్పీలు గొట్టిపాడుకు చేరుకొన్నారు. అయితే, గొడవలు వీడి సఖ్యతతో వ్యవహరించడానికి ఇరువర్గాలూ ససేమిరా అంటున్నాయి. తమ కుర్రాళ్లు ఊరిలోకి వచ్చారన్న కారణంగానే దాడిచేశారని ఒక వర్గం ఆరోపిస్తుండగా, తమ మహిళలపైకి బండి పోనిచ్చిన వాళ్లను ఊరికే వదిలేస్తే, రేపు ఎంతకైనా తెగిస్తారని రెండో వర్గం చెబుతోంది.

అమ్మ గుడిలో తాంత్రిక తంతు

(మూడో పేజీ తరువాయి)

వెళ్లిపోయారు. ఆ తర్వాత, అసలు తంతు మొదలైంది. తమిళనాడు నుంచి రప్పించిన నలుగురు తాంత్రికులతోపాటు దుర్గమ్మ ఆలయంలో పూజలు చేసే తండ్రీ కొడుకులు గుడిలోకి చేరుకున్నారు. అమ్మవారికి పవళింపు సేవ ముగిసిన తర్వాత మూసివేసిన గర్భగుడి తలుపులను తెరిచారు. రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి దాటాక 12.45 గంటల వరకు అత్యంత రహస్యంగా భైరవీ పూజ నిర్వహించారు. ఈ క్రతువు పూర్తికాగానే... గుడి తలుపులు మూసి వెళ్లిపోయారు.

ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారికి శైలిపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటా, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయని, కాలరాత్రి, భైరవీ, సర్వసిద్ధి అనే తొమ్మిది పేర్లు ఉన్నాయి. ఈ పేర్లతో వామాచార విధానంలో అమ్మ వారికి పూజలు జరిగేవి. వామాచారం... అంటే జంతు బలుల వంటి తాంత్రిక విధానాలు. ఇలా చేయడం వల్ల అమ్మవారు భీకర స్వరూపిణిగా ఉంటారనే ఉద్దేశంతో, ఆదిశంకరాచార్యుల వారు ఆ పేర్లను మార్చి వేసి, అమ్మవారికి లలితా రూపాన్ని ఇచ్చారు. అప్పటి నుంచి ఇక్కడ సాత్విక పూజలు జరుగుతున్నాయి. ఇప్పుడు... ఒక అర్చకుడు ఇచ్చిన సలహా మేరకు, ఆ అధికారి తన స్వప్రయోజనం కోసం భైరవీ పూజ చేయించారు. మరుసటిరోజునే దీనిపై కొంత ప్రచారం జరిగింది. ఆలయ పాలకవర్గం సభ్యులు దీనిపై కార్యనిర్వహణాధికారి సూర్యకుమారిని ప్రశ్నించారు. 'అలాంటిదేమీ జరగలేదు' అని ఆమె బదులిచ్చారు. ఆ తరువాత సీసీ టీవీ ఫుటేజీలో, అంతరాలయం ముందు దుర్గగుడితో సంబంధం లేని వ్యక్తులు కాషాయ వస్త్రాలతో కనిపించడంతో కలకలం రేగింది.


దుర్గగుడి ఆలయాన్ని రాత్రి పదిగంటలకు మూసివేస్తారు. తరువాత ఎవ్వరూ తెరవకూడదు. తెరిచినా ప్రత్యేక నిబంధనలను పాటించాలి. అక్కడున్న ప్రత్యేక పోలీసులకు, సెక్యూరిటీకి, గుమాస్తాకు, ఆలయంలో పనిచేస్తున్న ముఖ్య అర్చకులకు లిఖితపూర్వకంగా సమాచారం అందించాలి. గుడి మూసి వేశాక అక్కడున్న రిజిస్టర్‌లో సంబంధిత బాధ్యులంతా సంతకాలు చేయాలి. ఈ రిజిస్టర్‌ను పరిశీలించగా... డిసెంబరు 26వ తేదీ రాత్రి 10.15కి ఆలయాన్ని మూసి వేసినట్లుగా ఉంది. తిరిగి తెల్లవారు జామున నిర్ణీత సమయానికి మాత్రమే తలుపులు తెరిచినట్లుగా స్పష్టంగా ఉంది. కానీ... 26వ తేదీ రాత్రి ఆలయాన్ని శుభ్రం చేయించటం కోసం అనుమతి ఇచ్చినట్టుగా దేవాలయ ఉన్నతాధికారులు చెబుతున్నారు. అదే నిజమైతే రిజిస్టర్‌లో ఆ విషయాన్ని నమోదు చేయాలి. మరోవైపు... ఆలయం శుభ్రం చేస్తున్న దృశ్యాలేవీ సీసీ కెమెరాల్లో నమోదు కాలేదు. పూజ విషయం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు సిబ్బందిని ఏవో సాకులు చెప్పి బయటకు పంపించినట్లుగా తెలుస్తోంది. ఈ తతంగంపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం.



కొత్తజంట శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: కొత్త జంట విరాట్ కోహ్లీ, అనుష్క తమ అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దక్షిణాఫ్రికాతో శుక్రవారం మొదలయ్యే తొలి టెస్టు కోసం టీమిండియా కేప్‌టౌన్‌కు వెళ్లింది. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. అందరి జీవితాల్లో ఆనందం, వెలుగులు నింపాల'ని కాంక్షిస్తూ విరాట్ ట్వీట్ చేశాడు. భార్య అనుష్కతో కలసి దిగిన ఫొటోను కోహ్లీ పోస్ట్ చేశాడు. అదే ఫొటోను అనుష్క కూడా ట్వీట్ చేసింది. అంతకు ముందు విరుష్క జంట కేప్‌టౌన్ వీధుల్లో షాపింగ్ చేస్తూ కనిపించారు. మరో వీడియోలో విరాట్, ధవన్ డ్యాన్స్ చేసి హల్‌చల్ చేశారు.





కేప్‌టౌన్ స్టేడియం

తొలిటెస్టుకు 'ఆ వికెట్' లేనట్లేనా?

ఓవైపు బౌన్సీ వికెట్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు టీమిండియా వ్యూహరచనలో నిమగ్నమై ఉండగా.. ఈనెల ఐదున ప్రారంభమయ్యే తొలి టెస్టుకు వేదికైన కేప్‌టౌన్ పిచ్ మాత్రం బౌన్సీ కాదట. ఇక్కడి వికెట్ విరాట్‌సేనను అంతగా ఇబ్బంది పెట్టకపోవచ్చని సమాచారం. ఇక్కడ ఆతిథ్య జట్టుకు అనుకూలంగా పిచ్‌ను రూపొందించే పరిస్థితి లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. అందుకు కారణం.. చాన్నాళ్లుగా ఈ ప్రాంతంలో తీవ్ర కరువుండడమే. కరువు కారణంగా నీటి వినియోగం చాలా తక్కువగా ఉంది. దీంతో ఇక్కడ నీటి వినియోగంపై స్థానిక మున్సిపాలిటీ అధికారుల నుంచి ఆదేశాలున్నాయి. మైదానాన్ని తడిపేందుకు బోరు నీటినే వినియోగిస్తున్నా కూడా పరిస్థితి భిన్నంగానే ఉందని కేప్‌టౌన్ పిచ్ క్యూరేటర్ వాపోతున్నాడు. 'ప్రతిరోజు బోరు నీటితో పిచ్‌ను తడుపుతున్నాం. ఔట్‌ఫీల్డ్‌ను మాత్రం వారానికి రెండుసార్లే తడుపుతున్నాం. అందుకే మైదానంపై అంతగా పచ్చిక కనిపించకపోవచ్చు. పొడిగా ఉండే అవకాశముంది' అని పిచ్ క్యూరేటర్ ఇవాన్ ఫ్లింట్ చెప్పుకొచ్చాడు. వాండరర్స్, సెంచూ రియన్ తరహాలో కేప్‌టౌన్ పిచ్ తొలుత బౌలర్లకు అనుకూలించినా, తర్వాత వీళ్లకు అంతగా అవకాశం ఉండకపోవచ్చని ఇవాన్ అన్నాడు.

దక్షిణాఫ్రికాలో క్రికెట్ సిరీస్ అనగానే వెంటనే స్ఫురించేది అక్కడ ఎదురయ్యే పేస్, బౌన్సీ పిచ్‌లే. చండ ప్రచండమైన వేగంతో బ్యాట్స్‌మెన్ మీదికి దూసుకొచ్చే బంతులను ఎదుర్కోవడం నైపుణ్యం కలిగిన ఆటగాడికి కూడా అంత సులువు కాదు. ఇదే బలహీనతతో ఇప్పటిదాకా టీమిండియా అక్కడికి వెళ్లిన ప్రతిసారీ విఫలమవుతూ వచ్చింది. ఇప్పుడు నాలుగేళ్ల అనంతరం.. వరుస విజయాల జోష్‌తో పాటు నెంబర్‌వన్ హోదాలో విరాట్ సేన చరిత్ర సృష్టించేందుకు సఫారీ గడ్డపై అడుగుపెట్టింది. దీనికి తోడు ఎలాంటి పిచ్‌లపై ఆడాల్సి ఉంటుందో తమకు బాగానే తెలుసని భారత కెప్టెన్ ధీమా వ్యక్తం చేస్తున్నాడు.. మరి తమకు అంతగా అనుకూలించని ఈ తరహా పిచ్‌లపై ప్రత్యర్థిని ఎదుర్కొనేందుకు జట్టు ఎలాంటి ప్రణాళికలు రచిస్తోంది? పచ్చికతో కూడిన పిచ్‌లపై ఎలా చెలరేగబోతోంది?

బౌన్సీతో దోస్తీకి..

- టీమిండియా ముమ్మర సాధన
- 'బిగ్-5'పై ప్రధాన దృష్టి

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

90వ దశకానికి ముందు దక్షిణాఫ్రికా జట్టుపై అంతర్జాతీయ క్రికెట్ ఆడకుండా నిషేధం కొనసాగుతూ ఉండేది. అయితే ఐసీసీ 1991లో ఆ జట్టును టెస్టు ఫార్మాట్‌లోకి ఆహ్వానిస్తూ నిషేధం ఎత్తివేసింది. ఆ మరుసటి ఏడాదే భారత జట్టు నాలుగు టెస్టుల సిరీస్ కోసం సఫారీ పర్యటనకు వెళ్లింది. కానీ రెండు దశాబ్దాలపాటు వెలివేతలోనే ఉన్నప్పటికీ సూపర్ బౌలింగ్‌తో భారత్‌ను వణికించింది. అక్కడి బౌన్సీ ట్రాక్‌లపై పరుగులు సాధించేందుకు భారత బ్యాట్స్‌మెన్ ఆపసోపాలు పడ్డారు. చివరకు అలెన్ డొనాల్డ్, బ్రెట్ షుల్జ్ పేస్ ధాటికి 0-1తో సిరీస్ కోల్పోవాల్సి వచ్చింది. అదిగో.. అప్పటి నుంచి పాతికేళ్లుగా ఆరుసార్లు టీమిండియా సఫారీలపై దాడికి దిగినా రిక్తహస్తాలతోనే వెనక్కివచ్చింది. తీరని కోరికగా మిగిలిపోతున్న సిరీస్ విజయం కోసం తాజాగా భారత్ మరోమారు వెళ్లింది. ఇప్పటికే జట్టు తొమ్మిది వరుస సిరీస్ విజయాలతో ఊపు మీదుంది. నిజానికి శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో తొలి మ్యాచ్ కోసం బౌన్సీ పిచ్‌నే సిద్ధం చేశారు. కానీ లంక పేసర్ లక్మల్ ధాటికి దారుణంగా దెబ్బతినాల్సి వచ్చింది. అయితే ఆ మ్యాచ్‌లో ఆశించినట్టు రాణించకపోయినా తమకు అది ఓ అనుభవంలా ఉపయోగపడిందని టీమ్ మేనేజ్‌మెంట్ సమర్థించుకుంది.

పక్కా ఏర్పాట్లు

దక్షిణాఫ్రికా పరిస్థితులను ఆకళింపు చేసుకునేందుకు వామప్ మ్యాచ్‌లో ఆడడం కంటే నెట్స్‌లో శ్రమించడమే మేలనే అభిప్రాయంతో కోహ్లీ ఉన్నాడు. ఎందుకంటే వామప్ మ్యాచ్ కోసం ఎక్కడైనా బ్యాట్స్‌మెన్ పరుగులు చేసేలా రూపొందిస్తారు. కానీ సిరీస్ విజయం కోసం కసిగా ఉన్న టీమిండియా తమకు పచ్చికతో కూడిన పిచ్ కావాలని, దానిపైనే నెట్స్‌లో శ్రమిస్తామని ముందే దక్షిణాఫ్రికా క్రికెట్ (సీఎస్ఏ)కు తెలిపింది. దీంట్లో భాగంగా కేప్‌టౌన్‌లోని వెస్ట్రన్ ప్రావిన్స్ క్రికెట్ క్లబ్ (డబ్ల్యూపీసీసీ)ను తమ అడ్డాగా మార్చుకుంది. ఇక్కడ టర్ఫ్ వికెట్ నుంచి ఇండోర్ నెట్స్ వరకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. భారత బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ మైదాన సిబ్బందితో నిరంతరం టచ్‌లో ఉంటున్నాడు. పిచ్‌ల పర్యవేక్షణతో పాటు, పచ్చిక ఉండేలా చూడడం, నీటి పిచికారీ, రోలింగ్ చేయించి వీలైనంత ఎక్కువగా బౌన్స్‌ను రాబట్టేలా చూస్తున్నాడు. ఒకవేళ భారత జట్టు సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన ఇవ్వలేకపోయినా కూడా బాగా సన్నద్ధమవలేదనే అపవాదురాకుండా ఉండేందుకు సంజయ్ జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ఏదిఏమైనా ఈనెల 5న న్యూలాండ్స్‌లో జరిగే తొలి టెస్టుకు ముందే అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేందుకు డబ్ల్యూపీసీసీలో సౌకర్యాలు ఉపయోగపడనున్నాయి.

'ఆ ఐదుగురి'పైనే..

భారత బ్యాట్స్‌మెన్‌కు అసలు సవాలు.. దక్షిణాఫ్రికా 'బిగ్ ఫైవ్' బౌలర్లను ఎదుర్కోవడమే. పేసర్లు డేల్ స్టెయిన్, కగిసో రబాడ, మోర్నీ మోర్కెల్, ఫిలాండర్‌లతో పాటు లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఈ జాబితాలో ఉన్నారు. స్టెయిన్ అపార అనుభవం.. రబాడ పదునైన యార్కర్లు, బౌన్సర్లు.. మోర్కెల్, ఫిలాండర్ కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ బంతులు.. కేశవ్ సుడులు తిరిగే స్పిన్ భారత్‌ను ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. అయితే పిచ్‌లు నిజంగానే బౌన్స్‌కు అనుకూలించినట్టయితే భారత పేసర్లు భువనేశ్వర్, ఇషాంత్, షమీ, ఉమేశ్, బుమ్రా కూడా సిద్ధంగానే ఉంటారు. గత ఏడాది భారత్ ఒక్క టెస్టు మాత్రమే ఓడి అన్నింటా విజయాలు సాధించగలిగిందంటే అందులో బౌలర్ల కృషిని తక్కువ చేయలేము. కానీ కూకాబుర్రా బంతులతో బౌలింగ్ చేయడం అంత సులువు కాకపోవచ్చు. ఎందుకంటే 30 ఓవర్ల అనంతరం ఆ బంతితో ఎలాంటి వైవిధ్యాన్ని చూపలేము. అన్నింటికన్నా ముఖ్యంగా బిగ్ ఫైవ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటూ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ ముందుగా స్కోరు బోర్డుపై భారీ స్కోరు సాధించాల్సి ఉంటుంది. అయితే ఈ క్రమంలో ఒక్క చెడ్డ సెషన్ ఎదురైనా కుప్పకూలినట్టే. అందుకే ముందుగానే ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపేందుకు కోచ్ రవిశాస్త్రి నడుం బిగించాడు. ప్రతీ మ్యాచ్‌ను స్వదేశంలో జరుగుతున్నట్టుగానే భావించాలని, అక్కడ ఆడినా కూడా పిచ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవాలని గుర్తుచేస్తున్నాడు. 'సత్తా కలిగిన జట్టు ఎలాంటి పరిస్థితులెదురైనా తమకు అనుకూలంగా మార్చుకుంటుంది. ఇక దక్షిణాఫ్రికాలో సిరీస్ నెగ్గేందుకు ఇంతకు మించిన తరుణం లేదని జట్టుకు కూడా తెలుసు. ఈ క్రమంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పర్యటనను ఆస్వాదిస్తూనే తమ శక్తిసామర్థ్యాలను చక్కగా వినియోగిస్తే విజయం దక్కకపోదు.



రోహిత్ శర్మతో కోహ్లీ (ఫైల్)

విదర్భ కొత్త చరిత్ర

ఫైనల్‌కు చేరిన తొలిసారే రంజీ టైటిల్ ● ఢిల్లీపై ఘన విజయం

ఇండోర్: తొలిసారి ఫైనల్లో ప్రవేశించింది. అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంది. టైటిల్ ఎగరేసుకుపోయింది. దేశవాళీ మెగా టోర్నీ రంజీట్రోఫీని విదర్భ కైవసం చేసుకుంది. సోమవారం ఇక్కడ ముగిసిన తుది పోరులో విదర్భ 9వికెట్ల తేడాతో ఏడుసార్లు చాంపియన్ ఢిల్లీపై ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించింది. 29 పరుగుల సునాయాస లక్ష్యాన్ని ఆ జట్టు.. కెప్టెన్ ఫజల్ వికెట్ కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్‌తో 6 వికెట్లు... మ్యాచ్ మొత్తంమీద 8వికెట్లు చేజిక్కించుకున్న విదర్భ పేసర్ రజనీష్ గుర్బానీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఓవర్‌నైట్ స్కోరు 528/7తో నాలుగోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ మరో 19 పరుగులు జోడించి మిగిలిన 3వికెట్లు కోల్పోయింది. ఫలితంగా ప్రత్యర్థి 252 పరుగుల భారీ మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం కూడగట్టుకుంది. ముందురోజు 133 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్న వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ అదే స్కోరువద్ద అవుటయ్యాడు. ఢిల్లీ పేసర్ నవదీప్ సైనీ 135 పరుగులిచ్చి 5వికెట్లు పడగొట్టాడు. అయితే, ఇతను ఢిల్లీ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం గమనార్హం. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 280 పరుగులకు ఆలౌటైంది. షోరె (62), నితీష్ రాణా (64) అర్ధ సెంచరీలు చేశారు. ఆపై 29 పరుగుల స్వల్పలక్ష్యాన్ని విదర్భ అలవోకగా ఛేదించింది. అంతకుముందు 252 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ 32 పరుగుల వద్ద ఓపెనర్ కునాల్ చందేలా వికెట్ చేజార్చుకుంది. అయితే టీమిండియా మాజీ ఓపెనర్ గంభీర్ ధాటిగా ఆడి (37 బంతుల్లో ఏడు ఫోర్లతో 36) చివరికి గుర్బానీ బౌలింగ్‌లో ఎల్బీగా అవుటయ్యాడు. షోరె, రాణా మూడో వికెట్‌కు 110 రన్స్ జోడించారు. వీరిద్దరు ఔటయ్యాక ఢిల్లీ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. రిషబ్ పంత్ (32), చివర్లో వికాస్ మిశ్రా (34) ఫర్వాలేదనిపించారు.

సంక్షిప్తస్కోర్లు

ఢిల్లీ తొలి ఇన్నింగ్స్: 295; రెండో ఇన్నింగ్స్ 280 (గంభీర్ 36, షోరె 62, రాణా 64, గుర్బానీ 2/92, వఖారే 4/94, సర్వాతే 3/30).

విదర్భ తొలి ఇన్నింగ్స్: 547 (ఫజల్ 67, జాఫర్ 78, వాడ్కర్ 133, సర్వాతే 79, నెరాల్ 74, సైనీ 5/135, సుడాన్ 2/102);

రెండో ఇన్నింగ్స్: 32/1 (సంజయ్ నాటౌట్ 9, జాఫర్ నాటౌట్ 17, కెజ్రోలియా 1/21)

టీమిండియాకి ఆడినట్లుంది: విదర్భ కెప్టెన్

రంజీట్రోఫీ గెలవడం టీమిండియాకు ప్రాతినిధ్యం వహించినంత గొప్పగా ఉందని విదర్భ కెప్టెన్ ఫయాజ్ ఫైజల్ అన్నాడు. 2016లో జింబాబ్వేలో పర్యటించిన భారత ద్వితీయశ్రేణి జట్టులో ఫజల్ సభ్యుడు. భారత్‌కు ఏకైకవన్డేలో ప్రాతినిధ్యం వహించాడు.

ఉగ్రవాదాన్ని ఆపితేనే పాక్‌తో ద్వైపాక్షిక క్రికెట్



కేంద్ర మంత్రి సుష్మ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సీమాంతర ఉగ్రవాదానికి, సరిహద్దుల్లో కాల్పులకు స్వస్తి పలకనంత వరకూ పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు ఉండబోవని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ స్పష్టం చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన విదేశీ వ్యవహారాల శాఖ పార్లమెంట్ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆమె ఈ విషయం ప్రకటించారు. 'పొరుగు దేశంతో సంబంధం' అనే అంశం ప్రధాన అజెండాగా జరిగిన ఈ భేటీలో విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్, విదేశాంగ శాఖ కార్యదర్శి ఎస్. జైశంకర్ పాల్గొన్నారు. తటస్థ వేదికల్లో కూడా పాకిస్థాన్‌తో క్రికెట్ సిరీస్‌లలో పాల్గొనే అవకాశమే లేదని సుష్మ కుండబద్ధలు కొట్టారు. ఉగ్రవాదం, క్రికెట్ ఒకే బాటలో పయనించలేవని ఆమె అన్నారు.

సబ్బీర్‌పై వేటు



ఢాకా: ఓ అభిమానిపై దాడి చేసినందుకు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ సబ్బీర్ రహమాన్ భారీ మూల్యమే చెల్లించుకున్నాడు. ఏకంగా బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోవడమే కాకుండా రూ.16 లక్షల జరిమానా కూడా అతనిపై పడింది. దీంతోపాటు దేశవాళీ క్రికెట్‌కు ఆరునెలల పాటు దూరం కానున్నాడు. బీసీబీ ఓ ఆటగాడిపై ఇంత కఠినంగా వ్యవహరించడం ఇదే తొలిసారి. ఈనెల 21న రాజ్‌షాహి డివిజన్ జాతీయ క్రికెట్ లీగ్ సందర్భంగా అంపైర్ అనుమతి తీసుకుని మరీ సబ్బీర్ గ్యాలరీలో ఉన్న ఓ అభిమానిపై చేయిచేసుకున్నాడు. అంతేకాకుండా ఈ ఘటనపై విచారణకు ఆదేశించిన రిఫరీతో కూడా అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో బీసీబీ తీవ్రంగా స్పందించింది.

బెంగళూరుకు 'అక్సెల్‌సెన్' విక్టరీ

లక్నో : పీబీఎల్‌లో సోమవారంనాటి మ్యాచ్‌లో బెంగళూరు బ్లాస్టర్స్ 6-(-1)తో ముంబై రాకెట్స్‌ను చిత్తుగా ఓడించింది. ప్రపంచ ఐదో నెంబర్ కొరియా ఆటగాడు సన్ వాన్ హో నుంచి ఎదురైన తీవ్ర ప్రతిఘటనను తిప్పికొట్టిన వరల్డ్ చాంపియన్ విక్టర్ అక్సెల్‌సెన్ 15-6, 15-13 విజయంతో తన జట్టుకు రెండు పాయింట్లు అందించాడు. అంతకుముందు మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎన్.సిక్కిరెడ్డి, కిమ్ సా రంగ్, మహిళల సింగిల్స్‌లో గిల్మోర్ ప్రత్యర్థులపై విజయంతో బెంగళూరును 2-0 ఆధిక్యంలో నిలిపారు. కాగా ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ను ముంబై చేజార్చుకోవడంతో ఆ జట్టుకు -1 పాయింట్ లభించింది. ఇక ఆఖరి పురుషుల డబుల్స్‌లోనూ ముంబై రాకెట్స్‌ను ఓడించి బెంగళూరు తన జోరు కొనసాగించింది.

స్టార్ స్పోర్ట్స్‌కు స్కూల్ గేమ్స్ ప్రసార హక్కులు

న్యూఢిల్లీ: ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ ప్రసార హక్కులను స్టార్‌స్పోర్ట్స్ దక్కించుకున్నది. 2018-2022 కాలానికి స్కూల్‌గేమ్స్‌ను ప్రసారం చేసే హక్కులను స్టార్ స్పోర్ట్స్‌కు కేటాయించినట్టు కేంద్ర క్రీడా మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ వెల్లడించాడు. ఖేలో ఇండియా ప్రణాళిక కింద జనవరి 31 నుంచి అండర్-17 బాలబాలికలకు 16 క్రీడాంశాలలో జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలను నిర్వహించనున్నారు. స్కూల్ గేమ్స్‌ను టీవీలలో, డిజిటల్ ప్లాట్‌ఫాంపై ప్రత్యక్ష ప్రసారం చేయనుండడం ఇదే తొలిసారి.

మాకో ద్రావిడ్ కావాలి



కరాచీ: భవిష్యత్ వనరుల అభివృద్ధి కోసం బీసీసీఐ బాటలో నడవాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు ఆ దేశ మాజీ ఆటగాడు రమీజ్ రజా సలహా ఇచ్చాడు. తమ అండర్-19 టీమ్‌కు రాహుల్ ద్రావిడ్ తరహా కోచ్‌ను నియమించాలని సూచించాడు. విజయాలకంటే జూనియర్ స్థాయిలో ఆటగాళ్ల ప్రతిభను పసిగట్టి వారిని సానబెట్టడం ఎంతో ముఖ్య మన్నాడు. ద్రావిడ్ లాంటి అనుభవజ్ఞుడు కోచ్‌గా, మెంటార్‌గా ఉంటే యువ ఆటగాళ్లు ఎంతో నేర్చుకోవచ్చన్నాడు.

డీజే.. శాస్త్రి!

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనలోనున్న టీమిండియా కొత్త ఏడాదికి ఘనస్వాగతం పలికింది. వేడుకల్లో ఆడిపాడింది. కోచ్ రవిశాస్త్రి డీజే అవతారమెత్తి పార్టీలో జోష్ నింపాడు. 'అందరికీ న్యూఇయర్ శుభాకాంక్షలు. వేడుకలు యమా కిక్‌గా సాగాయనుకుంటున్నా. అందరికీ భగవంతుడి ఆశీస్సులుండాలి' అని తాను డీజేగా ఉన్న ఫొటోను శాస్త్రి ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.





త్వరలోనే తండ్రి కాబోతున్నట్లు క్రికెటర్ పుజారా వెల్లడించాడు. 'ఈ ఏడాది మాకు మరింత సంతోషం. నా భార్య పండంటి బిడ్డకు జన్మనివ్వనుంది' అని గర్భవతిగా ఉన్న భార్య పూజతో కలిసి దిగిన ఫొటోను పుజారా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

ఏపీ అమ్మాయిల పరాజయం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో రెండోరోజు ఆంధ్రప్రదేశ్‌కు నిరాశే ఎదురయింది. మహిళల మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు బిహార్ చేతిలో పరాజయం పాలైంది. అంతకుముందు ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పురుషుల జట్టు కూడా బెంగాల్ చేతిలో ఓటమిపాలైంది. ఇక రెండోరోజు తెలంగాణ జట్టు ఐదు మ్యాచ్‌లలో ఆడింది. పురుషుల విభాగంలో తెలంగాణ 46-19 స్కోరుతో ఛత్తీస్‌గఢ్‌ను ఓడించింది. అయితే తమిళనాడు చేతిలో 23-35 స్కోరుతో ఓడింది. బిహార్‌తో జరిగిన మ్యాచ్‌ను మాత్రం 32-32తో టై చేసుకోగలిగింది. ఇక మహిళల విభాగంలో తెలంగాణ జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలైంది. తొలుత పశ్చిమ బెంగాల్ 42-27తో, అనంతరం ఉత్తరప్రదేశ్ జట్టు 38-16తో తెలంగాణ జట్లను ఓడించాయి. ఇతర మ్యాచ్‌లలో కర్నాటక 75-9తో విదర్భపై, కేరళ 49-35తో ఒడిషాపై, గుజరాత్ 48-26తో జమ్ము-కశ్మీర్‌పై, ఢిల్లీ 55-32తో జార్ఖండ్‌పై, ఉత్తరప్రదేశ్ 48-17తో బీఎస్ఎన్ఎల్‌పై, రాజస్థాన్ 42-38తో ఢిల్లీపై, మధ్యప్రదేశ్ 56-17తో త్రిపురపై, ఉత్తరప్రదేశ్ 38-17తో మణిపూర్‌పై, హర్యానా 42-22 స్కోరుతో కేరళపై గెలుపొందాయి.



విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం క్రికెట్ నెట్స్‌ను ప్రారంభిస్తున్న శాప్ వైస్‌చైర్మన్ బంగార్రాజు. చిత్రంలో ఎమ్మెల్సే ప్రసాద్

ఫిట్‌నెస్సే ప్రధానం

(రోహన్ బోపన్న)

గతేడాది నాకెంతో ప్రత్యేకమైనది. ఫ్రెంచ్ ఓపెన్‌తో నా కెరీర్‌లో తొలి గ్రాండ్‌శ్లామ్ టైటిల్‌ను గెలిచాను. అయితే ఆటలో నా భాగస్వామిని తరచూ మార్చుకోవాల్సి వచ్చింది. గతేడాది ఏటీపీ వరల్డ్ టూర్ టోర్నీల్లో వివిధ భాగస్వాములతో ఫైనల్స్‌కు చేరాను. కొన్ని వారాలుగా బెంగళూరులో జీవన్‌తో కలిసి ప్రాక్టీస్ చేస్తున్నాను. శిక్షణ ఎంతో కఠినంగా సాగుతోంది. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడమేకాక సీజన్ మొత్తం రాణించే విధంగా ఈ శిక్షణ కార్యక్రమం రూపొందించారు. కొన్నిసార్లు గెలవచ్చు, కొన్నిసార్లు ఓడొచ్చు. ఏడాది పొడవునా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ నిరంతరం ఆటను ఆస్వాదించడమే నిజమైన టెన్నిస్. పుణెకు రావడం సొంత ఇంటికి వచ్చినట్టుంది. 1994 నుంచి ఐదేళ్లపాటు ఇక్కడ ఉన్నాను. ఈ నగరంతో నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయి. ఇండియా ఓపెన్‌ను చెన్నైనుంచి ఇక్కడకు బదలాయించడం ముదావహం. ఇప్పుడు జరుగుతున్న మహారాష్ట్ర ఓపెన్‌లో జీవన్‌తో కలిసి డబుల్స్‌లో ఆడుతున్నాను. ఇక్కడ టైటిల్ నెగ్గుతామన్న విశ్వాసముంది.

S & D

మాతృభాషలో సైన్స్ బోధన!



- యువతలో ఆసక్తి పెంచేందుకు ఇదే మార్గం
- నవ భారతం కోసం కొత్త ఆవిష్కరణలు
- మన సైంటిస్టులు మన జాతిగౌరవం: మోదీ

కోల్‌కతా, జనవరి 1: సైన్స్‌ను పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నా.. యువతలో దానిపై ప్రేమ పెంచాలన్నా.. మాతృభాషలోనే దానిని నేర్పాలని ప్రధాని మోదీ భారత శాస్త్రవేత్తలను కోరారు. భాష అడ్డుగోడగా నిలువరాదని.. శాస్త్రాన్ని సరళతరంగా నేర్పేదిగా ఉండాలని హితవు పలికారు. దేశంలోని ప్రతి శాస్త్రవేత్త, పరిశోధకుడు.. నవభారతం కోసం కొత్త ఆవిష్కరణలు, నూతన పరిశోధనలు చేయాలని ఆకాంక్షించారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొఫెసర్ సత్యేంద్రనాథ్ బోస్ 125వ జయంతిని పురస్కరించుకుని సోమవారం కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రధాని ప్రసంగించారు. బెంగాలీలో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన.. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు తమ విజ్ఞానాన్ని, పరిశోధనలను ప్రజా ప్రయోజనం కోసం, ప్రజల సామాజిక-ఆర్థిక అవసరాల కోసం వినియోగించాలని కోరారు. ప్రతి శాస్త్రవేత్త కనీసం ఒక పిల్లవాడికైనా గురువుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను 'జాతిగౌరవం'గా అభివర్ణించారు. 'భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వంద ఉపగ్రహాలను ఒకేదఫా రోదసిలోకి పంపడంతో యావత్ ప్రపంచం దాని గొప్పతనాన్ని గ్రహించింది. నీరు, విద్యుత్, విమానాశ్రయాలు, రోడ్లు, డిజిటల్ మౌలిక వసతుల కల్పనలో కొత్త ఆవిష్కరణల కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం మీకు దన్నుగా ఉంటుంది. కానీ ఏ ఆవిష్కరణ అయినా సముచిత ప్రణాళిక ప్రకారం జరగాలి' అన్నారు.

కేసీఆర్ పాలన భేష్

- అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్నారు!
- టీఆర్ఎస్ ప్రభుత్వం బాగా పనిచేస్తోంది
- 24 గంటల విద్యుత్తు ఆశ్చర్యాన్ని కలిగించింది
- పవన్ కల్యాణ్ వెల్లడి.. కేసీఆర్‌తో భేటీ

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో నాకు అభిమానులున్నారు. నా బలం నాకు ఉంది. టీఆర్ఎస్ ప్రభుత్వం బాగా పనిచేస్తోందని నేను నా అభిమానులకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు" అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. "రాష్ట్రం విడిపోతే తెలంగాణ అంధకారం అవుతుందన్నారు. కానీ, 24 గంటల పాటు నిరంతరాయంగా రైతులకు విద్యుత్తు అందిస్తున్నారు. పొద్దున పత్రికల్లో చూస్తే ఆశ్చర్యమేసింది. అంతపెద్ద టాస్క్ ఎలా సాధ్యమైందో తెలుసుకుందామనే సీఎం కేసీఆర్‌ని కలిసేందుకు వచ్చా" అని పవన్ విలేకరులకు చెప్పారు. అసాధ్యం అనుకున్న ఎన్నో అంశాలను కేసీఆర్ సుసాధ్యం చేస్తున్నారని కొనియాడారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రగతి భవన్‌లో కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇద్దరూ అరగంట ఏకాంతంగా భేటీ అయ్యారు. అనంతరం భోజనం చేశారు. రెండు గంటలపాటు పవన్ ప్రగతిభవన్‌లో ఉన్నారు. గతంలో ఆయన ఒకసారి కాపు సమస్యపై చర్చించేందుకు సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ అడిగినట్లు తెలిసింది. కానీ, వారి మధ్య అప్పుడు భేటీ కుదరలేదు. ఇటీవల రాజ్‌భవన్‌లో కేసీఆర్, పవన్ పరస్పరం ఎదురుపడినప్పుడు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. తాజాగా పవన్ ప్రగతి భవన్‌లో అడుగుపెట్టడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



సంక్రాంతికి 'విడుదల'

'బాబా' గుర్తే పార్టీ చిహ్నం!.. సభ్యత్వ నమోదుకు వెబ్‌సైట్

చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'రాజకీయాల్లోకి రావడం తథ్యం' అంటూ ఇరవైయేళ్ల అనిశ్చితికి తెరదించిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్....పార్టీ ఏర్పాటు దిశగా వేగంగా కదులుతున్నారు. సంక్రాంతి పర్వదినానే పార్టీ ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారు. దీనిని రజనీ సోదరుడు సత్యనారాయణరావు కూడా ధ్రువీకరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "2019లో జరగబోయే ఎన్నికల్లో రజనీ అభిమాన సంఘాల తరఫున అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను బరిలో నిలుపుతాం. కొత్త పార్టీ, గుర్తు, సిద్ధాంతాలను త్వరలోనే వెల్లడిస్తాం. సంక్రాంతి రోజున రజనీ తన పార్టీ పేరును, చిహ్నాన్ని ఆవిష్కరించే అవకాశముంది" అని తెలిపారు. రాజకీయాల్లో తిరుగులేని విజయాలు సాధించి, ప్రజలకు మెరుగైన సేవలందించే సత్తా తన సోదరుడికి ఉందని సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు.

'బాబా' చిహ్నం..

సుమారు రెండు దశాబ్దాలుగా ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి కనబరుస్తున్న రజనీకాంత్.. తన పార్టీకి కూడా ఆధ్యాత్మిక వాసనలు అద్దే సూచనలు కనిపిస్తున్నాయి. రజనీ పార్టీ చిహ్నంగా 'బాబా' చిత్రంలో ఆయన చూపించిన గుర్తునే పెట్టే అవకాశముందని విశ్వసనీయ సమాచారం. కుడి చేతి చిటికెన, చూపుడు వేళ్లు తెరచి, మిగిలిన వేళ్లు మడిచి ఉండే చేతిచిహ్నం... కమలం నుంచి ఆవిర్భవించినట్లుగా ఉంటుంది.

కొత్త వెబ్‌సైట్ ప్రారంభం...

పార్టీ సభ్యత్వ నమోదు కోసం కొత్త వెబ్‌సైట్‌ను కొత్త సంవత్సరం తొలి రోజున రజనీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ట్విట్టర్‌లో ఒక వీడియో విడుదల చేశారు. "రిజిస్టర్ అయిన అభిమాన సంఘాలు, రిజిస్టర్ కాని సంఘాల అభిమానులు, మార్పు కోసం ఎదురుచూస్తున్న ప్రజల నుంచి సభ్యత్వ నమోదును ఆహ్వానిస్తున్నాం" అని తెలిపారు. www.rajini-mandram.org వెబ్‌సైట్‌లో పేరు, ఓటరు గుర్తింపు కార్డు నెంబరును నమోదు చేసి సభ్యులుగా చేరవచ్చన్నారు.



'బాబా' చిహ్నం చూపిస్తున్న రజనీ

రజనీ మా వాడే: బీజేపీ

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రజనీ పార్టీ ఎన్డీయేలో భాగస్వామిగా ఉంటుందని బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. తమ పార్టీ నేతలతో రజనీకి సన్నిహిత సంబంధాలున్నాయని ఆమె గుర్తు చేశారు. బీజేపీతో రజనీ మైత్రీబంధంపై విపక్ష డీఎంకే భిన్నంగా స్పందించింది. బీజేపీ ఏం చేసిందని ఆ పార్టీ ఇక్కడ పాగా వేయాలనుకుంటుందో అర్థం కావడం లేదని డీఎంకే ప్రతినిధి శరవణన్ వ్యాఖ్యానించారు. బీజేపీతో పొత్తుపై రజనీకాంతే స్పష్టత ఇవ్వాలన్నారు. కాగా, రజనీతో కలిసి ప్రయాణం చేయనున్నట్లు తమిళ రచయిత తమిళరువి మణియన్ ప్రకటించారు.

మా సొమ్ముతో 'ఉగ్ర' పోషణా?

33 బిలియన్ డాలర్లిచ్చి వెర్రి వెంగళప్పలయ్యాం... అమెరికన్లను చంపే తాలిబన్లకు ఆశ్రయమిస్తారా?

- పాకిస్థాన్ పచ్చి మోసకారి
- నిప్పులు చెరిగిన ట్రంప్



వాషింగ్టన్, జనవరి 1: అమెరికాకు ఇన్నేళ్ళ తర్వాత జ్ఞానోదయమైనట్లుంది... పదిహేనేళ్ళ పాటు పాకిస్థాన్‌కు భారీగా సాయం చేసి అవివేకులమయ్యామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. "ఇప్పటిదాకా పాకిస్థాన్‌కు 33 బిలియన్ డాలర్లు సాయంగా ఇచ్చాం. సైనిక పరంగానే కాదు, అభివృద్ధి కోసం, మానవత రూపేణా కూడా ఇచ్చాం. కానీ వారు ఆ సొమ్ముతో ఉగ్రవాదులను పెంచి పోషించారు. దేశాన్ని ఉగ్రవాదానికి స్వర్గధామంగా మార్చారు. మేం ప్రశ్నించినపుడు అన్నీ అబద్ధాలే చెప్పారు. ఇంత సాయానికి పాక్ నుంచి దక్కినది అబద్ధాలు, మోసాలు.. పాక్ మమ్మల్ని వెర్రివాళ్ళుగా జమకట్టింది. మోసం చేసింది. ఇక నుంచి పాక్‌కు ఇచ్చే సాయంలో భారీగా కోత విధించాలని నిర్ణయించాం" అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు ట్రంప్. 2018లో ట్రంప్ చేసిన తొలి ట్వీట్ ఇదే. "అఫ్గానిస్థాన్‌లో ఏ ఉగ్రవాదులనైతే మేం వేటాడామో అదే టెర్రరిస్టులకు పాక్ ఆశ్రయమిచ్చింది. వారు సుఖంగా జీవించడానికి అవకాశమిచ్చింది. ఇక చాలు.. కోత పెడ్తున్నాం" అని ఆయన దక్షిణాసియా పట్ల అనుసరించదల్చిన విధానంపై చేసిన ప్రసంగంలో కూడా తేల్చిచెప్పారు. పాక్‌కు 255 మిలియన్ డాలర్ల రుణాన్ని అమెరికా గతంలో వాగ్దానం చేసింది. దాన్ని ఇపుడు నిలుపుదల చేసింది. చాలా మార్లు పాక్ టెర్రర్ మూకలకు సాయపడింది.. వాటికి సురక్షిత కేంద్రంగా మారింది. అని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. "కోట్ల డాలర్లు పాక్‌కు కుమ్మరించాం. ఉగ్రవాదంపై మా పోరాటంతో కలిసి రమ్మన్నాం. కానీ వారు చేసిందేమిటి? మాతో సహకరిస్తే పాక్‌కు కూడా లాభపడుతుంది. క్రిమినల్స్‌తో కూడితే నష్టపోతుంది. అఫ్గానిస్తాన్‌లో మా పోరాటం ఎంతో వ్యయప్రయాసలకు, ప్రాణత్యాగానికి సంబంధించినది. తాలిబాన్లతో మేం పోరాడుతుంటే మా నుంచి సాయం అందుకున్న పాక్- అదే తాలిబన్‌కు ఆశ్రయమిస్తోంది. అంటే ఓ రకంగా అమెరికన్లను చంపడానికి పాక్ సహకరిస్తోంది. ఇంకా మౌనంగా ఉండలేం. ఈ పరిస్థితి మారాలి.. తక్షణం మారాలి..దక్షిణాసియాకే ప్రమాదకారిగా పరిణమించిన ఉగ్రవాదులు తలదాచుకునేందుకు ఆశ్రయమివ్వడాన్ని తక్షణం నిలిపేయాలి. నాగరికతకు, మానవ జీవన పద్ధతికి, శాంతికి తాము కట్టుబడి ఉన్నట్లు పాక్ నిరూపించుకోవాలి.. ప్రపంచదేశాలతో మమేకం కావాలి. మా సైనికుల్ని, ఆఫీసర్లను చంపుతున్న వర్గాలకే సాయపడడం అసాధ్యం" అని చాలా స్పష్టంగా తేల్చిచెప్పేశారు ట్రంప్.

సయీద్ సంస్థల విరాళాలపై నిషేధం



ఇస్లామాబాద్: డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన డోసు పాకిస్థాన్‌కు చాలా గట్టిగా తగిలింది. సాయం పొందడానికి కొత్త నాటకం మొదలెట్టింది. ఉగ్రవాద నేత, జమాత్-ఉద్-దావా (జేయూడీ) అధిపతి హఫీజ్ సయీద్‌కు చెందిన సంస్థలు విరాళాలు సేకరించకుండా నిషేధం విధించింది. నిషేధంపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి కమిషన్ ఆఫ్ పాకిస్థాన్ (ఎస్ఈసీపీ) ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఆంక్షల జాబితాలో ఉన్న జేయూడీతో పాటు దాని మాతృసంస్థ లష్కరే తయిబాను, మరో రెండు సంస్థలనూ నిషేధించింది. ఇవి కాశ్మీర్ స్వతంత్ర్య పోరాటానికి మద్దతుగా విరాళాలు సేకరిస్తున్నాయని డాన్ పత్రిక తెలిపింది. తమ నిర్ణయాలను పాక్ సర్కార్- అమెరికాకు తెలియపర్చింది. జేయూడీ మరింతగా విస్తరించకుండా కట్టడి చేస్తామనీ వాగ్దానం చేసింది. అయితే వీటిని అమెరికా ఎంత వరకూ విశ్వసిస్తుందనేది ప్రశ్నార్థకమే.. ఎందుకంటే పాక్‌లో సయీద్ నెట్‌వర్క్, తాలిబన్ అనుకూల గ్రూపులు పాతుకుపోయి ఉన్నాయి. వాటిని పెకలించడం పాక్ తరం కాదని అమెరికాకు తెలుసు.

లష్కరే, జేయూడీ సభ్యులు దేశ భక్తులు: ముషార్రఫ్



ఓ పక్క ప్రపంచమంతా హఫీజ్ సయీద్ ను, అతని పార్టీ జమాత్-ఉద్-దవా సభ్యులను ఉగ్రవాదులుగా పేర్కొంటుంటే- పాక్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషార్రఫ్ మాత్రం వారు పరమ దేశభక్తులని కీర్తిస్తున్నారు. 'కుల్‌భూషణ్ జాదవ్ భారత గూఢచారి అనే విషయాన్ని భారత్ ఒప్పుకోవడం లేదు. అలాంటపుడు లష్కరే తోయిబాను దాని అనుబంధ సంస్థ జమాత్-ఉద్-దవానూ ఉగ్రవాద సంస్థలనే భారత ఆరోపణలను మేమెలా అంగీకరిస్తాం? వాస్తవానికి ఈ రెండు సంస్థల సభ్యులు గొప్ప దేశభక్తులు. పాకిస్థాన్ కోసం కశ్మీర్‌లో వారు ప్రాణాలు కోల్పోయారు' అని ముషార్రఫ్ వ్యాఖ్యానించారు.



నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31న రాత్రి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుల నుంచి స్వాధీనం చేసుకున్న కార్లు ఇవి.. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ ముందు వీటిని వరుసగా ఉంచారు.



డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ప్రదీప్

'నూతనం'.. విషాదం!

(మూడో పేజీ తరువాయి)

మృతిచెందారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి కేక్ కట్‌చేసి ఆనందంగా చలిమంట ముందు కూర్చున్న వీరిని వేంపల్లె నుంచి కడప వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. మరో ఘటనలో, కొత్త సంవత్సరం వేడుకల కోసం కేక్ తీసుకు రావడానికి వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామానికి చెందిన ఎలకల వెంకటేశ్(19), ఎలకల ఈశ్వర రావు(18) వరసకు అన్నదమ్ములు. వీరిద్దరూ ఆదివారం రాత్రి కేక్ తీసుకురావడానికి మోటారు బైక్‌పై చీపురుపల్లి బయల్దేరారు. తోటపల్లి కాలువ సమీపంలో వీరి బైక్‌ను ఓ ఆటో బలంగా ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కాగా, రోడ్డు పక్కన ఆగి ఉన్న ఎక్స్‌కవేటర్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా(తెలంగాణ) వాసులు ఐదుగురు పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు కారులో బయల్దేరారు. తిరుమల నుంచి శ్రీశైలం వెళ్తుండగా, దారిలో కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఎక్స్‌కవేటర్‌ను వీరి కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాథోడ్(24), వన్నడ ప్రవీణ్ కుమార్ గౌడ్(25) మృతిచెందారు. అలాగే, స్నేహితులతో కలసి నూతన సంవత్సర వేడుకలకు వెళ్లిన ఓ యువ రైతు హత్యకు గురయ్యాడు. ఆదివారం రాత్రి పొలంలో ఏర్పాటు చేసిన వేడుకలకు వెళ్లిన అనంతపురం జిల్లా సోమందేపల్లికి చెందిన నరసింహమూర్తి (25), రక్తపు మడుగులో కనిపించాడు. ఇదిలా ఉండగా, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ లైటింగ్ ప్రభావంతో విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం వెంకంపేట పంచాయతీ పరిధిలోని సురేష్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు 200మంది కళ్ల మంటలతో ఇబ్బంది పడ్డారు. వీరు కోలుకోవడానికి 2రోజులు పడుతుందని, విపరీతమైన వెలుగు కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని చికిత్స అందించిన కంటి వైద్య నిపుణులు తెలిపారు.

కర్ణాటకలో ఐదుగురు...

కర్ణాటకలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. చౌడనకుప్పకు చెందిన సిద్దూజీరావ్(60) కొత్త కారు కొన్నారు. దానికి పూజలు చేయించడానికి కుటుంబ సభ్యులతో కలసి కొరటగెరెకు బయల్దేరారు. తుమకూరు జిల్లా కుణిగల్ సమీపంలో రోడ్డు దాటుతున్న ఓ చిన్నారిని తప్పించే యత్నంలో వీరి కారు అదుపుతప్పి బోల్తాపడి, ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో సిద్దూజీరావ్‌తో పాటు ఉషాబాయి(35), కీర్తన(7), హితేశ్(3), భవన(16) మృతిచెందారు.

రాతిరంత జాతర

- డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కిన యాంకర్ ప్రదీప్
- 3 కమిషరేట్లలో 2400కుపైగా కేసులు
- ఏపీలో 60 వాహనాలు సీజ్

హైదరాబాద్, జనవరి 1: తాగి ఊగారు..ఊగి తాగారు..న్యూ ఇయర్ జోష్‌లో మునిగి తేలారు. మద్యం మత్తులో రాతిరంతా జాతర చేశారు. చివరకు డ్రంకెన్ డ్రైవ్‌లో ఎంతోమంది యువకులు అడ్డంగా దొరికిపోయారు. ఆదివారం అర్ధరాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో నటుడు, యాంకర్ ప్రదీప్ పోలీసులకు చిక్కాడు. మాదాపూర్‌లో ఓ పార్టీలో పాల్గొన్న ప్రదీప్.. మద్యం సేవించి కారు నడుపుతూ.. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 45 దగ్గర నిర్వహించిన తనిఖీల్లో దొరికిపోయాడు. ప్రదీప్ బీఎండబ్ల్యూ కారును సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో జరిగిన డ్రంకెన్ డ్రైవ్‌లలో..2400కుపైగా కేసులు నమోదయ్యాయి. తనిఖీల్లో సీజ్ చేసిన ఖరీదైన కార్లతో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ రోడ్డు నిండిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో 60 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.

100 కోట్లు.. తాగేశారు!

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): "డిసెంబరు 31, మందుబాబుల దినోత్సవం!" ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన జోక్ ఇది. కానీ, ఇది జోక్ కాదని నిజమేనని నిరూపించారు మద్యం ప్రియులు. 2018 న్యూయర్ సందర్భంగా డిసెంబరు 31న రాష్ట్రంలో రూ.100 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. గత కొన్ని రోజుల మద్యం దిగుమతులను పరిశీలిస్తే ఈమేరకు విక్రయాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. డిసెంబరు 30, 31 తేదీల్లో మద్యం దుకాణాల లైసెన్సీలు, బార్ల యాజమాన్యాలు రూ.153 కోట్ల మద్యాన్ని దిగుమతి చేసుకున్నాయి. దాంతోపాటు అంతకుముందూ షాపుల్లో మద్యం నిల్వలు ఉన్నాయి. దీనిని బట్టి డిసెంబరు 31న సుమారు రూ.100 కోట్ల అమ్మకాలు జరిగి ఉంటాయని అంచనా వేశారు. అయితే, గత 2016వ సంవత్సరం చివరి రెండు రోజుల్లో షాపులు దిగుమతి చేసుకున్న మద్యం కంటే ఈ ఏడాది తగ్గడం విశేషం. 2016 డిసెంబరు 30, 31 తేదీల్లో షాపులు దిగుమతి చేసుకున్న మద్యం రూ.162 కోట్లు ఉండగా 2017లో రూ.153 కోట్లు మాత్రమే. ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకుంటే డిసెంబరు 31న రాత్రి వంద కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని అంచనాకు వచ్చారు. మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగేది విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లోనే. అయితే, న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఈసారి రాజధాని అమరావతి ప్రాంతంలో విక్రయాలు భారీగా జరిగాయి. కాగా, సందట్లో సడేమియా మాదిరిగా దుకాణదారులు ఎమ్మార్పీని ఉల్లఘించి బాటిల్‌పై రూ.20 నుంచి 50 వసూలు చేశారు.

డిసెంబరులో చివరి 4 రోజుల దిగుమతి

రోజు	లిక్కర్ కేసులు	బీరు కేసులు	విలువ కోట్లు
డిసెంబరు 28	120727	67752	63
డిసెంబరు 29	136327	75568	73
డిసెంబరు 30	193248	103158	103
డిసెంబరు 31	89055	57282	50

'పుల్వామా' హంతకుల్లో పదో తరగతి విద్యార్థి!

- ఉగ్రదాడిలో పాల్గొన్న 16ఏళ్ల కుర్రాడు



న్యూఢిల్లీ, జనవరి 1: కశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ శిబిరంలోకి చొరబడి, జవాన్లను కాల్చిచంపిన ఉగ్రవాదుల్లో చివరి మిలిటెంట్‌ను ఎట్టకేలకు భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఆదివారం తెల్లవారుజామున మొదలైన ఈ ఎన్‌కౌంటర్ సోమవారం సాయంత్రానికి ముగిసింది. మృతి చెందిన ముగ్గురు ఉగ్రవాదుల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఉండటం భద్రతా బలగాలను కలవరపరుస్తోంది. ఈ దాడికి ముందు ఖండే మాట్లాడిన 8 నిమిషాల వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. 'దేవుని ఇచ్ఛ మేరకు నడుచుకొంటున్నాను. మీరు ఈ వీడియో చూసే సమయానికి స్వర్గంలో భగవంతుని రాజ్యానికి కాపలా కాస్తుంటాను" అని ఆ వీడియోలో ఖండే పేర్కొన్నారు.

పొగమంచుతో.. ఢిల్లీలో విమానాలు ఆలస్యం

న్యూఢిల్లీ, జనవరి 1: పొగమంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో వరసగా రెండోరోజూ పలు విమానాలు రద్దవ్వగా, మిగతా విమానాల రాకపోకల్లో ఆలస్యం చోటుచేసుకుంది. సోమవారం 8 విమానాలను రద్దు చేశామని, 265 దేశీయ, 67 అంతర్జాతీయ గమ్యాలకు చేరే విమానాలు ఆలస్యంగా నడిచాయని అధికారులు తెలిపారు. మరోవైపు ఉత్తరాదిలో పొగమంచు కారణంగా 400 రైళ్లు ఆలస్యంగా నడిచాయని, 15 రైళ్లను రద్దు చేశామని భారత రైల్వే అధికారులు తెలిపారు.

కమలం గూటికి ఇష్రత్ జహాన్

న్యూఢిల్లీ, జనవరి 1: తక్షణ ట్రిపుల్ తలాక్ రద్దు కోరుతూ సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేసిన ఇష్రత్ జహాన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇష్రత్.. ఆదివారం బీజేపీలో చేరినట్టు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి సయంతన్ బసు సోమవారం వెల్లడించారు. హౌరాలోని పార్టీ కార్యాయానికి వచ్చిన ఆమె బీజేపీ సభ్యత్వం తీసుకుని పార్టీలో చేరారని తెలిపారు.

బెంగళూరులో రెచ్చిపోయిన పోకిరీలు

బెంగళూరు, జనవరి 1: కొత్త ఏడాది సందట్లో పోకిరీలు మరోమారు రెచ్చిపోయారు. అమ్మాయిల మీదపడి వికృత చేష్టలు చేశారు. తన భార్య కూడా బాధితురాలిగా మారిందని ఒక వ్యక్తి తెలిపారు. "బ్రిగేడ్ రోడ్ సర్కిల్ సమీపంలో... న్యూ ఇయర్‌కు కౌంట్‌డౌన్ మొదలుకాగానే కుర్రాళ్లు అదుపుతప్పారు. అక్కడున్న యువతుల మీదపడ్డారు. వారి దుస్తులు లాగేందుకు ప్రయత్నించారు. వారి దుస్తుల్లోపల చేతులు పెట్టాలని చూశారు. నా భార్యను కూడా ఇబ్బంది పెట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా... ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ పంపించేశారు" అని ఆ వ్యక్తి తెలిపారు. బ్రిగేడ్ రోడ్, ఎంజీ రోడ్‌లో గత ఏడాది కూడా ఘోరాలు జరిగాయి.

వాట్సాప్.. హ్యాండ్సప్!

WhatsApp

- సందేశాల వెల్లువతో చేతులెత్తేసిన యాప్
- కొత్త ఏడాది మొదటి గంట అంతరాయం

న్యూఢిల్లీ, జనవరి 1: కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టిన క్షణంలో ఒక్కసారిగా వెల్లువెత్తిన శుభాకాంక్షల ధాటికి ప్రఖ్యాత మేసేజింగ్ యాప్ వాట్సాప్ అంతరాయంతో చేతులెత్తేసింది. 2017 డిసెంబరు 31 అర్ధరాత్రి 12 గంటల సమయంలో వెల్లువలా వచ్చిన సందేశాల ట్రాఫిక్ దెబ్బకు గంటపాటు వాట్సాప్ సర్వర్ డౌన్ అయింది. రాత్రి 1 గంట తర్వాత మళ్లీ యథాస్థితికి వచ్చింది. ఒక్క భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లోనూ ఈ పరిస్థితి ఏర్పడింది. అయితే కొత్తఏడాది ఆరంభంలో వినియోగదారులకు కలిగిన అసౌకర్యానికి వాట్సాప్ సంస్థ క్షమాపణలు కోరింది. ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల వాట్సాప్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అయితే ఈ సమస్యను పరిష్కరించి సేవలు పునరుద్ధరించామని సంస్థ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. టెక్స్ట్ మెజేస్‌లు, ఫొటోలతోపాటు ఎంత నిడివి ఉన్న వీడియోలనైనా సులువుగా చేరవేసే వాట్సాప్‌ను భారత్‌లోనే సుమారు 20 కోట్ల మంది వినియోగిస్తున్నారు.



ఫ్లోరిడా కీస్ దీవుల్లోని కీవెస్ట్‌లో నూతన సంవత్సరాన్ని ఇలా వినూత్నంగా ఆహ్వానించారు. 8 అడుగుల పొడవు, 4 అడుగుల ఎత్తు మడమ ఉన్న ఎర్రని బూటుపై 'సుశి' భువికి దిగి వచ్చింది! 11 గంటల నుంచి కొద్దికొద్దిగా కిందికి దించుతూ 12 గంటలు కొట్టేసరికి ఈ బూటును భూమిపైకి చేర్చి కొత్త ఏడాదిని స్వాగతిస్తారు. 'సుశి' వేషంలో ఉన్నది గ్యారీ మారియన్ అనే పురుషుడంటే ఎవరూ నమ్మరు కదూ? అదే ఈ వేడుకలో విశేషం. 1996 నుంచీ అక్కడి ప్రజలు ఏటా ఇలాగే కొత్త ఏడాదిని ఎంతో సందడిగా ఆరంభిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

S & D

ఆంధ్రజ్యోతి

1

నవ్య

కుటుంబ కదంబం

మంగళవారం • 2 జనవరి 2018

ట్రెండ్

హరీస్... చలికాలం హాట్ ఫేవరెట్!



శీతాకాలం ఒంట్లో చలి బయటికి పోవాలంటే వేడివేడిగా ఏదైనా లోపల పడాల్సిందే. చలికాలం వచ్చిందంటే హైదరాబాద్‌లోని బార్కాస్, మల్లేపల్లి ఏరియాల్లో 'హరీస్'కు బాగా డిమాండ్ ఉంటుంది. ఉదయమే కొన్ని హోటళ్లలో మాత్రమే దొరికే 'హరీస్'ను తినేందుకు జనం క్యూలు కడతారు. చూడటానికి అచ్చంగా హలీమ్‌లాగే కనిపించినప్పటికీ 'హరీస్' భిన్నమైన ఫుడ్. అరబ్ దేశాల నుంచి దిగుమతి అయిన ఈ ఫుడ్ నెయ్యి, మటన్, వివిధరకాల ధాన్యాల కలయికతో తయారవుతుంది. దీని గురించి 10వ శతాబ్దంలోనే బాగ్దాద్ రచయిత సయ్యర్ అల్ వరఖ్ 'కితాబ్ అల్ తాబిఖ్' (ది బుక్ ఆఫ్ డిషెస్)లో ప్రస్తావించారు.

'హరీస్' తయారీ కూడా దాదాపుగా 'హలీమ్' తయారీలాగే ఉంటుంది. అయితే హలీమ్ రంజాన్‌లో దొరికితే, 'హరీస్' చలికాలంలో మాత్రమే లభిస్తుంది. "ఇది టేస్టీగా ఉండటమే కాదు... బలవర్ధకమైనది కూడా. ఇందులో చాలా పోషకాలుంటాయి. స్వచ్ఛమైన నెయ్యితో పాటు డ్రైఫ్రూట్స్‌ను కూడా మిక్స్ చేస్తారు. శరీరానికి వెచ్చదనం కోసం చలికాలంలో దీన్ని తీసుకుంటారు" అని బార్కాస్ బజార్‌లో కొన్నేళ్లుగా హరీస్‌ను అమ్ముతున్న హోటల్ యజమాని కైసర్ అంటున్నారు. ఉదయం ఐదుగంటలకే మొదలయ్యే 'హరీస్' అమ్మకాలు మూడుగంటల్లోనే ముగుస్తాయి. బోన్స్ లేకుండా మెత్తగా పేస్టులా ఉండే ఈ ఆహారం రెండు రకాలుగా ఉంటుంది. వాటిలో ఒకటి స్పైసీ, మరొకటి స్వీట్. తొలుత పాతబస్తీ చుట్టుపక్కల నుంచే 'హరీస్'ను తినేందుకు ఉదయమే బార్కాస్‌కు వెళ్లేవారు. కానీ దీని రుచి తెలిసిన వాళ్లంతా ప్రస్తుతం అక్కడికి వెళ్లి వేడివేడిగా లాగిస్తూ 'ఆహా... హరీస్' అంటున్నారు.

ప్రతిభ



ఆమె
మువ్వల సవ్వడి నుంచి జాలు
వారిన 'లకుమ', 'రాణి రుద్రమ'
తెలుగునాట నృత్యలోగిలిలో ప్రత్యేకమైనవి.
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నృత్య
బోధకురాలిగా అనేకమందికి నృత్యశిక్షణ ఇచ్చారు.
ఇప్పుడు అదే యూనివర్శిటీలో రిజిస్ట్రార్ హోదాని
అలంకరించిన తొలి మహిళ అలేఖ్య పుంజాల. ఓ వైపు
నృత్య బోధన... మరో వైపు యూనివర్సిటీ నిర్వహణ
బాధ్యతలు.. ఇంకోవైపు నృత్య ప్రదర్శనలు...
వీటన్నింటితో పాటు గృహిణిగా... జుగల్‌బందీ
చేస్తున్న అలేఖ్య' నవ్య'తో ముచ్చటిం
చారు. ఆ విశేషాలే ఇవి...

అప్పుడు విద్యార్థిని.. ఇప్పుడు రిజిస్ట్రార్ని..

ఇంట్లో ఉన్నప్పుడు గృహిణిగా నా భర్త, పిల్లల బాగోగులు మాత్రమే ఆలోచిస్తాను. విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టగానే బోధకురాలి హోదాలో ఇమిడిపోతాను. ప్రదర్శన సమయంలో వేదికపై నేను కేవలం నృత్యకారిణిని మాత్రమే. అయితే కొన్నిసార్లు విధి పరీక్షలు పెడుతుంటుంది. 'యూనివర్సిటీలో జరిగే ముఖ్యమైన సమావేశాలకు హాజరుకావాల్సి ఉంది. సాయంత్రం వేళ రవీంద్రభారతిలో ప్రదర్శన చేసేందుకు అంగీకరించాను. అదే రోజు మా చిన్నబ్బాయికి జ్వరం... ఆ సమయంలో నేను దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? ఈ పాతికేళ్ల వృత్తిజీవితంలో ఇలాంటి సమస్యలు ఎన్నో ఎదురయ్యాయి. అవి తారసపడుతున్న ప్రతిసారీ ఎదిరించి ముందుకుసాగుతూనే ఉన్నాను. నేనే కాదు, నాలాంటి ఎంతోమంది మహిళలు ఎదుర్కునే సమస్యలే ఇవి. వాటన్నింటినీ వివేచనతో ఎలా దాటుకొని ముందుకెళ్లాలో నృత్యం నాకు నేర్పింది. అందుకే, అదంటే నాకు ప్రాణం. ఎప్పుడు ఏ పని చేయాలన్న దానిపై ఖచ్చితమైన స్పష్టత ఉంటే, మన వృత్తిజీవితానికి, కుటుంబ జీవితానికి న్యాయం చేయగలమని భావిస్తాను. ఏ పనికి ఎంత సమయం ఇవ్వాలి, ఆ సమయంలో దానిపట్ల ఎంత నిబద్ధతతో ఉన్నామన్న విషయాలు చాలా అవసరం. ఆ బాధ్యతలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లడంలోనే ఆనందం ఉందనుకుంటున్నాను. 2017 నవంబర్‌లో తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కొత్త బాధ్యతలను చేపట్టాను. 30 ఏళ్ల విశ్వవిద్యాలయ చరిత్రలో ఆ హోదాను అలంకరించిన తొలి మహిళను నేనే కావడం ఆనందంగా ఉంది. లలిత కళా పీఠం నుంచి ఓ కళాకారిణిగా విశ్వవిద్యాలయ పరిపాలనా బాధ్యతలను చేపట్టే అవకాశం దక్కడం నా అదృష్టం. ప్రస్తుతం లలితకళా పీఠం డీన్ బాధ్యతలనూ నిర్వర్తిస్తున్నాను.

❖ విద్యార్థిగా మొదలై...

తెలుగు విశ్వవిద్యాలయంతో నా అనుబంధం మొదట విద్యార్థిగా మొదలైంది. 1989నాటి మాట.. అప్పటికే 'ప్రాచీన చరిత్ర, కళలు' అనే అంశంపై పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాత ఇంగ్లీషు లిటరేచర్, సైకాలజీలోనూ ఎంఏ చదివాను. మా గురువు ప్రముఖ నాట్యాచార్యులు ఉమారామారావు వద్ద చిన్ననాటి నుంచి నృత్యశిక్షణ తీసుకున్నాను. వారు నాకు కేవలం గురువు మాత్రమే కాదు, ఆత్మీయులు, మార్గనిర్దేశకురాలు కూడా. లలితకళాపీఠం విభాగాధిపతిగా వ్యవహరిస్తున్న ఉమారామారావు ప్రోత్సాహంతో తెలుగు విశ్వవిద్యాలయం, ఎంఏ కూచిపూడిలో చేరాను. కొద్దిరోజుల తర్వాత యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు ఖాళీలున్నాయని ప్రకటన వెలువడింది. ఆత్మీయుల సలహాతో దరఖాస్తు చేశాను. ఆ విషయం తెలిసిన అప్పటి వీసీ సి.నారాయణరెడ్డిగారు "ఏంటి.! అలేఖ్య అప్లై చేసిందా" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారట.! అలా 1990లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా యూనివర్సిటీతో నా ప్రయాణం ప్రారంభమైంది. ఓ విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తాననిగానీ, ఆ తర్వాత పలు బాధ్యతలు చేపడతాననిగానీ ఎన్నడూ ఊహకందని విషయమే. పెళ్లైన తర్వాత కొద్దిరోజులు నృత్యానికి దూరంగా ఉన్నాను. అలాంటిది, నా కుటుంబం, గురువు ప్రోత్సాహంతో మళ్లీ నాకిష్టమైన రంగంలో ప్రవేశించడం నాకు దక్కిన గొప్ప అవకాశం. నాకు అత్యంత ఇష్టమైన నృత్య రంగంలోనే నాట్యాచార్యులుగా కొనసాగే అవకాశం దక్కడం గర్వంగా అనిపిస్తుంది. ఎప్పుడూ ఎవర్నీ నాకు ఫలానా హోదా ఇవ్వండి అని అడగలేదు. ఇప్పటివరకూ నాకు వచ్చిన అవకాశాలన్నీ పూర్తిగా నా పనితనం, నిబద్ధత వల్ల పొందినవే.

❖ విధి నిర్వహణ, కర్తవ్యం...

గతంలో నృత్యశాఖ విభాగాధిపతి బాధ్యతలు చేపట్టినా, ఆ తర్వాత టూరిజం స్టడీస్ డైరెక్టరుగా, లలితకళాపీఠం డీన్‌గా.. ఏ హోదాలో ఉన్నా, నన్ను నేను నిరూపించుకునేందుకు ప్రయత్నించాను. ప్రతి ఏటా ప్రపంచ నృత్యోత్సవాలు నిర్వహించడం వంటి పలు కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాను. ఇన్నేళ్ల నా వృత్తి జీవితంలో ఇప్పుడు ఇదొక కొత్త కోణం. నా యూనివర్సిటీకి ప్రత్యేక సేవ చేసుకునే అవకాశం దక్కింది. ఇక్కడున్న ప్రతి విభాగాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలనుకుంటున్నాను. తెలుగు యూనివర్సిటీలోని అన్ని కోర్సులకు తగిన ప్రాచుర్యం కల్పించాలన్నది నా అభిమతం. విలక్షణమైన కోర్సులకు తగిన ప్రాచుర్యం కల్పించి, ఎక్కువ మంది విద్యార్థులు వాటిని అభ్యసించేవిధంగా ప్రణాళికలు రూపొందించాలనుకుంటున్నాను. కళారంగానికి, పరిపాలనా విభాగానికి పొంతన ఉండదని పెద్దలు అంటారు. కానీ స్వతహాగా కళాకారిణైన నేను ఈ బాధ్యతలు చేపట్టడం సవాల్ లాంటిదే. సహజంగా కళాకారులు సున్నితత్వంతో మసులుకుంటారు. సున్నితంగా వ్యవహరించడమన్నది అన్ని సందర్భాల్లో పనికిరాకపోవచ్చు. కానీ నేటి సమాజానికి సున్నితత్వం చాలా అవసరం అని భావిస్తాను. ప్రస్తుతం పది మంది పరిశోధనా విద్యార్థులకు గైడ్‌గా ఉన్నాను. వారిలో ఐదుగురు విద్యార్థులు ఇప్పటికే పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

❖ 'రాణీ రుద్రమ' కూచిపూడి నృత్యరూపకం అనలేదు...

ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఓరుగల్లు వీరవనిత "రాణీరుద్రమ" నృత్యరూపకాన్ని ప్రదర్శించడం ఆనందంగా ఉంది. అదొక అదృష్టంగా కూడా భావిస్తున్నాను. చరిత్రలో స్ఫూర్తిమంతమైన పాత్రపోషించిన మహిళల గురించి తెలుసుకోవాలి, వారి విశిష్టతను భావితరాలకు తెలియజెప్పాలన్నది నా కోరిక. రుద్రమ పోరాట పటిమ, ధైర్యసాహసాల గురించి నృత్యరూపకం ద్వారా ప్రజలకు చెప్పాలన్న కోరిక చాలా ఏళ్ల నుంచి నాలో ఉంది. రాజ్యాన్ని సక్రమంగా నడిపించడంతోపాటు, శత్రుసేనల్ని తిప్పికొట్టడం, రాజ్య క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఓ మాతృమూర్తిగా పాలన సాగించడంలో ప్రధాని భూమిక పోషించిన కాకతీయ వీర వనిత రాణీ రుద్రమ జీవితం నన్ను బాగా ప్రభావితం చేసింది. ఆ క్రమంలో రుద్రమ గురించిన అనేక అంశాలను, వెలుగులోకి వచ్చిన పలు విషయాలను తెలుసుకున్నాను. వాటన్నింటినీ అధ్యయనం చేసి... 'రాణీ రుద్రమ' నృత్యరూపకం రూపొందించాను. మదిలోని ఆలోచన, వేదికపై ఆవిష్కృతమయ్యేందుకు రెండేళ్లు పట్టింది. వేదాంతం రామలింగశాస్త్రి రచన, కృష్ణవాస సంగీత దర్శకత్వంలో 25 మంది కళాకారులతో ఆ నృత్య రూపకాన్ని రూపొందించాను. కళ, రంగాలంకరణ, వస్త్రాలంకరణ వంటి వాటన్నింటినీ పరిశోధన చేసి, సాధ్యమైనంతవరకూ కాకతీయుల సంస్కృతి ప్రతిబింబించే విధంగా రూపొందించాం. నృత్యప్రదర్శనలో భాగంగా, కాకతీయుల చిహ్నా ద్వారాన్ని వేదికపైకి తెచ్చేందుకే పదిమంది కళాకారులు మోయాల్సివచ్చింది. అందులోని ప్రతి సన్నివేశం ఓ ప్రత్యేకమైంది. అదంతా కళాకారుల సమష్టి కృషి ఫలితం. 'రాణీ రుద్రమ' కూచిపూడి నృత్య రూపకం అని నేను ఎక్కడా చెప్పలేదు. నేను అనుకున్న విషయాన్ని అందంగా, ప్రేక్షకులకు ఆసక్తి కలిగించేలా పలు రకాల నృత్యరీతుల సమాహారంతో ఆ నృత్యరూపకాన్ని రూపొందించాను. ఇప్పటి వరకూ 'రాణీ రుద్రమ' దేశవ్యాప్తంగా పది ప్రదర్శనలు ఇచ్చాం. 'లకుమ', 'నాయకి', 'సత్యభామా విలాసం', 'అలిమేలు మంగావిలాసం', 'దుర్గాసుర సంహారం', 'ద్రౌపతి', 'చిత్రకూట మహత్యం', 'ఆండాల్ కళ్యాణం' వంటి పలు పురాణ పాత్రల ఆధారంగా నృత్యప్రదర్శనలు రూపొందించి, ప్రదర్శించే అవకాశం నాకు లభించింది. అందులో విభిన్నమైన పాత్రలు పోషించే అదృష్టం నాకు కలిగింది.

● వెంకటేశ్

ఫొటోలు: రాజేష్ జంపాల, నరసింహ



రుద్రమదేవిగా..

ఇదీ నా కుటుంబం...

నేను పుట్టిపెరిగిందంతా హైదరాబాద్‌లోనే. నా తల్లిదండ్రులు మార్గం నరసింగరావు, సుగుణలు ఎగ్జిబిషన్ సొసైటీ శాశ్వత గౌరవ సభ్యులు కూడా. మా అమ్మ ప్రముఖ రంగస్థల నటులు స్థానం నరసింహారావుగారితో కలిసి రేడియో నాటికలో నటించారు. నేను ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం నా తల్లిదండ్రులు, నా గురువు ఉమారామారావు. నా మెట్టినిల్లు కూడా భాగ్యనగరమే. వారిది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. మామయ్య పుంజాల శివశంకర్ ఇందిరాగాంధీ కేబినేట్‌లో మంత్రిగా పనిచేశారు. నా భర్త వినయ్‌కుమార్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యనిపుణులు. మాకు ఇద్దరు అబ్బాయిలు. పెద్దబ్బాయి శాశ్వత్ రాంశంకర్ న్యాయవాది వృత్తిలో ఉన్నారు. కోడలు సంజన కూడా న్యాయవాది. చిన్నబ్బాయి దేవాన్ష్ కృష్ణశంకర్ అమెరికాలో ఉన్నత విద్యను అభ్య

పలువరుసకు పాలిష్!



గారపట్టిన పళ్లతో నవ్వినప్పుడు, నలుగురిలోకి వెళ్లినప్పుడు ఇబ్బందికరంగా ఉంటుంది. ఇతరులతో కలవలేకపోతారు. పొగాకు ఉత్పత్తులు నమలటం, రంగులతో చేసిన ఆహార పదార్థాలు తినటం, రోజూ పళ్లు తోమకపోవటం, కలుషిత ఆహారాన్ని తీసుకోవటం వంటివి ఈ సమస్యకు కారణాలు. అయితే కొన్ని పద్ధతులను పాటించటం ద్వారా పలువరుసను తెల్లగా మిలమిల మెరిసేలా చేసుకోవచ్చు.

❖ దంతాలు పసుపు రంగులో ఉన్నవాళ్లు, కాఫీ టీలకు బదులు పాలు తాగితే ప్రయోజనం. దంత సంరక్షణకు మార్కెట్లో చాలా ఉత్పత్తులు ఉన్నా వాటి వల్ల నష్టమే ఎక్కువ. పాల లాంటి సహజ ఉత్పత్తులు దంతాలను శుభ్రపరుస్తాయి. ఇందులో ఉండే కాల్షియం దంతాలకు పుష్టినిస్తుంది. పాల ఉత్పత్తులు పళ్లపై ఏర్పడే పసుపు రంగును తొలగిస్తాయి కూడా.

బ్యూటీ

❖ ఉప్పులో సోడియం క్లోరైడ్ అధిక మోతాదులో ఉంటుంది. ఇది పళ్లపైన ఉండే పచ్చదనాన్ని తగ్గిస్తుంది. కొంచెం ఉప్పును టూత్‌పేస్ట్ పైన వేసుకొని పళ్లు తోమితే కొన్ని రోజుల్లోనే దంతాలు తెల్లగా మారతాయి.

❖ నిమ్మ నోటిలో సూక్ష్మజీవులను నిర్మూలించి దంతాలను తెల్లగా చేస్తుంది. ఏదైనా తిన్న వెంటనే నిమ్మతొక్కతో దంతాలను శుభ్రం చేస్తే ప్రయోజనం ఉంటుంది. రోజూ వీలుకాకపోతే కనీసం వారానికోసారి చేసినా దంతాలపై ఉండే పాచి, నోటి దుర్వాసన పోతుంది. అలాగే కొన్ని నీళ్లలో నిమ్మరసం కలిపి రాత్రి భోజనం చేశాక నోరు పుక్కిలించాలి.

❖ పళ్లు తోమేందుకు ఉప్పుకు బదులు బేకింగ్ సోడాను వాడాలి. కొంచెం బేకింగ్ సోడాను బ్రష్ పైన వేసుకోని పండ్లు తోమాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే పసుపు పొర తొలగిపోయి పళ్లు మెరిసిపోతాయి.


పుస్తకాలు చదివించాలంటే..



ఎవరైనా, పూర్తిగా కొత్త విషయానికి సంబంధించిన ఒక పుస్తకాన్ని హఠాత్తుగా చేతిలోకి తీసుకున్నపుడు, అందులోని విషయం ఏ మాత్రం అర్థం కాకపోవచ్చు. పెద్దవారికే ఈ సమస్య ఉంటే, ఇక చిన్న పిల్లల పరిస్థితి ఏమిటి? పిల్లలు సిలబస్ బుక్స్ అయితే ఎలాగూ చదువుతారు. టీచర్ చెప్పిన పాఠాలే కాబట్టి వాటిని అర్థం చేసుకోవడం అంత కష్టమేమీ అనిపించక పోవచ్చు ఒకవేళ అందుకు భిన్నంగా మరేదైనా చదవమని చెప్పారనుకోండి. అది కథల పుస్తకం అయితే తప్ప చాలా సార్లు "నాకేమీ అర్థం కావడం లేదు" అనే చెబుతారు. అదేదో తప్పించుకోవడానికి అనే మాటగా కూడా అనుకోవడానికి లేదు. అందులోని విషయం అప్పటిదాకా వినని, చూడని పూర్తిగా కొత్త విషయం అయినప్పుడు నిజంగానే అర్థం కాకపోవచ్చు. అందుకే ఒక కొత్త పుస్తకాన్ని చదవడం ఎలాగో చెప్పగలిగే శక్తి పేరెంట్స్‌కు ఉండాలి.

పేరెంటచ్

కొత్త విషయానికి సంబంధించిన పుస్తకాన్ని చదవాలనుకున్నప్పుడు ముందుగా కొన్ని పదాలు లేదా పద బంధాలు మాత్రమే అర్థమవుతాయి. రెండవసారి చదివినప్పుడు అక్కడో వాక్యం ఇక్కడో వాక్యం అర్థమవుతాయి మూడవసారి, ఒక్కో పేరాగ్రాఫ్ చొప్పున అర్థమవుతాయి. మొదటిసారి చదవినప్పుడు కలిగిన భయాందోళనలు కనుమరుగవుతాయి. కాకపోతే అలా రెండు మూడు సార్లు చదివే ఓపిక పట్టుదల ఉండాలి. ఆ లక్షణాలు అలవడేలా చిన్నప్పటినుంచే తల్లిదండ్రులు పిల్లలకు చెవిన వేయాలి. అలాంటి పుస్తకాలు జీవితాన్ని ఎలా నిలబెడతాయో, ఎలా ముందుకు నడిపిస్తాయో ఆసక్తి కలిగేలా చెప్పగలగాలి.



గిఫ్ట్ హ్యాంపర్ విజేత



పి.లావణ్య
తిరుపతి

21 చుక్కలు
11 వచ్చే వరకు


మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.



అయిలబోయిన భారతమ్మ
దబ్బీర్ పేట,
వరంగల్


21 చుక్కలు
సందు చుక్క
11 వచ్చే వరకు





కె. పద్మజ
యడవోలు
ప.గో.జిల్లా


19 చుక్కలు
3 వరుసలు, 3 చుక్కలు
చుక్క పక్క చుక్క





బోయినీ తిరుమల
శ్రీరాంపూర్ కాలనీ

26 చుక్కలు
10 వరుసలు
10 వచ్చే వరకు





ఎన్. గిరిజమ్మ
హిందూపురం,
అనంతపురం

21 చుక్కలు
11 వచ్చే వరకు
మధ్య చుక్కలు

కొత్త సంవత్సరం సంబరాలు జరిపేసుకున్నాం! కొత్త ఏడాదంతా ఆయురారోగ్యాలతో సాగాలని ఒకరినొకరం అభినందించుకున్నాం! మరి ఆ అభినందనలు ఫలవంతమవ్వాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరించాలి. అందుకోసం ఆహారం మొదలుకుని వ్యవహారం వరకూ ఆరోగ్యకరమైన రీతిలో సాగాలి. అప్పుడే రాబోయే కొత్త సంవత్సరాన్ని ఆనందంగా జరుపుకోగలుగుతాం!

365 రోజుల ఆరోగ్యం



ఆరోగ్యానికి అడ్డంకులు

[illegible]

సమతులాహారంతో సక్రమం

[illegible]

వీటితో ఆరోగ్యకర జీవితం సొంతం

[illegible]

❑ ప్రతిరోజూ అద్దం ముందు నిలబడ్డప్పుడు గొంతు దగ్గర థైరాయిడ్ వాపు ఉందేమో పరీక్షించుకోవాలి.

❑ 30 ఏళ్లు దాటిన ప్రతి మహిళా మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ పరీక్షలను ప్రతి 6 నెలలకోసారి చేయించుకోవాలి.

❑ లైంగిక జీవితం మొదలుపెట్టిన ప్రతి మహిళా రెండేళ్లకోసారి 'పాప్‌స్మియర్' [illegible]

క్యాల్షియం సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవటం, అవసరాన్నిబట్టి క్యాల్షియం మాత్రలు తీసుకోగలిగితే ఎముకలు గుల్లబారే 'ఆస్టియోపోరోసిస్' నుంచి తప్పించుకోవచ్చు.

డాక్టర్. శ్యామల
కన్సల్టెంట్ ఇంటర్నల్ మెడిసిన్, కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ, హైదరాబాద్..

మీకు తెలుసా?



[illegible]

పళ్లలో ఉండే ఫ్రక్టోజ్ మీద ఓ కన్నేయాలి!

[illegible] చేయించుకోవాలి. పరీక్షల్లో నిల్వలు పెరిగినట్టు కనిపిస్తే వెంటనే పళ్ల పరిమాణాన్ని తగ్గించాలి. ఈ పద్ధతి ప్రకారం యూరిక్ యాసిడ్ నిల్వల్లో హెచ్చుతగ్గులను గమనిస్తూ తగిన పళ్లను ఎంచుకోగలిగితే మధుమేహాన్ని నియంత్రించవచ్చు.

డాక్టర్. ఎ. ఉషశ్రీ,
సీనియర్ న్యూట్రిషనిస్ట్,
కేర్ హాస్పిటల్స్, బంజారా హిల్స్, హైదరాబాద్

హోమియో



నోటి దుర్వాసనకు దూరం

పొగాకు నమలటం, దంతక్షయం, పండ్లను సరిగా శుభ్రం చేయకపోవటం లాంటి కారణాల వల్ల నోటి దుర్వాసన వస్తుంది. అలాంటి కారణాలు, లక్షణాలను బట్టి నోటి దుర్వాసనను నివారించే పలు రకాల ఔషధాలు హోమియో వైద్యంలో ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి..

పల్సటిల్లా: నోటి దుర్వాసనతో పాటు గొంతు పొడిబారిపోవటాన్ని నివారిస్తుంది.

మెర్క్ సోల్: నోటి దుర్వాసనతో పాటు లాలాజలం అధికంగా ఊరటాన్ని, దంతక్షయాన్ని నివారిస్తుంది.

కార్బోవెజ్: నోటి దుర్వాసనతో పాటు ఇన్ఫెక్షన్‌లు, చిగుళ్లవాపు, రక్తం కారటాన్ని తొలగిస్తుంది.

కార్బోలిక్ యాసిడ్: పొట్ట ఉబ్బరం, మలబద్ధకం వల్ల ఏర్పడే నోటి దుర్వాసనకు [illegible]

[illegible]

చిగుళ్ల వ్యాధి: జింజివైటిస్ అనే చిగుళ్ల వ్యాధిలోనూ నోటి దుర్వాసన ఉంటుంది. చిగుళ్లు వాచి, నొప్పి పెడుతుంటే దంత వైద్యుల చేత చికిత్స చేయించుకోవాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోగలిగితే నోటి దుర్వాసనను వదిలించటం కష్టమేమీ కాదు.

ఫిట్‌నెస్

సైకిల్ తొక్కేయ్! హెల్త్ పట్టేయ్!

ఫిట్‌నెస్‌కి దగ్గరి దారి సైక్లింగ్. బరువును తగ్గించటంతోపాటు డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళనలను కూడా సైక్లింగ్ అదుపులో ఉంచుతుంది. సైక్లింగ్ గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలున్నాయి. అవేంటంటే...

❑ కీళ్ల నొప్పులున్నవాళ్లు 'స్టాటిక్ సైక్లింగ్' చేయాలి. అంటే....జిమ్‌లో ఉండే సైకిల్ తొక్కాలి.

❑ మధుమేహులు సైక్లింగ్ తొక్కాలనుకుంటే [illegible]

❑ పరిగెత్తటం వల్ల కీళ్ల మీద పడే ఒత్తిడి కంటే సైక్లింగ్ వల్ల పడే ఒత్తిడి తక్కువ.

❑ సైక్లింగ్ వల్ల కాలి పిక్కలు, తొడలు, పిరుదులు చక్కటి ఆకృతిని సంతరించుకుంటాయి.

❑ చలి కాలంలో పట్టేసే కండరాలు, కీళ్లు వదులవ్వాలంటే సైక్లింగ్ చేయాలి.

❑ రోజుకి కనీసం 30 నిమిషాల సైక్లింగ్ శరీరానికంతటికీ [illegible]



తుమ్ములు, జలుబులు, దగ్గులు...ప్రతి ఇద్దర్లో ఒకరిది ఇదే పరిస్థితి. చలికాలం ఇవన్నీ మామూలే! అని సర్దుకుపోతుంటాం. కానీ అలర్జీ తత్వం ఉన్నవాళ్లు ఇలా సర్దుకుపోతే మరిన్ని ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్టే! చలికాలం అలర్జీ ఇక్కట్లకు గురికాకుండా ఉండాలంటే కాస్త ముందుచూపు, మరికాస్త అప్రమత్తతతో వ్యవహరించాలి. ఈ చలర్జీకి చెక్ పెట్టాలి.!

చలర్జీకి చెక్!

శీతాకాలం సమస్యలు

[illegible]

కూల్ డ్రింక్స్ లాంటి చల్లని పదార్థాలు తీసుకోకూడదు. కొందరికి కొన్ని రకాల ఆహార పదార్థాలు తినటం వల్ల అలర్జీ లక్షణాలు మొదలవుతాయి. అవేంటో...ఎవరంతట వాళ్లే గుర్తించి వాటికి దూరంగా ఉండాలి. కొందరికి గుడ్లు, మరికొందరికి తీపి పదార్థాలు పడకపోవచ్చు.

- **పులుపు, కారం, తీపి:** రుచుల్లో విపరీతమైన తత్వం... అంటే, అతి పుల్లని, అతి తీపి, అతి కారం...ఇలాంటి పదార్థాలు అలర్జీ తత్వం ఉన్న వాళ్లు తినకపోవటమే మంచిది. [illegible]

తీపికి విరుగుడు కారం!

[illegible]

ఎలర్జీ చికిత్స సులువే!

[illegible]



ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

[illegible]

డాక్టర్ ఎమ్.మోహన్ రెడ్డి,
ఇ.ఎన్.టి స్పెషలిస్ట్,
[illegible]



మూలికా వైద్యం

పొట్ట అంతా హాయిగా...

ఎంతసేపూ, కడుపులోంచి వస్తున్న శబ్దాలవైపే మనసు వెళుతుంటే, ఎదురుగా ఉన్నది ఏం కనపడుతుంది! ఎదుటివాళ్లు చెప్పేది ఏం వినపడుతుంది!

నిరంతరం మలబద్ధకంతో సతమతమయ్యే వారి పరిస్థితి ఇలాగే ఉంటుంది మరి!

మనం తీసుకునే ఆహారం ఎంత గొప్పదైనా కావచ్చు. అందులో ఏదో ఒక మోతాదులో వ్యర్థాలు లేకుండా ఉండవు కదా!

ఆ వ్యర్థాలన్నీ పూర్తిస్థాయిలో విసర్జించబడుతున్నాయా, లేదా అని ఎంత మంది ఆలోచిస్తారు?

నిజానికి, అనేక రుగ్మతలకు ఆరంభ దశ, మూలకారణం మలబద్ధకమే.

• • • •

శరీరంలోని ఇతర జీవక్రియల్లాగే జీర్ణక్రియ, విసర్జన క్రియలు కూడా సహజంగా సాగిపోవాల్సినవే. కానీ, కొన్నిసార్లు ఎక్కడో తేడా వస్తుంది. ఆ వెంటనే సహజ ధర్మాలన్నీ కుంటుబడతాయి. ఈ స్థితిలో ఎక్కువ మందిని వేధించే ఒక ప్రధాన సమస్య మలబద్ధకం. ఈ సమస్య దీర్ఘకాలికంగా ఉంటే శరీరం విషతుల్యం కావడం, ఆ తర్వాత నిరంతరం రోగగ్రస్థం కావడం ఖాయం.

[illegible]

చూర్ణాలతో ఎంత కాలం?

[illegible]

జీవనశైలిలో మార్పులు

[illegible]

వైద్య చికిత్సలు

[illegible]



డాక్టర్. జి. లక్ష్మణ్ రావు,
మూలికా వైద్యులు
[illegible], హైదరాబాద్


మీకు తెలుసా?

ఆనందంతో కళ్ల [illegible] కారే నీటి మొదటి [illegible] కుడి [illegible] నుంచి, దుఃఖం[illegible] కన్నీటి మొదటి [illegible] ఎడమ [illegible] [illegible] వస్తుంది.

రెమెడీ

కాలిన గాయాలకు కలబంద

చర్మం కాలిన వెంటనే కలబంద గుజ్జు రాస్తే చిటికెలో మంట తగ్గడంతోపాటు, చర్మం మీద బొబ్బలు రావు.



పరిశోధన

కాలుష్యంతో తగ్గే ఐక్యు



[illegible]

పరిశోధన

విటమిన్ 'డి' లోపిస్తే...

[illegible]



[illegible]

- విటమిన్ 'డి' ను విడిగా కన్నా, సి, ఏ, ఇ, కె విటమిన్లతో కలిపి తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఈ తరహా విటమిన్ టాబ్లెట్లను వ్యాయామానికి కొద్ది నిమిషాల ముందు తీసుకోవడం ఉత్తమం.

డైలీ సుడోకు - 66

5		3	9		7	2		
1							9	
			4		6	5		
			5			4	7	
				4				
	8	2			3			
		6	1		4			
	9							3
		7	3		2	1		9

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు [illegible]

సుడోకు- 65 సమాధానం

[illegible]

సెక్సువల్ హెల్త్

సెక్స్ ఎంత తరచుగా?

ప్రశ్న: డాక్టర్! మాకు కొత్తగా పెళ్లైంది. మా దాంపత్యం ఆనందంగా సాగాలంటే మేం ఎంత తరచుగా సెక్స్‌లో పాల్గొనాలి? సంతృప్తికరమైన లైంగిక జీవితం గురించి ఒక్కొకరు ఒక్కో రకంగా చెపుతున్నారు. మా ఇద్దరికీ ఈ అనుభవం కొత్త. దాంతో అయోమయానికి లోనవుతున్నాం. తగిన సలహా ఇవ్వగలరు.

- స్వప్న, గుంటూరు.

జవాబు: సెక్స్ ఎంత ఎక్కువ ఉంటే ఆనందం అంత ఎక్కువ. అయితే దీనికీ ఓ కొలమానం ఉంది. ఆనందకరమైన లైంగిక జీవితం కోసం వారానికి కనీసం ఒకసారైనా సెక్స్‌లో పాల్గొనాలి. వయసు, జెండర్, బంధం...వీటన్నిటితో సంబంధం లేకుండా ఈ సూత్రం ఎవరికైనా వర్తిస్తుంది. అయితే సెక్స్ అనేది ఇద్దరి మధ్య సమ సంసిద్ధతతో జరపాల్సిన కార్యం. పడగ్గదిలో దంపతుల అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. కొందరికి వారంలో ఒకసారి చాలనిపిస్తే, మరొకరికి రోజులో రెండు సార్లు అవసరమనిపించవచ్చు. కాబట్టి ఈ విషయం గురించి దంపతుల మధ్య మంచి అవగాహన ఉండాలి. అలాగని ఒకరికి ఇష్టం లేకపోయినా బలవంతపెట్టడం తప్పు. ఇంకొకరు కోరుకున్నప్పుడు వద్దని వారించటమూ కరెక్టు కాదు. దంపతుల మధ్య సెక్స్‌ను మించిన అన్యోన్యత ఉంటే లైంగికతృప్తి సమంగా పొందే వీలుంటుంది. ఇక మీ విషయంలో చెప్పాలంటే కొత్తగా పెళ్లయిన దంపతులు కాబట్టి తరచుగా సెక్స్‌లో పాల్గొనటం సహజం. దీనికి లెక్కలు పాటించాల్సిన అవసరం లేదు. అయితే సెక్స్ అనేది అన్యోన్యతను పెంచే సాధనం మాత్రమేననే వాస్తవం గ్రహించి మసలుకోవాలి. ఒకరి అవసరాలు మరొకరు గుర్తెరిగి నడుచుకోవాలి. ఎన్ని సార్లు? అని కాకుండా...ఎంత తృప్తి పొందామనేది ముఖ్యం.

- డాక్టర్. షర్మిలా మజుందార్
చీఫ్ సెక్సాలజిస్ట్ అండ్ సైకోఅనలిస్ట్,
ఏవిస్ హాస్పిటల్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్.
Email mili77@gmail.com
Website- www.doctorsharmila.in

ఊపిరితిత్తులకు టమాటా వైద్యం!

హెల్త్ న్యూస్



పొగతాగటం, వయసు పైబడటం వల్ల ఊపిరితిత్తులకు ఏర్పడే ముప్పును తొలగించటంలో టమాటాలు అద్భుతంగా పనిచేస్తాయని పరిశోధనల్లో వెల్లడైంది. జర్మనీ, నార్వే, బ్రిటన్‌లకు చెందిన 650 మంది పెద్దలపై పరిశోధన నిర్వహించారు. వారు తీసుకునే ఆహారం, అది ఊపిరి తిత్తుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే తీరుపై దశాబ్దం పాటు పరిశోధన చేశారు. అందులో పొగ తాగటం వల్ల ఊపిరితిత్తులు దెబ్బతిన్నవారు తమ ఆహారంలో రోజూ టమాటాలు తీసుకోవటం మంచి ఫలితాన్నిచ్చింది. అలాగే ఆహారంలో యాపిల్ లాంటి పండ్లు రోజూ తీసుకుంటే వయసు పైబడటం వల్ల వచ్చే ఊపిరితిత్తుల పనితీరు మందగించటాన్ని నివారించవచ్చని కూడా వెల్లడైంది.

ఆంధ్రజ్యోతి నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 2 జనవరి 2018 4


అల్లు అర్జున్

నేనో సైనికుణ్ణి...

బోర్డర్‌కి వెళ్లి చచ్చిపోతా

'హూ ఆర్ యూ?(నువ్వెవరు?)' అనడిగితే... 'ఐయామ్ ఎ సోల్జర్(నేనో సైనికుణ్ణి)' అని గర్వంగా చెబుతాడు సూర్య. దాంతో పాటు అతడికి కోపమూ ఎక్కువే. ఇతరులు చెప్పేదీ అదే. 'ప్రపంచానికి సూర్య అంటే కోపమ'ని అంటుంటారు. ఆ కోపం వల్ల పై అధికారులతో తిట్లు, తన్నులు తిన్న సందర్భాలున్నాయి. అవన్నీ గమనించిన సూర్య శ్రేయోభిలాషి 'ఇలాగే కొన్ని రోజులైతే చచ్చిపోతావురా!' అంటే... 'ఇక్కడ కాదు సార్. బోర్డర్‌కి వెళ్లి చచ్చిపోతా' అనేంత దేశభక్తి అతడిది. అసలు, ఆ సూర్య కథేంటి? అనడిగితే... ఏప్రిల్ 27 వరకూ ఆగమంటున్నారు వక్కంతం వంశీ. ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. అల్లు అర్జున్ హీరోగా లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ ఇంపాక్ట్(టీజర్)ను సోమవారం విడుదల చేశారు. ఫస్ట్ ఇంపాక్ట్‌కి ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభిస్తోందని నిర్మాత తెలిపారు. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్-శేఖర్, సహనిర్మాత: 'బన్నీ' వాసు, సమర్పణ: కె. నాగబాబు.

నన్నందుకే గౌరవిస్తారు

- కాజల్



"అల్లాటప్పాగా నోటికి ఏది వస్తే అది నేనెప్పుడూ మాట్లాడను. ఉన్నత స్థానంలో ఉన్నంత మాత్రాన చుట్టూ ఉన్నవారిని హేళనగా చూడను. నా చుట్టూ ఉన్నవారితో నా ప్రవర్తన ఆత్మీయంగా ఉంటుంది. అధికారాన్నీ, అహంకారాన్ని ఎక్కడా వ్యక్తం చేయను. మాట తీరును బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేయొచ్చని చిన్నప్పుడు మా అమ్మ చెప్పింది. ఆ విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుని మసలుకుంటుంటాను" అని అంటున్నారు కాజల్. ప్రస్తుతం ఆమె ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో 'ఎం.ఎల్.ఎ', ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో 'అ!' చిత్రంలో నటిస్తున్నారు. తమిళంలో రమేశ్ అరవింద్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ప్యారిస్ ప్యారిస్'లో ఆమే నాయిక. కాజల్ మాట్లాడుతూ "మనసులో ఒకటి ఉంచుకుని, పైకి నటించడం నాకు చేతకాదు. అందుకే నా అభిప్రాయాన్ని ఎప్పుడైనా, ఎక్కడైనా నిర్భయంగా వెల్లడించడానికి వెనకాడను. ఏ విషయాన్నైనా అక్కడికక్కడే తేల్చేస్తాను. అంతేగానీ నాన్చుడు వ్యవహారం నా దగ్గర ఉండదు. కాబట్టే నన్నందరూ గౌరవిస్తారు. నా ముక్కుసూటితనాన్ని చాలా మంది ఇష్టపడతారు" అని తెలిపారు.


చైతూ... లైఫ్‌లో ఒక్క


సమంత, నాగచైతన్య

"జీవితంలో మనకు ఒక్క ఛాన్సే వస్తుంది! అప్పుడు ఎటువంటి తప్పులు చేయకుండా సరైన నిర్ణయం తీసుకున్నామా? లేదా? అనేది మన చేతుల్లోనే ఉంది" అంటున్నారు సమంత. మరి, అటువంటి సందర్భంలో ఆమె సరైన నిర్ణయం తీసుకున్నారా? లేదా? అంటే... 'యస్' అంటున్నారు. ఇంతకీ సమంత తీసుకున్న నిర్ణయం ఏంటో తెలుసా? స్పెషల్‌గా చెప్పాలంటారా... ఫోటోలో సమంతతో ఉన్న హ్యాండ్సమ్ హీరో అండ్ హజ్బెండ్‌ని చూశారా!! అక్కినేని నాగచైతన్య. అతణ్ణి పెళ్లి చేసుకోవడమే అట! "నేను తీసుకున్న నిర్ణయాల్లో సరైన నిర్ణయమిదే. అలాగే, భవిష్యత్ గురించి ఎదురు చూస్తున్నా. జీవితం మీరు తీర్చుకున్నట్లే ఉంటుంది. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు" అని నాగచైతన్యతో ఉన్న ఫోటోని సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ కొత్త దంపతులు ఇద్దరూ గోవాలో న్యూ ఇయర్ సెలబ్రేట్ చేసుకున్నారు.


విష్ణు, శ్రీయ

ఏనుగు తోడు... కొత్త కథ చెప్పాలని!


రానా

ఆరడుగుల ఎత్తు... అలవోకగా ఒక్క దెబ్బకు ఆరుగుర్ని కొట్టస్తాడన్నట్లుండే బాడీ... రానా కటౌట్ చూస్తే కమర్షియల్ సినిమాలకు కరెక్ట్ ఫిగర్ అన్నట్టుంటుంది. కానీ, రానా మాత్రం ఎప్పుడూ కొత్త కథల్లో నటించడానికి ఓటేస్తుంటారు. గతేడాది 'బాహుబలి-2', 'ఘాజీ', 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాలతో అలరించిన రానా ఈ ఏడాదీ మూడు విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. మూడింటిలో 'హాథీ మేరే సాథీ' (తెలుగులో 'ఏనుగు నా తోడు ఉంది' అనే అర్థం వస్తుంది) ఒకటి. 1971లో ఇదే టైటిల్‌తో విడుదలైన హిందీ చిత్రానికి రీమేక్ ఇది. ప్రభు సాల్మన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రంలో బాందేవ్ పాత్రలో నటిస్తున్నారు రానా. సోమవారం న్యూ ఇయర్ సందర్భంగా 'హాథీ మేరే సాథీ'లో ఆయన ఫస్ట్ లుక్ విడుదల చేశారు. "కొత్త కథ చెప్పాలని కొత్త ఏడాదిలో అడుగు పెడుతున్నా" అని రానా పేర్కొన్నారు. ఇది కాకుండా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న '1947', మలయాళంలో రూపొందుతోన్న 'రాజా మార్తండ వర్మ' చిత్రాల్లో రానా నటిస్తున్నారు.

అనుబంధాల అల్లిక... 'గాయత్రి'!

కొన్ని దృశ్యాలను ఎన్నిసార్లు చూసినా వెగటు పుట్టదు. అమ్మాయి తల్లో అబ్బాయి పువ్వులు తురమడం, అమ్మాయికి అబ్బాయి గోరింటాకు పెట్టడం, గోరుముద్దలు తినిపించడం... బారైన జుట్టు దువ్వి జడ అల్లడం.. ఇలాంటివన్నమాట. తాజాగా విడుదలైన 'గాయత్రి' స్టిల్ కూడా ఈ కోవలోనిదే. ఈ స్టిల్‌లో పై మెట్టు మీద విష్ణు, కింది మెట్టు మీద శ్రియ కూర్చున్నారు. విష్ణు దువ్వెనను నోట పట్టుకుని శ్రియ జడను శ్రద్ధగా అల్లుతున్న దృశ్యం ఉంది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ పోస్టర్‌ని విడుదల చేశారు. డా. మంచు మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. మదన్ దర్శకత్వం వహిస్తున్నారు. తమన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. అనసూయ భరద్వాజ్, నిఖిల విమల్, బ్రహ్మానందం కీలక పాత్రధారులు. వచ్చేనెల 9న విడుదల కానున్న ఈ చిత్రాన్ని శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ పతాకంపై అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పిస్తున్నారు. విజయ కుమార్.ఆర్. ఎగ్జిక్యూటివ్ నిర్మాత.


సూర్య, సెల్వ రాఘవన్

సూర్య ఒక్కరే యాప్ట్

సూర్య, సాయిపల్లవి జంటగా సెల్వ రాఘవన్ దర్శకత్వంలో నూతన చిత్రం సోమవారం ప్రారంభమైంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్. ప్రకాశ్ నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం సూర్య మాట్లాడుతూ "సెల్వ రాఘవన్ చెప్పిన కథ ఆకట్టుకుంది. నా 35 చిత్రాలకు భిన్నంగా ఉండే సినిమా. సాయి పల్లవి క్యారెక్టర్ ఇంపార్టెన్స్ ఉంది" అని తెలిపారు. ఈ కథకు సూర్య ఒక్కరే యాప్ట్ అవుతారు. ఆయనతో ఈ కథ చెయ్యడం ఆనందంగా ఉంది" అని సెల్వ రాఘవన్ అన్నారు. ఈ నెల 18న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. దీపావళికి సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని నిర్మాతలు వెల్లడించారు.

ఈ నలుగురే కీలకం...

రచయితగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీధర్ సీపాన 'బృందావనమది అందరిది' చిత్రంతో దర్శకుడిగా మెగాఫోన్ పట్టబోతున్న విషయం తెలిసిందే. డిసెంబర్‌లో షూటింగ్ మొదలుపెట్టారు. గుంటూర్ టాకీస్ ఫేం సిద్ధూ, సీరత్ కపూర్, పృథ్వీ, మాస్టర్ విక్రమ్ ఈ చిత్రంలో కీలక పాత్రధారులు. లగడపాటి శ్రీధర్ ఆశీస్సులతో జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శ్రీనివాస్ వంగాల, కూతురు ప్రభాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శ్రీధర్ సీపాన మాట్లాడుతూ "నేను రాసుకున్న కథకు అంతా కొత్తవారినే తీసుకోవాలనుకున్నా. సిద్ధూ, సీరత్ కపూర్, పృథ్వీ, మాస్టర్ విక్రమ్(లగడపాటి శ్రీధర్ తనయుడు)మినహా మిగిలిన వారంతా కొత్తవారే. నూతన సంవత్సరంలో ప్రధాన తారాగణం గురించి పరిచయం చేయడం ఆనందంగా ఉంది. ఈ నలుగురు కథకు పర్ఫెక్ట్‌గా యాప్ట్ అవుతారు. నలుగురూ సినిమాకు మూలస్తంభాలు అవుతారు. డిసెంబర్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించి కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. జనవరి 20 నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తాం" అని తెలిపారు.


సిద్ధూ, సీరత్ కపూర్, మాస్టర్ విక్రమ్, పృథ్వీ